RNI No. APTEL/2003/12253

# భావవీణ

కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

# BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

Vol : 21 Issue No. 9 Monthly September 2024 ISSN No. 2456-4702 Rs. : 15/-

డా॥. సర్వేపల్లి రాధాకృష్ణన్ జన్మదినం
సందర్భంగా ఆచార్యులకు,
సహ ఆచార్యులకు, ఉపాధ్యాయులకు,
రీసెర్చ్ స్కాలర్లకు, విద్యార్థినీ,
విద్యార్థులకు, పాఠకులకు
ఉపాధ్యాయ దినోత్సవ
శుభాకాంక్షలు...





## డా॥. సర్వేపల్లి రాధాకృష్ణన్

మాతెలుగు తల్లికి మల్లెపూదండ - మాకన్న తల్లికి మంగళారతులు

# భావవీణ

(కళలు - సాహిత్య - సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక)



# 135-14-716, Dwaraka Nagar, 12th Lane, Nagaralu, Guntur - 522 034.
Mail : bhavaveena2024@gmail.com
Cell : 99499 29674, 79890 88274.

**BHAVAVEENA**
(MONTHLY MAGAZINE)
Journal - Arts, Literature, Culture and Language Study

ISSN No. : 2456-4702
RNI No. : APTEL/2003/12253

| | | |
|---|---|---|
| ముద్రణ | : | సెప్టెంబర్ - 2024 |
| ప్రతులు | : | 500 |
| వెల | : | రూ. 15/- |
| కాపీలకు | : | డి. నెం. 135-14-716, 12వ లైన్, ద్వారకా నగర్, నగరాలు, గుంటూరు - 034. |
| గమనిక | : | ఈ సంచికలోని వ్యాసకర్తల అభిప్రాయములతో సంపాదక వర్గమునకు సంబంధం లేదు - సంపాదకవర్గం. |
| ఎడిటోరియల్ చిరునామా | : | డి. నెం. 135-14-716, 12వ లైన్, ద్వారకా నగర్, నగరాలు, గుంటూరు - 034. |
| డి.టి.పి & ప్రింటింగ్ | : | తెనాలి ప్రకాష్, జి.యల్.ఎస్. గ్రాఫిక్స్ గుంటూరు జిల్లా, సెల్ : 94 94 660 509. |




మాతెలుగు తల్లికి మల్లెపూదండ - మాకన్న తల్లికి మంగళారతులు

# BHAVA VEENA (భావ వీణ)

Journal of Arts, Literary, Culture & Language Study

(కళలు - సాహిత్య-సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక)

***Founder :***
Kolla Sri Krishnarao (Late)

***E-mail :***
bhavaveena2024@gmail.com

7989781963
9949929674
7989088274

# 135-14-716, Dwaraka Nagar,
12th Lane, Nagaralu, Guntur - 522034.

**Vol. 21 - Issue. 9 - September 2024 - ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253 - Rs. : 15/-**



**EDITORIAL BOARD**

*Honourable Editor*
**Dr. PITTA SANTHI**
*M.A.(Tel), M.Sc(Psy).,M.Ed.,M.Phil(Edu),Ph.D.*

*Chief Editor*
**Dr. PAYARDA NAGAIAH**
*M.A.(Tel), M.A(Pol-Sci).,M.Ed.,Ph.D.*
# 135-14-716, Dwaraka Nagar, 12th Lane, Nagaralu, Guntur - 522034.

**ADVISORY COMMITTEE**

1. **Prof. K. Madhu Jyothi,** M.A., PhD.
   Vice Chancellor,
   Dravidian University, Kuppam, A.P.
2. **Prof. G. Yohan Babu,** M.A., PhD.
   Dept. of Telugu,
   Andhra University, Visakhapatnam.
3. **Prof. C. Srirama Chandra Murthy,** M.A., PhD.
   Dept. of Telugu, Faculty of Arts,
   Benaras Hindu University, Varanasi, Utter Pradesh.
4. **Prof. Darla Venkateswara Rao,** M.A., M.Phil., PhD.
   Dept. of Telugu, Faculty of Arts,
   Hyderabad Central University, Hydetabad, Telangana.
5. **Dr. Thottempudi Sree Ganesh,** M.A., M.Phil (Computational Linguistics) (Ph.D)
   Research Scientist, Centre for Applied Linguistics and Transalation Studies, Universityof Heidelberg, Germany.
6. **Dr. Busi Venkataswamy,** M.A. (Tel)., M.A (San)., M.A (Ling)., PhD.
   Associate Professor, Dept. of Telugu &
   Chairman, BOS Philothrophy & Religion Studies,
   Andhra University, Visakhapatnam, A.P.
7. **Prof. T. Rama Prasad Reddy**
   Dean, Faculty of Arts & Education,
   Yogi Vemana University, Kadapa, Andhra Pradesh.
8. **Dr. T. Swarupa Rani,** M.Sc., M.Ed., M. Phil., Ph.D.
   Principal,
   St.Joseph's College of Education for Women,
   Sambasivapet, Guntur, Andhra Pradesh.

**ASSOCIATE EDITORS**

1. **Dr. N. R. SADASIVA REDDY**, M.A.,M.Phil,PhD.
   Asst. Professor,
   Dept. of Telugu & Comparative Literature,
   Sri Krishna Deva Raya University,
   Ananthapuram, Andhra Pradesh.
2. **Prof. V.SANKARA RAO**, M.A.,M.A.,M.Phil,PhD.
   HOD, Dept. of Telugu,
   Madras University,
   CHENNAI,
   Tamilnadu.

3. **Dr. D. SESHUBABU**, M.A.,M.Phil,PhD.
Asst. Professor, Dept.of Hindi,
Moulana Azad National Urdu University,
HYDERABAD, Telangana.

4. **Dr. K. Lavanya,** M.A., M.Phil., PhD.
Board of Studies Chairman,
Telangana University, Dichpally,
Nizamabad, Telangana.

5. Prof. **N.V. KRISHNA RAO,** M.A.,M.Phil,PhD.
Dept. of Telugu & O.L.,
Acharya Nagarjuna University,
Nagarjuna Nagar, Guntur District.

6. **Dr. A. JYOTHI,** M.A.,M.Phil,PhD.
Associate Professor, Dept. of Telugu,
Kakatiya University, Warangal District.
Telangana.

7. **Dr. J. VENKATA RAMANA,** M.A.,M.Phil,PhD.
Asst.Professor, Dept.of Modern Indian Languages,
Madhurai Kamaraj University, Madhurai,
Tamilnadu.

8. **Dr. N. Eswar Reddy,** M.A., PhD.
Associate Professor, Dept. of Telugu,
Yogi Vemana University, Kadapa.

9. **Prof. P.R. Harinadh,** M.A., M.Ed., M.Phil,PhD.
Dept. of Telugu,
Regional Institute of Education (NCRT)
Manasa Gangothri, Mysore, Karnataka.

10. **Dr. B. Tirupathi,** M.A., PhD.
Associate Professor, Dept. of Telugu,
University of Hyderabad, Gachibowli - 46,
Hyderabad, Telangana.

11. **Dr. P. VIJAYA KUMAR**, M.A.,M.Phil,PhD.
Vice Principal,
Govt. Degree College, Yemmiganuru.

12. **Dr. Mark Poloneyes,** M.A., M.Phil., PhD.
Principal & HOD,
P.G. Centre, Gadwal,
Palamuru University,
Mahabobnagar, Telangana.

**LEGALADVISER**

**Pitta Sundara Babu**, ***M.A., B.L.,***
Advocate, Narasapur.

**DTP & PRINTING**

**TENALI PRAKASH**, G.L.S. GRAPHICS, Guntur - 2. Cell : 94 94 660 509.

గమనిక : రచయితల అభిప్రాయములతో సంపాదక వర్గమునకు సంబంధం లేదు - **ఎడిటర్.**

Edited, Printed and Published by Dr. P. Nagaiah, #135-14-716, Dwaraka Nagar, 12th Lane,
Nagaralu, GUNTUR - 522 034. Andhra Pradesh. Cell : 9949929674, 7989088274.
E-mail : bhavaveena2024@gmail.com. Printed at : GLS Enterprises, Guntur - 2. Ph. 94 94 660 509.

# డా॥. సర్వేపల్లి రాధాకృష్ణన్

జననం : 1888 సెప్టెంబర్ - 5.            మరణం : 1975 ఏప్రిల్ 17

డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ భారత దేశ తొలి ఉప రాష్ట్రపతి మరియు రెండవ రాష్ట్రపతి (1962-67)గా పనిచేసిన గొప్ప విద్యావేత్త. స్వతహాగ వారు ఉపాధ్యాయుడు కాబట్టి సెప్టెంబర్ 5వ తేదీన వారి జన్మదినోత్సవాన్ని ఉపాధ్యాయ దినోత్సవంగా జరుపుకోవడం ఆనవాయితీ.

డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ 1888 సెప్టెంబర్ 5న తేదీన చిత్తూరు జిల్లాలోని తిరుత్తణిలో సర్వేపల్లి వీరాస్వామి, సీతమ్మ దంపతులకు జన్మించారు. వారి స్వగ్రామం ఆంధ్రప్రదేశ్లోని నెల్లూరు జిల్లాలోని సర్వేపల్లి. అతని బాల్య జీవితం తిరుత్తణి తిరుపతి జిల్లాలో గడిచింది. అతని తండ్రి స్థానిక జమీందారు దగ్గర సబ్ ఆర్డినేట్ రెవెన్యూ అధికారి. వీరాస్వామి గారికి ముగ్గురు సంతానం వారిలో రెండవవాడు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్. అతని ప్రాథమిక విద్యాభ్యాసం స్థానిక కె.వి. హైస్కూల్లో సాగింది. 1896లో ఆయన తిరుపతిలోని హెర్మాన్స్ బర్న్స్ ఇవాంజికల్ మిషన్ పాఠశాలలో చదివాడు. ఆ తర్వాత వాలాజా పేటలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రాథమిక విద్య పూర్తి చేశారు. మీరు బాల్యం నుంచి అసాధారణ తెలివితేటలు కలవారు. తర్వాత వారు హైస్కూల్ విద్య కోసం  వేలూరులోని వూర్హీస్ కాలేజీలో చేరాడు. ఎఫ్. ఏ.(ఫస్ట్ ఆఫ్ ఆర్ట్స్)తరగతి ఉతతీర్ణులైన తర్వాత అతని 16 సంవత్సరాల వయసులో మద్రాస్ క్రిస్టియన్ కాలేజీలో చేరాడు. అతను 1907లో అక్కడి నుండి పట్టభద్రుడయ్యాడు. అతను అదే కళాశాల నుండి తన మాస్టర్ డిగ్రీ కూడా పూర్తి చేశారు. సర్వేపల్లి రాధాకృష్ణ "ది ఎథిక్స్ ఆఫ్ ది వేదాంత అండ్ హిట్స్  మెటాఫిజికల్ ప్రిసపోజిషన్స్" అనే అంశంపై తన బ్యాచిలర్ డిగ్రీ పరిశోధన గ్రంథం రాశాడు. ఇది వేదాంత వ్యవస్థలో నైతికతను చోటు లేదని ఆరోపణలకు సమాధానంగా ఉద్దేశించబడింది. అతను సిద్ధాంతాన్ని ఇద్దరి ప్రొఫెసర్లు రెవరెండ్ విలియం మెస్టన్, డాక్టర్ ఆల్ఫ్రెడ్ జార్జ్ హగ్ రాధాకృష్ణన్ చేసిన ప్రవచనాన్ని మెచ్చుకున్నారు. రాధాకృష్ణన్ పరిశోధనలు కేవలం 20 సంవత్సరాలు వయసులో ప్రచురించబడ్డాయి.

డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్కు తన 16వ యేట శివకామమ్మతో వివాహం జరిగింది. వీరి అన్యోన్య దాంపత్యానికి గుర్తుగా ఆ దంపతులకు పద్మావతి, రుక్మిణి, సుశీల, సుందరి, శకుంతల అనే ఐదుగురు కుమార్తెలు జన్మించారు. వీరికి సర్వేపల్లి గోపాల్ అనే కుమారుడు కూడా ఉన్నారు. అతడు చరిత్రకారుగా చెప్పుకోదగిన వృత్తిని కొనసాగించారు. రాధాకృష్ణన్ కుటుంబ సభ్యులు అతని మనవళ్ళు మనవరాలు ప్రపంచ వ్యాప్తంగా అనేక వృత్తులలో స్థిరపడ్డారు. వీరు పబ్లిక్ పాలసీ, మెడిసిన్, న్యాయవాద వృత్తి, బ్యాంకింగ్, బిజినెస్, పబ్లిషింగ్ మరియు ఇతర రంగాల్లో వారు స్థిరపడ్డారు. మాజీ క్రికెటర్ వీ.వీ.ఎస్. లక్ష్మణ్ సర్వేపల్లి రాధాకృష్ణన్కు స్వయాన మేనల్లుడు.

సర్వేపల్లి రాధాకృష్ణన్ 1909లో మద్రాస్ ప్రెసిడెన్సీ లా కాలేజీలో ఫిలాసఫీ ప్రొఫెసర్గా, మైసూర్ విశ్వవిద్యాలయం ఉపకులపతిగా పనిచేశాడు.  మైసూర్ మహారాజా కళాశాలలో బోధించాడు. అతనీ

ఉపన్యాసాలు విద్యార్థులు ఎంతో శ్రద్ధగా వినేవాళ్లు. 1920 సంవత్సరంలో వారు రాసిన 'ది ఫిలాసఫీ ఆఫ్ రవీంద్రనాథ్ ఠాగూర్' మరియు "ది గ్రీన్ ఆఫ్ రిలీజియన్ ఇన్ కాంటెంపరరీ ఫిలాసఫీ" ప్రచురించబడినవి. 1921వ సంవత్సరంలో కలకత్తా విశ్వవిద్యాలయంలో ఆచార్య పదవి చేపట్టారు. 1926లో బ్రిటిష్ సామ్రాజ్యంలో విశ్వవిద్యాలయాల కాంగ్రెస్‌లో కలకత్తా విశ్వవిద్యాయానికి ప్రాతినిధ్యం వహించాడు. సెప్టెంబర్ 1926లో హార్వర్డ్ విశ్వవిద్యాయంలో జరిగిన ఇంటర్నేషనల్ కాంగ్రెస్ ఆఫ్ ఫిలాసఫీకి ప్రాతినిథ్యం వహించారు. ఈ కాలంలో జరిగిన మరొక ముఖ్యమైన విద్యా సంఘటన ఏమిటంటే 1929లో ఆక్స్‌ఫర్డ్ లోని మాంచెస్టర్ కాలేజీలో హిబర్ట్ జీవిత ఆదర్శాలపై ఉపన్యాసాన్ని అందించడానికి ఆహ్వానం అందింది. వారి ఉపన్యాసం "ఐడియాలిస్ట్ వ్యూ ఆఫ్ లైఫ్"గా పుస్తక రూపంలో ముద్రించబడింది. 1931వ సంవత్సరం ఏలూరులోనీ సి.ఆర్. రెడ్డి కాలేజీలో, తర్వాత ఆంధ్ర విశ్వవిద్యాలయం ఉప కులపతి గాను 1931-36 వరకు పనిచేశారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ పిలుపు మేరకు ప్రొఫెసర్ హిరేన్ ముఖర్జీ వంటి మేధావులు ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ప్రొఫెసర్‌గా పని చేశారు. 1937వ సంవత్సరంలో సర్వేపల్లి రాధాకృష్ణన్ నోబుల్ బహుమతి నామినేట్ అయ్యాడు. 1939 వ సంవత్సరంలో మదన్ మోహన్ మాలవ్య వారసుడిగా బెనారస్ విశ్వవిద్యాలయ కులపతిగా పనిచేశాడు. 14 తేదీన అర్ధరాత్రి స్వతంత్ర ఉద్యమం సిద్ధించిన సందర్భంగా రాధాకృష్ణన్ చేసిన ప్రసంగం సభ్యులు ఎంతో ఉత్తేజపరిచింది. 1946 నుండి 50 వరకు పలుమార్లు భారతదేశ తరపున యునెస్కో సభ్యుల బృందానికి అధ్యక్షుడు. 1948వ సంవత్సరం విశ్వవిద్యాలయాల విద్యా కమిషన్‌కు అధ్యక్షుడిగా, యునెస్కో అధ్యక్షుడిగా భారత్ ప్రభుత్వం నియమించింది. 1962లో బ్రిటిష్ అకాడమీకి గౌరవ సభ్యునిగా ఎన్నుకోబడ్డాడు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ గారు భారత దేశ ప్రభుత్వం తరపున ఎన్నో గౌరవమైన పదవులను అలంకరించి వాటికి వన్నె తెచ్చాడు.

**సర్వేపల్లి రాధాకృష్ణన్ :**

- 1933 - 37 సాహిత్యంలో నోబెల్ బహుమతికి ఐదు సార్లు చేయబడ్డాడు.
- 1938. సంవత్సరంలో బ్రిటిష్ అకాడమీ ఫెలోగా ఎన్నికయ్యారు.
- 1947 ఇన్స్టిట్యూట్ ఇంటర్నేషనల్ డి ఫిలాసఫీలో శాశ్వత సభ్యుడిగా ఎన్నికయ్యారు. 1959 ఫ్రాంక్ ఫర్ నగరం యొక్క గోదేప్లేక్ నమస్కారం.
- జర్మన్ బుక్ ట్రేడ్ యొక్క శాంతి బహుమతి.
- 1962 భారతదేశంలో ఉపాధ్యాయ దినోత్సవం ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 5న రాధాకృష్ణన్ పుట్టినరోజు జరుపుకుంటారు. 'ఉపాధ్యాయులు దేశంలోనే అత్యంత ఆలోచన గల వారిగా ఉండాలి' అనే రాధాకృష్ణన్ విశ్వాసాన్ని గౌరవిస్తూ ఈ దినాన్ని జరుపుకుంటారు.
- 1968 సాహిత్య అకాడమీ ఫెలోషిప్ ఒక రక్షకు సాహిత్య అకాడమీ అందించే అత్యున్నత గౌరవం అవార్డు పొందిన మొట్టమొదట వ్యక్తి సర్వేపల్లి రాధాకృష్ణన్.

- 1975 టెంపుల్ టన్ ప్రైస్ అందుకున్నాడు. ఈ టెంపుల్ టన్ ప్రైస్ మొత్తాన్ని అతడు ఆక్స్ ఫర్డ్ యూనివర్సిటీకి విరాళంగా ఇచ్చారు.
- 1989 డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జ్ఞాపకార్థంగా ఆక్స ఫర్డ్ విశ్వవిద్యాలయం వారు రాధాకృష్ణన్ స్కాలర్ షిప్ ల సంస్థ. స్కాలర్షిప్ లు తరువాత రాధాకృష్ణన్ సేవెనింగ్ స్కాలర్షిప్‌గా మార్చబడ్డాయి.

**డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ ముఖ్య రచనలు :**

1. 1908లో వేదాంతలలోని నియమాలు వాటి ఉపయోగం ఒక తలంపు. (ఎం.ఏ. పరిశోధన వ్యాసం)
2. 1918లో రవీంద్రనాథ్ తత్వం.
3. 1920లో సమకాలీన తత్వం పై మతం ఏలుబడి.
4. 1923 - 27లలో భారతీయ తత్వం (రెండు సంపుటాలు)
5. 1926లో హిందూ జీవిత దృక్కోణం.
6. 1928లో మనకు కావలసిన మతం.
7. 1929లో కల్కి లేక నాగరికత భవిష్యత్తు.
8. 1932లో ఆదర్శవాది జీవిత దృక్కోణం
9. 1933లో ప్రాక్ పశ్చిమాలలో మతం
10. 1936లో స్వాతంత్రం సంస్కృతి మరియు భారతీయ హృదయం
11. 1937లో సత్యశోధన (ఆత్మకథ)
12. 1938లో గౌతమ బుద్ధుడు
13. 1939లో మహాత్మా గాంధీ
14. 1944లో భారతదేశం చైనా, విద్య, రాజకీయ యుద్ధం.
15. 1945లో ఇది శాంతేనా
16. 1947లో మతం-సంఘం
17. 1948లో భగవద్గీత
18. 1949లో భారతీయ మహనీయులు
19. 1955లో తూర్పు, పడమర కొన్ని చింతనలు
20. 1967లో మారుతున్న ప్రపంచంలో మతం
21. 1969లో తూర్పు మతాలు, ప్రాశ్చ్యాత్యా చింతనలు (రెండవ కూర్పు).

భావవీణ
ISSN No. : 2456-4702
RNI No. APTEL/2003/12253

డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ ఉపాధ్యాయ వృత్తిలో ఉన్నప్పుడు విద్యార్థులకు శ్రద్ధగా బోధించడమే కాదు వారిపై ప్రేమాభిమానాలు చూపేవారు. అతను మైసూర్ నుంచి కలకత్తాకు ప్రొఫెసర్‌గా వెళ్లేటప్పుడు గుర్రపు బండిని పూలతో అలంకరించి తమ గురువుని కూర్చోబెట్టి రైల్వే స్టేషన్ వరకు విద్యార్థులు లాగుకుంటూ వెళ్లారు. తమ విద్యార్థులకు తన గ్రూప్ పట్ల ఉన్నటువంటి ప్రత్యేకమైన ప్రేమ అభిమానం. రాధాకృష్ణన్ రాష్ట్రపతిగా ఉన్నప్పుడు తనును శిష్యులు, అభిమానులు పుట్టినరోజును ఘనంగా చేస్తామని కోరగా దానికి బదులుగా ఆ రోజున ఉపాధ్యాయ దినోత్సవంగా చేయాలని వారిని కోరాడట. ఆ రోజు నుంచి అతను పుట్టినరోజును ఉపాధ్యాయ దినోత్సవ జరుపుకోవటం భారతదేశంలో ఆనవాయితీగా మారింది. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ 1975 ఏప్రిల్ 17 తేదీన 86 సంవత్సరాల వయసులో మద్రాసులో మరణించారు.

- చీఫ్ ఎడిటర్

# Contents (విషయ సూచిక)


| | | | |
|---|---|---|---|
| 1. | గొర్ల కాపర్ల జీవిత గాథలు 'గొంగడి' కథలు | - డా॥. ఎన్. రజని | 10 |
| 2. | ఎఱ్ఱన రచనల్లో - మాట తీరు | - డా॥. బాశెట్టి లత | 15 |
| 3. | మూఢ విశ్వాసాలను పారద్రోలిన వైతాళికుడు గురజాడ | - డా॥. డి. జ్యోతమ్మ | 20 |
| 4. | స్త్రీవాద సాహిత్యంలో తొలి పద్యకావ్యం - జ్వలిత కౌసల్య అంతరంగం | - డా॥. ఎమ్. పద్మగౌరి | 23 |
| 5. | గిరిజనుల పంచాయతి వ్యవస్థ మళావ్ | - డా॥. బానోత్ స్వామి | 26 |
| 6. | లంబాడాలు 'రాజపుత్రులా' వీళ్ల మూలస్థానమేది | - డా॥. లక్ష్మణ్ నాయక్ బాణోత్ | 30 |
| 7. | బతుకమ్మ పండుగ - చారిత్రక నేపథ్యం, ప్రత్యేకత | - మేకల శిరీష | 35 |
| 8. | ఓ విజేత | - చిట్టూరి జగదంబిక | 40 |
| 9. | సుద్దముక్క కవిత్వంలో ఉపాధ్యాయవృత్తి ఔన్నత్యం | - రేణ ఈశ్వరయ్య | 43 |
| 10. | శ్రీమద్రామాయణ కల్పవృక్షం-ఆచార వ్యవహారాలు-శాస్త్రీయత | - అరిగెల శ్రీకాంత్ | 47 |
| 11. | శివరామ కారంత్ నవల చోముని దుడి తెలుగు అనువాదం | - డా॥. గుండ్లూరు వెంకట రమణ | 50 |
| 12. | తెలుగు మగువల వెలుగు కిరణం | - డా॥. పురుషోత్తం గుంట | 54 |
| 13. | బంజారా సాంస్కృతిక వైవిధ్యంలో తీజ్, శీత్లా పండుగల గేయాల పాత్ర | - సాలి ధనావత్ | 57 |
| 14. | జానపదం - పాటలు | - పి. బాలముని శివకుమార్ | 63 |
| 15. | రాయలసీమ రచయిత్రుల కథల్లోని పాత్ర చిత్రణ | - కోడూరు జయప్రకాష్ | 66 |
| 16. | గిరిజన జీవన విధానంలో సామెతలు | - వి.యల్.నరసింహారావు | 69 |
| 17. | అంతరించిపోతున్న జానపద కళలు - పరిరక్షణ మార్గలు | - ప్రసన్న లక్ష్మీ మాదిరాజు | 72 |

# గొర్ల కాపర్ల జీవిత గాథలు 'గొంగడి' కథలు

– డా॥. ఎన్. రజని, అసోసియేట్ ప్రొఫెసర్, తెలుగుశాఖ, డా.బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం

ఇతివృత్తాల చుట్టూ పరుచుకున్న గొంగడి ఇది. ఇందులో మొత్తం 18 కథలున్నాయి. ఈ కథల గొంగడిని కప్పుకొని ఒక్కొక్క కథనూ విందాం రండి. నిజంగా కథలు అనడం కన్నా జీవిత గాథలు అంటే బాగుంటుందేమో కథలో కొంత కల్పితం అవసరమేమో ఈ కథలేవి కల్పితాలు కావు. నిజజీవిత గాథలు. ముఖ్యంగా గొర్ల కాపర్లకు గొర్రెలకు సంబంధించినవి మాత్రమే. మూగ జీవాలకు మనుషులకు ఉన్న సంబంధం. మనుషులకు ముఖ్యంగా గొర్లకాపర్లకు ఇతర ప్రపంచానికీ ఉన్న సంబంధం. మొత్తంగా మనం ఆ గొంగడి కప్పుకొని గొంగడి తయారీ వెనుక ఉన్న గొర్రెల ఉన్ని, ఆ గొర్రెల వేదనలు వాటిని సంరక్షిస్తున్న గొర్ల కాపర్ల వేదనలు వారి జీవితాలు, కుటుంబాలు అన్నింటినీ అనుభవిస్తాము. ఒక్కసారి ఆ గొంగడి వెనక, గొంగడి కింద ఉన్న సమస్త యాతనల్ని అనుభవిస్తాం. ఆ గొర్రెల కాపర్ల కుటుంబాలను, తల్లి దండ్రులను, వాళ్ళ చుట్టూ ఉన్న ప్రపంచాన్ని దర్శిస్తాం. నిజంగానే ఆ గొంగడి ఏమిటో, ఆ గొంగట్లో ఉన్నవేమిటో ఆ జీవనాన్ని ఆ కథలను ఇప్పుడు తెలుసుకుందాం.

'అవశేషం' బండి నారాయణస్వామి కథ. కురవోళ్ళు చేసుకునే పండుగ ఇతివృత్తంతో ప్రారంభమవుతుంది కథ. ఆ ఊర్లో 50 ఏండ్ల తర్వాత జరుగుతున్న పెద్ద పండుగ ఆ పండుగకు పూర్వపుతరం, నేటితరం అమ్మ కొడుకు కలిసి వస్తారు. అమ్మ 50 ఏండ్ల తర్వాత వస్తే కొడుకు మళ్ళీ ఇక చూడలేనని వస్తాడు. సంచార జాతులు ఏర్పాటు చేసుకున్న ప్రత్యేక స్థలంలో పండుగకు వేదిక సిద్ధం అయింది. మనుషుల మధ్య ఉండవలసిన సాన్నిహిత్యంతో పాటు విశ్వాసాలు ఎట్లా మానవ సంబంధాలను కలిపి ఉంచుతాయో ఒక ఆధ్యాత్మికతకు నాగరికతకు మధ్య ఉన్న తేడాలను కూడా ఈ కథ తెల్పుతుంది. ఏ విశ్వాసమైనా మనిషికి కీడు చేయనంత వరకు మంచిదే అనే సందేశం కూడా అంతర్లీనంగా కనిపిస్తుంది. అదేవిధంగా రాసాని రాసిన "మల్లేషు కుక్క" కథలో గురవయ్య వృత్తిలోని సాధకబాధకాలను చర్చిస్తుంది. గొరవదీక్ష కురవోళ్ళ వంశాచారం కానీ ఇప్పుడా వంశాచారం వాళ్ళకేమిచ్చింది అనే మౌలికమైన ప్రశ్న వేస్తారు రచయిత.

'పుల్లర' నందిని సిధారెడ్డి రాసిన కథ. అడవిలో తిరుగుతూ గొర్రెలను మేకలను మేపుకొనే ఒక అమ్మాయి మనసును ఆవిష్కరిస్తారు రచయిత. బీరవ్వ అనే పన్నెండేండ్ల అమ్మాయి "బొడ్డెమ్మల పండుగయి పోయింది. అయిదురోజులల్ల ఒక్కరోజే ఆడుకున్నది ఏమయినా సరే బతుకమ్మ మాత్రం అన్ని రోజులు సుతం ఆడుకోవాలని అనుకున్నది. ఆ మాట అయ్యతో కూడా అన్నది. సరేనంటుండు కానీ రోజు మందకు పోవుడే ఎంగిలిపూల అమాసకు మంకు జేసింది. అడవికిపోనని మొండి పట్టు పట్టింది. అయ్య బీరవ్వకు ఆశపెట్టి పంపించిండు. నాలుగు రోజులు జొన్నకోతలయితయి నాలుగు రోజులు మందగాసుకొస్తే కొత్త లంగ, కొత్త జాకెట్ పట్టిస్తనన్నడు కొత్తలంగ మోజుతోని బీరవ్వ మంద గాయటానికి ఒప్పుకున్నది. ఆ ఆశ కోసం పాపం బీరవ్వ గొర్ల కాయడానికి పోతుంది. బిడ్డను కష్టపెట్టడం ఇష్టం లేకున్నా తప్పని తండ్రి పరిస్థితి. ఇవన్నీ వెరసి రెండు మేకలు తప్పి పోతాయి. పాపం బీరవ్వకు కండ్ల నీరు ఆగడం లేదు అడవి పోలీసోళ్ళు వచ్చి మేకలు పట్టు కున్నరు. దానికి "పుల్లర" కట్టమని సతాయిస్తున్నరు. బీరవ్వ, మరికొంతమంది గొర్లకాపరులు గొర్ల దిక్కే చూసుకుంట ఆగమైతున్నరు. అట్లా ఇట్లా యాభైమంది జమయింట్రు. పెద్ద బీరన్న కులపెద్ద అసలు ఫారెస్టోళ్ళు గొర్లకాపరులకు చేసే, చేస్తున్న మోసాన్ని వివరించాడు. అడవిలో అన్నలు చెప్పే మాటల్ని ఆలోచించమన్నడు. అడవి మనది. అడవిలో ఉన్న అన్నీ మనవే అంటూ ఒక తిరుగుబాటు చేసి వాళ్ళ గొర్రెలను వాళ్ళు దక్కించు కున్నరు. మొత్తంగా ఈ కథ గొర్ల కాపరుల జీవితం, ముఖ్యంగా చదువుకుంటూ ఆడుకుంటూ ఉండాల్సిన

వయసులో పిల్లలు శ్రమదోపిడీకి గురవడం, ఫారెస్టు వారి దోపిడీకి ఎదురు తిరగడం, సంఘం ప్రభావం, విజయం సాధించడంతో ఈ కథ ముగుస్తుంది.

"తోడేళ్ళు" కథ బోయ జంగయ్యది. భూస్వాముల జమీందార్ల అరాచకాలు తోడేళ్ళ గుంపు కన్నా కష్టమైనవి. కాపరి మల్లయ్య తన బిడ్డ పెళ్ళికి అయిన అప్పు ఎన్ని గొర్రెలు అమ్మితే తీరుతుందో అని ఆలోచిస్తున్నడు. గొర్రెలను మేపుతుంటే పైన పక్షులు అరుపులు ఏదో కీడు శంకించింది అనుకుంటాడు. గొర్ల ఆందోళన గ్రహించిన మల్లయ్య మరొకసారి చుట్టూ చూస్తూ ఒర్రె వైపుకు నడుస్తూ ఊరివైపుకు చూపు నిలిపాడు. పరుగెత్తుకొస్తున్న గుర్రపు డెక్కల శబ్దాన్ని ఆ ప్రాంతంలోని పశుపక్షాదులు విని రాబోయే అపాయాన్ని గుర్తించే నేర్పును పెంచు కున్నాయి. తోడేళ్ళొచ్చినా, తోడేళ్ళలాంటి మనుషులొచ్చినా అవి ఇట్టే పసిగట్టగలవు. పరుగెత్తుకొస్తున్న గుర్రాన్ని చూడగానే మల్లయ్య కాళ్ళల్లో వణుకు మొదలయింది. ఆమ్మో నా మంద ఇక మాయమైతది అనుకుంటూ గొర్రెల వైపు నడిచాడు.

విసునూరి రామచంద్రారెడ్డి కొడుకు తోడేలులాగా గొర్లమందపై పడ్డాడు. ఆ తోడేలు తుపాకి దెబ్బకు గొర్రెలను తోడేళ్ల నుండి, నక్కల నుండి కాపాడుతూ వస్తున్న కుక్క తన ప్రాణాన్ని మనుషుల నుండి కాపాడుకోలేక పోయింది. గొర్రెల మందపై గొర్రెలో గొర్రెగా దాక్కున్న మల్లన్నపై విసునూరి రామచంద్రారెడ్డి అరాచకం. ఇట్లాంటి దృశ్యాలు విసునూరి దొర దౌర్జన్యాలకు సాక్ష్యాలు. గొర్రెల తలలు, గొర్రెలాంటి మనుషుల తలలు ఈ దొరల రాజ్యంలో పైకెత్తేదెప్పుడో అన్న ఆలోచనతో కథ ముగిస్తాడు రచయిత.

జూకంటి జగన్నాథం రాసిన "యాతన" కథ ఈ మధ్య కాలంలో విడుదలైన 'గోట్ లైఫ్' సినిమాను, దాన్ని ఆధారం చేసుకుని వచ్చిన 'మేకబతుకు' పుస్తకానికి సూక్ష్మ రూపంగా అనుకోవచ్చు.

నర్సయ్య అచ్చంగా 'నజీబ్' లాగే కరీంనగర్ జిల్లా బండలింగంపల్లి ఊరి నుంచి బయల్దేరి ఎక్కడో సౌదీలోని ఉబ్రియో ఎడారిలో గొర్లను కాస్తున్నాడు. సౌదీలోని ఉబ్రియో ఎడారిలో ఒంటరిగా అనాథగా గొర్రెలతో పాటు గొర్రెగా, మేకలతో పాటు మేకగా భయంకరంగా "ఒంటి ఊపిరి" ప్రాణంగా దినదిన గండంగా గడుపుతున్నాడు అంటారు రచయిత. ఈ వాక్యంలోనే మొత్తం నర్సయ్య జీవితం కనిపిస్తుంది.

"నీ పెండ్లాం పిల్లగాండ్లను మీ అవ్వ నేనూ బొందిల పానమున్నంతసేపు బోర్లాడైనా మంచిగ సూత్తం బిడ్డా నర్సయ్య మంచి పెడ్డలు తెలియజెయ్యి. ఇగ మీ అవ్వ మాట్లాడుతదట" ఈ సందేశం క్యాసెట్ లో రికార్డు చేసి పంపిస్తే అది నర్సయ్యకు చేరి అది వినే అవకాశం, సమయం దొరికినప్పుడు విన్న నర్సయ్యకు కళ్ళల్లో నీళ్ళు ఈ సందేశం కాని దేశంలో తాను పడే యాతనకు భోరున ఏడ్వాలనుంది. మళ్ళీ తల్లి సందేశం వినడానికి మళ్ళీ "Start" బటన్ నొక్కిండు పెద్దకొడుకా బంగారు కొడుకా తల్లి ఏడుస్తూనే ఉంది. బెంగటిల్లకు బిడ్డా నిజం చెప్పు పెయ్యి పదిలం" తల్లి మనోవేదన బిడ్డా యాళ్ళకు తిను అంటూ పెట్టేసింది. తల్లీ లచ్చవ్వ. అవ్వ యాది కొచ్చింది. కాళ్ళకు చెప్పులు లేకుంటే చిన్నప్పుడు మామ తోని కొట్లాడి ఒక పూట తినక అలిగి తనకు చెప్పులు కొనిపిచ్చిన ప్రేమ గుర్తుకొచ్చింది. దు:ఖం ఆగడం లేదు. మళ్ళీ క్యాసెట్ ఆన్ చేస్తే భార్య భాగ్య గొంతు నేను భాగ్యను గిన్నేల్లు అయిపాయే ఒక ఉత్తరం పత్తరం లేదు. పిల్లలు బాపును కలవరియ్యవట్రి నాకేమో నువ్వు పోయినప్పట్నుంచి సగంనిద్ర సగంబువ్వ అయితుంది. నా మనసేందో నీకు తెలుసు కదా నీ పానం జాగ్రత్త ఇగో పిల్లలు మాట్లాడుతరు అన్న భాగ్య మాటల్లోని ప్రేమ ఆప్యాయత తలుచుకొని తట్టుకోలేక పోతున్నడు. పిల్లలు... బాపు నేను రాజేశ్వర్ని నేను అర్జున్ను అమ్మకు ఆసర బీడీలకు దారం సుడుతున్న పరీక్షల్ల మార్కులు మంచిగనే అచ్చినయ్. బాపు నాకు గడియారం నాకు గొలుసు నువ్వు ఏమి పంపకుంటేమానె తియ్యి ఉత్తరాలు ఎయ్యే, నీ మాటినక చాలా రోజులైంది. ఒక్కసారి మాట్లడవే బాపు పిల్లల తండ్లాట ఇవన్నీ నర్సయ్యకు కళ్ళల్లో రక్తం చారలు కట్టింది. పిల్లలకు భాగ్యకు అవ్వయ్యలకు ఏం చెప్పాలి ? నర్సయ్య మదినిండా ఆలోచనలు కంచర గాడిదనెక్కి గొర్రెలు కాస్తున్నాను. పోస్టాఫీసు లేదని చెప్పాలా? (యెదువా) యజమాని

తిట్టిన తిట్లు, కొట్టే కొట్లు ఇసుక తుఫానులు ట్రక్కుల కింద తల దాచుకోవడాలు మానవ సంచారం లేని ఈ ఎడారి గురించి ఏం చెప్పాలి. అని తన మనసులోనే నిర్ణయించుకుని మళ్ళీ క్యాసెట్ తన సందేశంతో నింపిండు.

అయ్యా! అవ్వా! మీ నర్సిగాన్ని అక్కడున్న క్యాన్లోని నీళ్ళు తాగి తన మాటను రికార్డు చేయడానికి టేప్ ముందు కూచున్నడు. తీరాన్ని దాటే ప్రచండ తుఫాను లాగా ఉన్నడు. అయ్యా అవ్వా ఫికరు చేయకుండ్రి ఇక్కడ పనిలో మత్తు కట్టముంది. తండ్రిలేని నా చిన్న పోరగాండ్లను కోడలు పిల్లను జర దగ్గరకు తీసుకోండి. భాగ్యా భాగ్యా పెద్దోళ్లు వద్దన్నా వచ్చినందుకు అనుభ విస్తున్న మనసు మత్తుగ కొట్టుకుంటుంది మీ మీద. మన నొసట్లో కట్టపు రాత అడుక్కొచ్చుకున్నం యాడాదికే అచ్చిపోదామనుకుంటే పుజాల్ గా యాభైవేల కర్చాయె నువ్వూ పిల్లలు కండ్లల్ల ఉన్నట్టున్నది. బిడ్డా తల్లీ రాజేశ్వరీ మీ బాపును బిడ్డా నువ్వు బడికి పోయి మంచిగ సదూకోవాలె బిడ్డా బిడ్డా ముద్దులు ముద్దులు టేపుకాడికి దగ్గరికి జర్గుని అంటూ పిల్లల్నీ తన కళ్ళల్లో నిలుపు కుంటూ నర్యయ్యా వుంటా భాగ్యా వుంటా అంటూ క్యాసెట్‌ని రికార్డింగ్‌ని ఆపాడు. కడుపులో పేగులు దేవినట్టు కళ్ళు సముద్రాలయ్యాయి. ఒక అన్నం ముద్దకోసం దేశదేశాలు విడిచి ఎడారిలాంటి జీవితం జీవితం లాంటి ఎడారి బతుకు తల్చుకొని దు:ఖిస్తూనే ఉన్నడు. ఆ యాతన ఎవరికీ మానవ మాత్రులకు రావద్దు. ఒక నర్సయ్యా జీవితం మేక బతుకు నజీబ్ జీవితమే. ఈ జీవితాలకు విముక్తి ఎప్పుడు అనే ప్రశ్నను మన ముందుంచుతాడు రచయిత.

పెద్దింటి అశోక్ కుమార్ రాసిన ''ఇగురం'' కథ. వీనికంటే ఈ జీవాలే నయం. ఏ మందల జీవాలు అదే మందలకు చేరుతాయి. వీడు మాత్రం ఎప్పుడు ఆ రైతుల ఎంబటే ఉంటాడు. గొర్రె పోతును ఇరగ చూసిన మల్లయ్యను ఒక పక్క గమనిస్తూనే బీరయ్య అను కుంటున్నాడు. ఇట్లా దసర పండుగకు గొర్రె పోతును బలి ఇవ్వాలి తన గొర్రె పోతు మీద కన్నుపడ్డ ఊరి జనాలకు తగిన బుద్ధి చెప్తాడు బీరయ్య. ఊరోల్ల బాధకు తన గొర్రె పోతును దాసి పెడ్తాడు. ఆ మాట విన్న బీరయ్య భార్య కూడా కోమల జాలిగా భర్తవైపు చూసి ఇట్లంటది. అడవిల తిరిగి చెట్టుచెలుక మర్మం దొరికిచ్చుకున్నవు గనీ మనుషుల మర్మం దొరికిచ్చుకోలేదు. నిజంగానే మన చుట్టున్న మనుషుల ప్రవర్తనలను తెలుసుకోలేకపోయిన బీరయ్య అమాయకత్వాన్ని ప్రశ్నిస్తుంది భార్య. నిజంగానే మన చుట్టూ ఉన్న తోడేళ్ళ లాంటి మనుషుల మధ్యలో బతకాలంటే మేకలాంటి మనిషికి ఇగురం కావాలి అని చెప్పే సందేశం ఈ కథలో కన్పిస్తుంది. ఒక గొర్రె పోతును మనుషుల నుంచి తప్పించడానికి పడే తాపత్రయమే ఇగురం కథ.

భూపాల్ రాసిన సేవకుడు కథ మనుషుల కన్నా కుక్కల విశ్వాసం గొప్పది అని చెప్పే కథ. కూసుగాడు వాడికున్న కుక్క మల్లేశం కూసుగాడి పేరు కొమురయ్య. కానీ కూసుగాడు గానే సుపరిచితం. కూసుగాడు గొర్రెలు కాస్తుంటే తోడుగా కాపలాగా ఎప్పుడూ అంటి పెట్టుకొని మల్లేశు ఉంటాడు. కూసుగాడికి జ్వరమొచ్చి కునుకు తీస్తే మొత్తం మల్లేశు కాపలా ఉంటాడు. కంటికి రెప్పలా గొర్లను చూసుకుంటాడు. ఈ లోపల ఒక తోడేలు వచ్చింది. ఆ తోడేలుతోటి యుద్ధం చేస్తాడు. మల్లేశు ఇతర గొర్ల కాపర్లకి విషయం తెలిసేలా మొరుగుతూనే ఉంటాడు మల్లేశు. మల్లేశుని తోడేలు కరిచింది. అది ఎంత విశ్వాసం కలదంటే తనకు గాయమైనా సరే తన గొర్రెల మందను తొడేలు నుండి కాపాడింది. యజమాని కళ్ళలోకి ఆనందంగా చూసింది. తోటి జంతువుల ప్రేమ గుణాన్ని ముఖ్యంగా కుక్కకున్న విశ్వాసాన్ని ఈ కథలో చెప్పే ప్రయత్నం చేసారు భూపాల్ గారు.

నల్ల భూమయ్య రాసిన ''గొల్ల మల్లక్క'' కథ మల్లక్క బతుకు బాగున్నప్పుడు ఊరందరికి పభోజనాలు పెట్టింది. పిల్లలు చిన్నగున్నప్పుడే భర్త చనిపోతే ఇద్దరు మగ పిల్లలకు ఒక్క ఆడపిల్లను పెంచి పెద్ద చేసి పెండ్లిడ్లు కూడా చేసింది. భర్తలేని స్త్రీని సమాజం ఎట్లా చూస్తుందో తెలుసు కనుక కొంత మొండితనం గట్టితనం తెచ్చుకుని అందరికి పాలుపోసుకుంటు జీవితాన్ని గడిపింది.''ఉద్దెర'' బలం మీద బతుకుంట వచ్చింది. మల్లక్కకు తన పాలను హెూటల్లో అమ్ముకునే అంత బలం లేదు. మీటరేసి చెక్

చేస్తరు. పాలకుండని నేలకేసి కొడ్తరు. కల్తీపాలు, పల్చటి పాలు అనుకుంట తిట్టిపోస్తరు. గందుకని మల్లక్క తన పాలను హెూటల్లో అమ్మితే బతుకు లేదు. "ఉద్దెర" బలం మీద బతికింది.

ఒక స్త్రీ తన జీవన పోరాటం కుటుంబం కోసం, ఎంత దృడంగా ఉండాలి. చుట్టు ఉన్న రకరకాల మనుషులను ఎదుర్కోవడానికి తనను ఎట్లా మొండి తనంతో మలుచుకోవాలో ఈ కథ స్పష్టం చేస్తుంది.

చిల్ల మల్లేశం రాసిన "ఒగ్గుకథ" కథ. సమకాలీన సమాజంలోని కాపు రాజయ్యను, మిద్దె రాములును గుర్తు చేస్తూ మొదలవుతుంది. "అట్లట్లా లేడు ఆరడుగుల ఎత్తున్నడు సక్కని దోతికట్టు నొసలుకు ఊదుబొట్టు నెత్తికి రుమాలు, భుజాన పంచె, కాళ్ళకు గజ్జెలు శేతికి దండ కడియాలతో సూడంగ దండం బెట్టబుద్దయింది. ఆ ఒగ్గుకథ మంచి తెలంగాణ భాషల ఉంటే ఇప్పటి సినిమాలు ఆంధ్రోళ్ళ భాషల ఉన్నయనే అర్థమైంది. మొత్తానికి ఒగ్గుకథ సహజమైన పల్లె కళారూపమని మట్టివాసన కలిగిందని అట్లాంటి రూపాలను బతి కించాల్సిన కర్తవ్యం ముందు తరాల మీద ఉందని రచయిత పాఠకులకు తెల్పుతాడు.

గీతాంజలి రాసిన "గొర్లు" కథ నిడివి కొంచెం పెద్దగా ఉంది. కానీ ఆ కథలో అన్ని అంశాలనూ మేళవించడానికి ప్రయత్నించింది రచయిత్రి. పంటపండని పొలాలు పాలమూరు వలస కార్మికులు, రైతుల కష్టాలు, అడవుల్లో అన్నలు, గొర్రెలు, గొర్ల కాపర్లు వారి జీవితాలు దేశాలు పట్టిపోయే వారి దుస్థితి ఎంతో వాస్తవికంగా చిత్రించింది. "ఆ చీకటి రాత్రి జంగల్ల పాములు తోడేళ్ళ పులుల భయం ల్యాకుండ కూసుని ఏడుస్తున్న దేవన్న దుఃఖం జంగలంతా కలి తిరిగినట్లైంది. దేవన్న దుఃఖాన్ని ఆ అడవి జంతువులు ఏమర్థం చేసుకున్నయో మల్ల ఆ దిక్కు రాలే అంటూ రచయిత్రి వర్ణించిన తీరు చూస్తే దుఃఖం ఆగదు. గొర్ల ఆసాములు పెట్టే కష్టాన్ని తట్టుకోలేని దేవన్న తప్పించుకొని అడవిలకు చేరుతాడు. తమనిట్లా అడవుల పొంటి తల్మిందెవలు గొర్రెలా? మనుషులా? సమఝు కాలే అంటుంది ఒకచోట రచయిత్రి. గొర్లు తోలుతున్న అదే సమయంలో తెలంగాణ ఉద్యమం ఆ ఉద్యమానికి వీళ్ళు ఆకర్శితులవడం కొంత కథలో స్పష్టత లేనట్టనిపిం చింది. ఏదైనా ఒక అంశం మీద దృష్టి పెడితే ఇంకా అద్భుతమైన కథగా వచ్చేది. ఏదైనా సమకాలీన సమాజాన్ని మొత్తంగా చిత్రించే ప్రయత్నం చేసారు రచయిత్రి.

తప్పెట ఓదయ్య రాసిన "మల్లక్క" కథ మొత్తం కథా సంపుటిలోని ఒక వాస్తవ జీవిత గాథ. "యాతన", "మల్లక్క" రెండూ ఈ కథా సంపుటిలోని రెండు గొప్ప వాస్తవ జీవిత కథనాలని చెప్పొచ్చు. అక్కంటే అక్కే తనతో రక్త సంబంధం లేని తాను మాదిగ, అక్క కురుమ కులం అయినా కులాన్ని పట్టించుకోకుండా నా మీద నమ్మక ముంచి నన్ను చదివించింది. ఆత్మ బంధువుల కన్నా ఎక్కువ తోడబుట్టిన రక్త సంబంధం కన్నా ఎక్కువ అంటూ రచయిత తన స్వీయ కథనే తన అనుభవాన్నే ఒక కథగా మలిచి మనకు అందించారు.

ఆ అక్క తమ్ముడు అతని ఇతర కుటుంబ సభ్యులందరి గురించి రచయిత చెప్పే విధానం మన సమాజపు మానవ సంబంధాలకు ఒక దృశ్య రూపం రక్త సంబంధం కాకపోయినా తాను పైసలిచ్చి చదివించి ఆ తమ్ముడు ఉద్యోగం చేస్తుంటే మురిసి పోయిన మల్లక్క ఎక్కడో ఊర్లో ఉన్న అతనిని బర్లను కాసుకుంటూ వ్యవసాయం చేసుకుంటూ బతకవలసిన తనను ఇంత ఉన్నత స్థితికి తీసుకురావడానికి కారణమైన స్త్రీ మల్లక్క. గొప్ప మానవత్వం కులమతాల కతీతమైన ప్రేమ, డబ్బులు మాత్రమే రాజ్యమేలుతున్న ఈ ప్రపంచంలో ఇంకా మానవత్వం ఉందని నిరూపించిన కథ మల్లక్క. ఇటు పొడిసెటోడు అటు గూకెటోడు సూత్తె సరిపాయె ఎంత మంచి మాట సూర్యుడు చంద్రుడు చల్లగా చూడాలి దీవించిన మల్లక్క తనకు బతుకునిచ్చిన మల్లక్క తన జీవితానికే ఆలంబన అయిన మల్లక్కకు తనకు ఉన్న సోదరీ సోదర బంధం కులాలకు అతీతమైనదని నిరూపిస్తుందీ కథ.

దొరల, పటేండ్ల ఇండ్లల్ల కుక్కలు తినే తిండి కూడా మనకు దొరుకత లేదు. గట్కో, గంజోతిని మల్లన్నను చదివిస్తే గౌరవ ప్రధానమైన జీవితం గడుపుతుంటడు. కానీ నా అన్నదమ్ములకు, నా అక్కచెల్లెండ్లకు కుక్కలు తినే గంజి కూడా దొరుకుతలేదు. గొర్ల కాపర్ల జీవితాలు

మారెదెన్నడు అని దు:ఖపడుతుంటడు మల్లన్న. గొర్లకాపరులు తోటి మనుషులను ఎట్లా చూస్తారో తనగొర్లను, కుక్కలను అంతే ప్రేమగా చూసుకుంటారని ఈ కుక్కసద్ది కథలో మన కళ్లముందుచుతారు కాలువ మల్లయ్య.

వెల్దండి శ్రీధర్ రాసిన అంగడి కథ గ్లోబలైజేషన్ వల్ల మారిపోయిన పల్లెలను మారిపోయిన అంగడిని మారి పోయిన వస్తు సంస్కృతిని వీటన్నిటి మధ్య మారిపోయిన పాడైపోయి మానవ విలువలను కళ్ళకు కట్టినట్లు చూపిస్తుంది. మహేందర్ రాసిన "గుడ్డిగొర్రె" పడిపోతున్న మానవతా విలువలకు అద్దం పడుతుంది. ఎవరిదో గుడ్డిగొర్రె మందలో కలిస్తే కళ్ళుండీ మనుషులు నిజాయితీ లోపించి స్వార్థంతో గుడ్డివారై పోయిన వైనాన్ని దాని మాంసం తినడానికి కుట్రలు కుతంత్రాలు పన్నాగాలు పన్నవలసిన దుస్థితిని మొత్తంగా చెడిపోతున్న మానవ విలువలను మన కళ్ళముందుంచుతాడు రచయిత. దత్తయ్య రాసిన "కాపరి" గొర్ల కాపర్ల జీవితాలలో చదువు కుంటే ఉండే ఆత్మ విశ్వాసాన్ని చిత్రిస్తుంది. గొర్రెలు కాసీకాసీ చదువు నేర్చుకుంటే ఎట్లా తలెత్తుకు తిరగొచ్చో చిత్రిస్తాడు రచయిత. "ఆరివారం" కథ రాసిన తగుళ్ళ గోపాల్‌ది మట్టిబంధం. ఒక అక్క తన బాధలు చెప్పుకోలేక కుమిలి కుమిలి మళ్ళీ తమ్ముడు వెళ్ళేవరకు చని పోతుంది. ముఖ్యంగా స్త్రీల ఆత్మాభిమానాన్ని పట్టిచ్చే కథ ఇది. గొర్రెపిల్ల కథ మనుషులకు జంతువులకు ఉండే అవినాభావ సంబంధాన్ని తెలిపే కథ. అదే విధంగా సాగర్ల సత్తయ్య రాసిన "తోడేళ్ళు" కథలో బిడ్డపెండ్లికి గొర్లను అమ్మదామనుకుంటడు గొర్లను అంగడికి తోలుకపోతడు. బిడ్డపెండ్లి ఉందన్న విషయం దళారిగాళ్ళకు తెలియడంతో తక్కువ ధరకు అడుగు తుంటారు. అంగళ్ళలో దళారీలు ఎట్లా మోసం చేస్తుంటారో ఈ కథలో చిత్రిస్తాడు రచయిత.

మొత్తంగా ఈ కథా సంపుటి చదివి పక్కన పెట్టినాక ఒక గొంగడి ఎట్లా వాన నుంచి, చలి నుంచి, ఎండ నుంచి కాపాడుతుందో, అట్లానే గొర్రెల కాపర్ల జీవితాల లోని సమస్త కాలాలను సమస్త అనుభూతులను మనకు అందిస్తుంది. "గొంగడి" కథా సంపుటిని చదవడం అంటే వారి జీవితాలలోని అన్ని కాలాలను అర్థం చేసుకున్న వాళ్ళం అవుతాము. ఈ గొంగడి కప్పుకుని ఒక గొర్ల కాపరి చలినుంచి, ఎండనుంచి, వాన నుంచి ఎట్లా కాపాడు కుంటాడో అట్లా గొర్ల కాపర్ల జీవితాలలోని మూడు కాలా లను పాఠకులుగా మనం అనుభవిస్తాం. సాహిత్యాభి మానులందరూ తప్పక చదవవలసిన, కప్పుకోవలసిన "గొంగడి" ఇది.

**ఆధార గ్రంథాలు :**


1. మహేందర్ బర్ల, శ్రీనివాస్, సంగిశెట్టి (సం.పా) గొంగడి, 2024, హైదరాబాద్, ఫోరమ్ ఫర్ కన్సర్న్డ్ బీసీస్.
2. సుజాతారెడ్డి ముదిగంటి, శ్రీనివాస్, సంగిశెట్టి (సం.పా), నూరేండ్ల తెలుగు కథలు, 2011, హైదరాబాద్, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం.
3. సుజాతారెడ్డి ముదిగంటి, తెలంగాణా తొలితరం కథలు, 2022, హైదరాబాద్, రోహణమ్ పబ్లికేషన్స్.
4. రజని ఎన్. తొలితరం తెలుగు కథా రచయితలు స్త్రీ సమస్యల చిత్రణ, 2007, హైదరాబాద్.
5. వేణుగోపాల్ అమ్మంగి, సాహిత్య సందర్భం - సమకాలీన స్పందన, 2012, నల్లగొండ, జయమిత్ర పబ్లికేషన్స్.
6. దేవేంద్ర ఎం, తెలంగాణ కథ వర్తమాన జీవన చిత్రణ (1990-2010), 2021, హైదరాబాద్, శ్రీ చందన మారోజు పబ్లికేషన్స్.
7. స్వర్ణ కిలారి (అనువాదం), మేక బతుకు, 2024, హైదరాబాద్, అన్వీక్షికి పబ్లిషర్స్.
8. వెంకటేశ్వర్లు పంతంగి, (సం.పా) తెలంగాణ తెలుగు కథ, 2011, వరంగల్, తెలుగు విభాగం, కాకతీయ విశ్వవిద్యాలయం.


★★★

# ఎఱ్ఱన రచనల్లో - మాట తీరు

- డా॥. బొశెట్టి లత, సహాయ ఆచార్యులు, తెలుగు విభాగం, హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం, హైదరాబాద్.

**విషయ ప్రవేశానికి ముందు :**

మనసు లోతులో దాగిన భావాలను బయటకి వ్యక్తం చేయగలిగే శబ్దమే మాట. ఉదరంలో స్వరం, మనసులో భావం కలిసి మాటగా బయటకి వస్తుంది. ఈ మాట దాని కథ ఇంతా అంతా అని చెప్పడానికి అలివి కానిది.

సైగ నుండి సై అంటే సై అంటూ రణరంగం దాకా తీసుకెల్తుంది మాట. మాటకు భయపడి పని చేసే వాళ్ళు, మాటకు కట్టుబడి జీవితాన్నే త్యాగం చేసిన వాళ్ళు, మాట అంటే రోషంతో ప్రపంచాన్నే గెలవాలని ప్రయత్నించే వాళ్ళు, మాట పట్టింపు వల్ల బంధాలనే వదిలేసిన వాళ్ళు. ఇలా చెప్పుకుంటూ పోతే మాటకి గురించి చెప్పటానికి ఒక జీవిత కాలం సరిపోదు.

మాట గురించి అసలు ఎన్ని మాటలైనా చెప్పచ్చు. ఈ మాట తీరు మనలోని వ్యక్తిత్వాన్ని నిలబెడుతుంది. సాధ్యం కాని పనులను సుసాధ్యం చేస్తుంది. అంతరంగా లలో దాగిన భావాలను బయటకి తెస్తుంది. బాణంలా మారి బాధ పెడుతుంది. మార్గంలా మారి లక్ష్యాన్ని దగ్గర చేస్తుంది. మంత్రంలా మారి శక్తిని ఇస్తుంది. యంత్రంలా మారి భుక్తిని ఇస్తుంది. కవితలా మారి ఆనందాన్ని పంచుతుంది. అంత గొప్ప మాట కవితా రంగంలో ఎలాంటి మార్పులకు దారి తీసిందో తెలుసుకుందాం......

## మహాభారతం - మాటల మాత్రింకం :

మహాభారతం ఈ పేరు వింటే చాలు ప్రతి నాలుక ఏదో ఒక విషయాన్ని వెల్లగక్కుతుంది. నేటికి పుక్కిటి పురాణమైనా, పురాతన పురాణమైన మహాభారతం నుండి పుట్టినదే. అంత పెద్ద మహాభారతంలో ఎన్ని పాత్రలు, ఎన్ని మాటలు, ఎన్ని అర్థాలు, ఎన్ని భావాలు, ఎన్ని అభినయాలు వేటిని గురించి చెప్పినా మిగితావి చిన్న బోతాయేమో అని అనిపిస్తుంది.

బాట వేసినది ఒకరు, నడిపినది ఒకరు, ముగించినది ఒకరు. ముగ్గురుతో ఒకేలా రాయబడిన తెలుగు మహా భారతం అజరామర గ్రంథరాజం. మహాభారతాన్ని తెలుగు లోకి అనువదించిన నన్నయ్య , తిక్కన, ఎర్రనల కృషి అద్భుతమైనది. భారతంలో విభిన్న మనసుల మాటలు ఉన్నాయి. వాటిని కవిగారు నడిపిన తీరు ఈ వ్యాసానికి మూల భూమిక.

మహాభారతంలో ఇద్దరి గురించి పక్కన పెడితే మూడోవాడైన ఎర్రన గురించి మనం మాట్లాడుకుందాం.

**ఎర్రన పరిచయం :**

కొంతమంది పరిచయాలలో విమర్శకుల విమర్శలు ముఖ్యం. అవి అన్ని అందరికి అందుబాటులో ఉన్న పుస్తకాలే. భారతం చదివిన వారు తప్పకుండా అనేక వ్యాఖ్యలు చదివే ఉంటారు. వాటి సారాంశం ప్రకారం. ఎర్రన గుంటూరు పట్టణానికి దగ్గరలో ఉన్న చదలవాడ గ్రామంలో సూరన - పోతమాంబ దంపతులకు జన్మిం చాడు. ఇతనికి శంభుదాసుడు, ప్రబంధపరమేశ్వరుడు అని బిరుదులు ఉన్నాయి. నృసింహపురాణం, హరివంశం, అరణ్యపర్వ శేషం వంటి రచనలు చేశాడు.

ఇందులో ప్రబంధపరమేశ్వరుడు అనే బిరుదును కేవలం అరణ్యపర్వ శేషాన్ని పూరించడం వల్లనే వచ్చిందని చెప్పవచ్చు. అందుకు కారణం నన్నయ భారత అవ తారికలో ''శ్రీవాణి గిరిజా.......'' అను పద్యంలో వివరించబడిన లయకారుడి అవతారమే ఎర్రనగా మన కవులు వ్యాఖ్యానించారు. ఏది ఏమైనా పూర్తి చేయటం అనే ప్రక్రియ లయం చేయటంతో సమానం కాబట్టి ఆ పని చేసిన ఎర్రనకు ఈ బిరుదు ఇవ్వడం సముచితమే.

## ఎర్రన కృతుల్లో కొన్ని మాటలు....

**నృసింహపురాణం :**

అన్ని విధాల రచన చేయటంలో దిట్ట, వర్ణనల పుట్ట ఎర్రన. ఆయన మొదట రాసిన నృసింహపురాణంలో కొన్ని సందర్భాలు చూద్దాం....

ఈ కావ్య రచనా కాలం మీద, ఈ కృతి పేరు మీద చాలా విమర్శలు ఉన్నాయి. అవి పక్కన పెడితే ఇందులో కథను నడిపించిన తీరు, పాత్రల మధ్యన వచ్చే సంభాషణల విధానం ఎంతో హృద్యంగా ఉంటాయి. ఒక కవి రచనలో దాగిన మాధుర్యం మీద విమర్శకులు తక్కువ దృష్టి పెడతారు. ఎందుకో చాలామంది కవి గారి ప్రాంతం గురించి, కుటుంబం గురించి, కాలం గురించి ఎక్కువ కాలం చర్చలు చేస్తారు. వాటి వల్ల కవి గురించి తెలుస్తుంది తప్ప. కవి రచనలో దాగిన నాటి స్థితిగతులు తెలియవు కదా!. ఒకవేళ తెలిసినా ఈ కాలం నాటికి అది రాద్ధాంతమే తప్ప ఉపయోగంలేదు. ఎల్లలు లేని కవితను మనకి మంచిగా విడమర్చి చెప్పే విమర్శకులు నేటి కాలానికి అవసరం.

ఎర్రన తన నృసింహ పురాణ కథను బ్రహ్మాండ, విష్ణు పురాణాలలో నుంచి తీసుకున్నాడు. ఈ ప్రబంధం హిరణ్య కశిపుడి జననంతో ప్రారంభమై హిరణ్యకశిపుడి రాక్షస ప్రవర్తన, ప్రహ్లాదుడి జననం, విద్యాభ్యాసం, అతడి హరిభక్తి, నరసింహావతార ఆవిర్భావం, హిరణ్యకశిపుని వధ ప్రధానాంశాలుగా సాగిస్తూ అహోబిలక్షేత్ర వర్ణనతో ముగించాడు. పోతన ప్రహ్లాద ఘట్టంలో ఎర్రన నృసింహ పురాణం ఛాయలు బాగా కనిపిస్తాయి.

తెలుగు వారికి ప్రహ్లాద చరితం అంటే ప్రాణం. అందులో సంభాషణలు ప్రతి ఒక్కరు ఎదో ఒక సందర్భంలో గుర్తుకు తెచ్చుకుంటూ ఉంటారు. మక్కువ ఎక్కువగల ప్రహ్లాద చరిత్ర నృసింహ పురాణంలో ఉంది. ఎర్రన ఈ కథకు ప్రాణం పోశాడు. భగవంతుని నారసింహ అవతార ఘట్టాన్ని అనుభవైకవేద్యంగా రచించాడు. అందరి చేతా స్మరింపజేశారు.

తెలుగువారికి ప్రహ్లాద చరితాన్ని అందించినది ఎర్రన. ఎర్రన పద్యాలను భూమికగా చేసుకొని పోతన ప్రహ్లాదుడు తెలుగువారి నట్టింట్లో పాపడుగా పారాడాడు.

అసలు నృసింహపురాణంలో ప్రహ్లాదుడి మాటతీరు చూసి చదివి మనం మాట్లాడే పద్ధతిని తెలుసుకోవాలి. గర్జించే సింహం ముందు బెదురులేకుండా నిలిచిన జింక పలుకులు ఆశ్చర్యాన్ని తెప్పిస్తాయి. హిరణ్యకశిపుడు గర్జించే సింహం, ప్రహ్లాదుడు మాట్లాడే జింక. అయినా లేడి మాటలు లేత ధర్మ సూత్రాలు.

హరిభక్తి మానమని తండ్రి అంటే పిల్లవాడు తండ్రితో

"హరి భక్తుల తపము తపము
హరి భక్తుల జపము జపము హరి భక్తుల భా
సురజన్మము భవసారము
హరి భక్తులు భువన పావనైక విహారుల్." అంటూ

హరిభక్తిని చాటి చెబుతాడు. చిన్నవాడే అయినా ఆయన మాటలు దైవప్రేరితాలు. ఇలాంటి మాటలు వినాలన్న మాట్లాడాలన్న ఎన్ని జన్మల పుణ్యం కావాలో.

ఈ రోజుల్లో మన పిల్లలు నేర్చిన అనవసర బూతు పదాలు తప్ప అవసరమైన తేటతెలుగు పదాలు ఎక్కడివి. మనం నేర్పందే ఇలాంటి మాటకారితనం ఎలా వస్తుంది. పోతనలాంటి సహజ పండితులకు కూడా ఎర్రన పదజాలమే ఆధారం. ఒక మార్గాన్ని ఏర్పరచడంలో విశేషకృషి సల్పినవాడు ఎర్రన.

సీ. "వాసుదేవుని పాద వనరుహంబుల భక్తి
తగదను తండ్రియు దండ్రి కాడు
వేద చోదితమైన విష్ణు ధర్మమునకు
గోపించు గురుడును గురుడు కాదు
భవ దుఃఖములు మాన్ప బ్రభువైన హరిసేవ
నెడలించు హితుడును హితుడు కాడు
పరయోగ మతమగు వైష్ణవ జ్ఞానంబు
వదలిన చదువును జదువు గాదు

తే.గీ. కేశవాకార లీలలు గీలుకొని ముదంబు
బొందని తలపును దలపుగాదు
మాధవస్తోత్ర ఘన సుధా మధుర రుచుల -
జిలుకకుండెడు జిహ్వ జిహ్వ గాదు."

ప్రహ్లాదుడు తన తండ్రికి విష్ణు ద్వేషము తగదని చెప్తూ, విష్ణుని మీద భక్తి పెంచుకోమని బ్రతిమాలడం గురించి ఎంతో చక్కగా చెప్పారు ఎర్రన. ముక్కు పచ్చలారని బాలుడు ఇంత విషయ జ్ఞానం కలిగిన కుర్రాడు ఎంత వినయంగా ధైర్యంగా మాట్లాడు తున్నాడో.....

అంతటితో ఆగాడా ఆ పిల్లవాడు. మరలా ఇలా అంటున్నాడు...

"నిన్నింత వాని జేసిన,
యన్నాలుగు మోములతడు హరిపొక్కిటయం
దున్న వెలి దమ్మియీనిన,
కున్నయగుట తెలిసి విడువు కోపము తండ్రీ." అంటే అయ్యా! నీకు జన్మను ఇచ్చిన బ్రహ్మ దేవునికే జన్మను ఇచ్చినవాడు ఆ శ్రీహరి. ఆ హరితో నీకు కయ్యం ఎందుకు నా మాట విను దయామయుడు అయిన శ్రీహరిని ద్వేషంతో చూడకు అని అన్నాడు.

ఇక్కడ విశేషం ఏమిటంటే హిరణ్యకశిపుడు ఎవ్వరి మాట లెక్కచేయని మహాగర్విష్టి. మదించిన ఏనుగు లాంటివాడు. అలాంటి వాడికి ప్రహ్లాదుడు మావటివాడు. భక్తి అనే అంకుశంతో మాటల దెబ్బలు కొట్టి మంచి మార్గంవైపు నడపటానికి విశ్వప్రయత్నం చేశాడు. మాట వినకపోతే మన జీవితం చాలా త్వరగా చరమ దశకు చేరుకోక తప్పదు.

ప్రహ్లాదుడు ఎంతటి మాటలు మాట్లాడినా హిరణ్య కశిపుడు ఒకే ఒక్క మాట మీద నిలబడ్డాడు. ఆ హరి ఎక్కడ ఉన్న తాను చూసి అతన్ని చంపాలన్నదే అతని అభిమతం. అందుకే ప్రహ్లాదుడు ఎన్ని అన్నా ఆ హరి నామం వినిపిస్తే చాలు అగ్గిమీద గుగ్గిలం అవుతాడు.

మన స్థానం ఎంత అని ఆలోచించేది కొన్ని సార్లు మాత్రమే. అధర్మం జరుగుతున్న సమయంలో ఏ స్థాయి వారు అయినా దాని ధైర్యంగా ఖండించాల్సిన అవసరం ఉంది. ఖండించాలి కూడా. ప్రహ్లాదుడు హిరణ్యకశిపుని మనసులోని ఛాందస భావాలు నాశనం అవ్వాలని మాట్లాడాడు కాని ఆతని చావును ఆశించి మాట్లాడలేదు. అంటే మన మాట ఇతరుల మనసులో మంచిని పెంచడానికి దోహదం చేసే విధంగా ఉండాలి.

మాటకు మాట తడుముకోకుండా చెప్పడంలో ప్రహ్లాదుడు దిట్ట. నిన్ను రక్షిస్తున్న హరి ఎక్కడున్నాడురా అని అడిగితే

"కలడు మేదిని యందు కలడుదకంబుల
గలడు వాయువునందు గలడు వహ్ని
గలడు భానుని యందు గలడు సోముని యందు
గలడంబరమున గలడు దిశల
గలడు చరంబుల గల డచరంబుల
గలడు బాహ్యంబున గలడు లోన
గలడు సారంబుల గలడు కాలంబుల
గలడు ధర్మంబుల గలడు క్రియల
గలడు కలవాని యందును గలడు లేని
వాని యందును గలడెల్లవానియందును
ఇంక వేయును నేల సర్వేశ్వరుండు
కలడు నీయందు నాయందు కలడు కలడు." అంటూ భగవంతుడు ఎక్కడ లేడు తండ్రి సర్వాంత ర్యామి అయిన ఆ దేవదేవుడు పంచ భూతాలలో నిండి పోయి ఉన్నాడు. అష్ట దిక్కులలో నిలిచి ఉన్నాడు. సర్వ ప్రాణికోటిలో ఆత్మశక్తిగా దాగి ఉన్నాడు, నీ యందు నా యందు కూడా ఆ భగవానుడు ఉన్నాడు.

అంత చిన్న పదాలతో పసిపిల్లవాడైన ప్రహ్లాదుని ద్వారా భగవంతుని నివాస స్థానాలను ఎంత చక్కగా పలికించాడు ఎఱ్ఱన. అంటే ఎదుటిమనిషితో మాట్లాడేటప్పుడు ఎంతటి పెద్ద భావాన్ని అయినా చిన్నచిన్న పదాలతో సుకుమారంగా చెప్పవచ్చు అన్న సూత్రాన్ని నేటి వదరుబోతులకు సైతం పరిచయం, చేశాడు.

గురుకులంలో గురువులతో మాట్లాడేటప్పుడు కూడా నారాయణ నామస్మరణ వల్ల కలిగే అనుభూతిని అలతి పదాలతో వివరించాడు. పోతన భాగవతంలో ప్రహ్లాదుని పలుకుల కులుకులకు నారదుడు ఎంతో మురిసి పోయాడు. ఎఱ్ఱన ప్రహ్లాదుడు ఆధ్యాత్మిక భావజాలంతో మెరిసిపోయాడు. ఈశ్వరానుగ్రహం సంపూర్ణంగా ఉన్న కవి ఎఱ్ఱన.

**హరివంశం :**

పోతనకు మార్గదర్శకత్వం చేసిన గ్రంథం హరివంశం. మహాభారతానికి పరిశిష్ట గ్రంథంగా, శ్రీకృష్ణలీలా విలాసాన్ని కూడా చక్కగా వివరించిన గ్రంథం హరివంశం. అరణ్య పర్వ శేషంతో కాకుండా హరివంశంతో మహాభారతం సంపూర్తి అవుతుంది అని ఎఱ్ఱన భావించి హరివంశ రచనను అత్యంత శ్రద్ధగా తీర్చిదిద్దాడు.

హరివంశంలో కృష్ణుడి లీలలను చాలా అద్భుతంగా వర్ణించాడు. అసలు ఎర్రన వర్ణనలు ఎంతో మందికి మూలాధారంగా నిలిచాయి అని అనడంలో ఎటువంటి అతిశయోక్తి లేదు.

హరివంశం రెండు భాగాలు. పూర్వ హరివంశం, ఉత్తర హరివంశం. నాచన సోమన ఉత్తర హరివంశాన్ని మాత్రమే అనువదించాడు. ఎర్రన పూర్వభాగంలో నాలుగు ఆశ్వాసాలలో హరివంశ గాథను చెప్పాడు. ఐదో ఆశ్వాసం నుండి ఎనిమిదవ ఆశ్వాసం వరకు కృష్ణుడి విశేషాలను తెలియజేశాడు.

**హరివంశంలో సత్రాజిత్తు కథలో శ్యమంతకమణి ఘట్టం గురించి చెప్పేటప్పుడు సత్రాజిత్తుకు కృష్ణుడికి మధ్య జరిగిన సంభాషణ రాజుకు పరిపాలాన మీద ఉన్న అవగాహనను వ్యక్తం చేస్తుంది. అదే సమయంలో ఒక తాపసి పడిన కష్టానికి అందిన ఫలితాన్ని ఉదారంగా ఇవ్వడానికి మనసు రాని సంకుచిత స్వభావాన్ని చూపిస్తుంది.**

శ్రీకృష్ణుడి బాల్యాన్ని వర్ణించే సందర్భాలలో తల్లి కొడుకుల మాటలు ఎలా ఉండాలో నేటి వారికి వ్యక్తం చేస్తాయి. ముఖ్యంగా బాలకృష్ణుడి పసితనం గూర్చి చెప్పిన ఈ పద్యం చూడండి.

నోరన్ జేతులు రెండు గ్రుక్కుకొనుచున్మోమెల్ల బాష్పాంజన
స్మేరంబై తిలకింపనేర్చుచు, బొరిన్ మీజేతులన్ గన్నులిం
పారం దోముచు, చేవబూని పిఱుదొయ్యన్ మీది కల్లార్చుచున్
శ్రీరమ్యాంఘ్రియుగంబు గింజుకొనుచున్ జెల్వంబు రెట్టింపగన్

పాపం ఈ పసివాడిని ఏ బూచాడో భయపెట్టాడు కాబోలు. గుక్కపెట్టి ఏడవడం మొదలుపెట్టాడు! నోటిలో రెండు చేతులు కుక్కుకొంటూ మరీ ఏడుస్తున్నాడు. ఆ ఏడుపుకి అతని మొగమంతా 'బాష్పాంజన స్మేరంబు' అయ్యింది. కన్నీటికి కరిగిన కాటుక ఆ పాపాయి ముఖమంతా అలముకొన్నది. ఎంత చిక్కని పదమో అంత చక్కని పదచిత్రం! మాటిమాటికీ మీజేతులతో (అంటే చేతుల పైభాగం) కన్నులు నులుముకొంటున్నాడు. చేవబూని - అంటే కాస్త బలం తెచ్చుకొని, పిఱుదు మెల్లిగా పైకి లేపే ప్రయత్నం చేస్తున్నాడు. ఆ పసివాని పాదాలు శ్రీరమ్యంగా ఉన్నాయి. అంటే ఎంతో శోభతో మనో హరంగా ఉన్నాయి. ఆ లేలేత పాదాలను గింజుతూ తంతూ ఉంటే అతని అందం రెట్టింపవుతోంది!

ఇలా బాలకృష్ణుడి అందంతో పాటు అనేక మంది రాక్షసులను సంహరించిన విధానం ఇందులో ఉంటుంది. ముఖ్యంగా చెట్ల రూపంలో ఉన్న గంధర్వులను విముక్తి చేసినప్పుడు ముగ్ధమనోహరంగా కృష్ణుడు వాళ్ళతో "అంతా ! మీ వల్లనే. మీ కర్మఫలాలు నాచేత పోగొట్టుకుంటు న్నారు"అంటూ అమాయకంగా అంటాడు.

పరమ మాయలో జనాలను ముంచి లీలగా ఆడటం గోపాలుని లక్షణం. ఆ గోపాలుని మాటలు కొందరికి పదునైన శూలాలు. కొందరికి మృదువైన కుసుమాలు. దీన్నే కృష్ణమాయ అంటారు. హరివంశంలో కృష్ణావతార ఘట్టాలు అత్యంత మనోహరంగా ఉంటాయి.

**అరణ్యపర్వ శేషం :**

ఎర్రనను ప్రబంధపరమేశ్వరుడిగా నిలిపిన రచన అరణ్యపర్వశేషం. ఇందులో పాండవులు అరణ్యవాసం చేసే సమయం గురించి ఉంది. ఆ సమయంలో పాండవులు మహర్షులతో ప్రవర్తించిన తీరు, కృష్ణుడు పాండవులతో మాట్లాడిన విధానం వంటి ఘట్టాలను మనం పరిగణనలోకి తీసుకోవాలి.

అరణ్యపర్వంలో సావిత్రోపాఖ్యానం ఘట్టం ఎర్రన కవితా శక్తికి నిదర్శనం. సావిత్రి వివాహ విషయంలో ఎంత వెతికినా మంచి సంబంధం దొరకకపోతే సావిత్రి తండ్రి ఆమెతో "సావిత్రి...నీకు తగిన వరుడు ఇప్పటి వరకు దొరకలేదు. స్వయం వరం నిర్వహించినా నీ తాహతకు తగిన వరుడు రాలేదు. కాబట్టి వివాహ విషయంలో నీకు పూర్తి స్వేచ్ఛ ఉన్నది. కావున నీవే దేశాంతరాలు వెళ్లి తగిన వరుణ్ణి ఎన్నుకో" అని అన్నాడు.

అందుకు సావిత్రి తండ్రితో "నాన్న వివహం అనేది

దైవ నిర్ణయం. అయినా ఇంతటి స్వేచ్ఛ తగినది కాదు. మద్రదేశాధిపతి కుమారుడు సత్యవంతుడు నాకు తగిన వరుడు. నారదుని ఉపదేశానుసారం అతన్ని వివాహం చేసుకుంటాను" అని అన్నది. ఈ ఘట్టంలో స్వేచ్ఛ ఎంత ఉన్న తండ్రికి గౌరవం ఇచ్చి గురువుకు గౌరవం ఇచ్చి తలొంచి మాట్లాడిన తీరు ఎంతో హృద్యంగా ఉంది. నిజానికి ఈనాటి యువతకు ఇలాంటి స్వేచ్ఛ ఇస్తే మన పరిస్థితి ఏంటో ఒక్కసారి ఆలోచించండి. స్వేచ్ఛ ఇచ్చినా తండ్రికి కట్టుబడి, గురువుకు కట్టుబడి ఉన్న సావిత్రి లాంటి యువత మనకి కావాలి. అలాంటి చక్కటి మాటతీరు మనకి రావాలి.

యక్షప్రశ్నల ఘాతంలో ధర్మారాజుకు తమ్ముళ్ళపై ఉన్న ప్రేమను తెలిపే పద్యాలు ఎంతో రమణీయంగా ఉంటాయి. అంతే కాకా యుక్తి భక్తి తెలిసిన ధర్మరాజు యక్షున్ని మెప్పించి తమ్ముళ్ళను బ్రతికించుకున్న కథ మనకి తెలిసినదే. ఈ సమయంలో తన కోసం, తన మాట కోసం అడవులపాలైన తమ్ముళ్ళను కోరి ఆపదలో వదులుత భావ్యం కాదు కదా! యక్షుడా! నా ప్రాణములు తీసుకొని నా సోదరులను విడిచిపెట్టు. నలువురిని విడువకున్న నకుల సహదేవుల్లను విడిచిన చాలు. వారు లేనిదే వారి తల్లి నిలువజాలదు." అని వేడుకున్నాడు.

బుద్ధిమంతుడు అయిన ధర్మరాజు యక్షుడిని ప్రార్థిస్తే అతని బుద్ధికి మెచ్చిన యక్షుడు తలాతోకా లేని ప్రశ్నలను సంధించి అతన్ని ఇరకాటంలో పెట్టి వినోదించాడు. తమ్ముళ్ళ బాగు కోసం తన వాగ్దాటితో ధర్మరాజు అన్ని ప్రశ్నలకు చక్కటి సమాధానం ఇచ్చాడు. ఈ సందర్భంలో ఎర్రన ప్రయోగించిన పదాలు ధర్మరాజులో దాగిన దుఃఖానికి సాక్ష్యాలుగా నిలిచాయి. నేడు బంధుత్వం ఏ స్థాయిలో ఉందో మనకు విదితమే. మనం బాగుంటే చాలు మిగితావాళ్ళతో ఎటువంటి సంబంధం లేదు అన్న చందానికి మనం చేరుకోవటం గమనించదగిన విషయం. అందుకే ప్రతి అంశానికి భారతం చదివి పెద్దల మాటలను అర్థం చేసుకొని జీవితాన్ని మలచుకోవాలని చెబు తుంటారు.

**ఉపసంహారం :**

ఎర్రన రచనలలో పాత్రల మధ్య వచ్చే సంభాషణ లను మాటతీరు కింద తీసుకుంటే ఎన్నో రకాలైన మాటలను మనం నేర్చుకోవచ్చు. ఈనాటి కాలంలో మంచి మాట తీరు అలవర్చుకోకపోతే ఎప్పటికీ సంఘంలో మంచి గౌరవాన్ని పొందలేము. నోరు మంచిదైతే ఊరు మంచిదవు తుంది అని సామెత నిజమైనదే. ఎందుకంటే మనం మాట్లాడేటప్పుడు ఆ మాట్లాడే విధానాన్ని చూసి మనకి మంచి స్థానం కలిపిస్తారు ఎదుటివారు. కాబట్టి మన మాట తీరును మన కావ్యాల ద్వారా నేర్చుకోవటం చాల ఉత్తమం.

**ఆధార గ్రంథాలు :**

1. శ్రీమదాంధ్రమహాభారతం - అరణ్యపర్వం - తి.తి.దే.
2. ఎర్రాప్రగడ - అతని కృతులు - విష్ణుభొట్ల విశ్వనాథశాస్త్రి.
3. ఎర్రన - రస పోషణ - ఆచార్య ఎన్. గంగప్ప.
4. నృసింహపురాణం - ఎర్రాప్రగడ - వేలూరి శివరామశాస్త్రి.
5. హరివంశం - ఎర్రాప్రగడ - రేమెల్ల.
6. ఎర్రయ తీర్చిన హరివంశం - గోదావరి బాయి.

★★★

# మూఢ విశ్వాసాలను పారద్రోలిన వైతాళికుడు గురజాడ

- డా॥. డి. జ్యోతమ్మ, అసిస్టెంట్ ప్రొఫెసర్, ప్రచురణల విభాగం, ద్రావిడ విశ్వవిద్యాలయం, కుప్పం.

భారతీయ సనాతన సంస్కృతి, సంప్రదాయాల వెనుక అత్యంత ప్రామాణికమైన సైన్స్ దాగి వుందన్న సత్యాన్ని అటు ప్రాచీనుల నుంచి ఇటు ఆధునికుల వరకూ ఎందరో పరిశోధకులు సుస్పష్టం చేశారు. విజ్ఞానశాస్త్రం ఆధారంగా సంస్కృతి, సంప్రదాయాలు వందల ఏళ్ళ నుంచి విరాజిల్లిన భారతదేశంలో... వర్తమాన భారతీయులు దిగ్భ్రాంతి చెందే మూఢ విశ్వాసాలు, సాంఘిక దురాచారాలు సైతం ఈ దేశ ప్రజలను పీడించాయన్న వాస్తవం గురజాడ రచనల్లో స్పష్టంగా కనబడుతుంది. “కన్యాశుల్కం వంటి సాంఘిక దురాచారాలను బట్టబయలు చేయడం, ఉన్నత నైతిక భావనలను అభివ్యాప్తం చేయడం కంటే సాహిత్యానికి మరో ప్రయోజనం వుండబోదు” అని గురజాడ అప్పారావు తన రచనల్లో, ప్రసంగాల్లో అనేక సందర్భాల్లో పేర్కొన్నారు. గురజాడ అన్న ఈ మాటలను పరిశీలిస్తే నాటి భారతీయ సమాజంలో, ప్రత్యేకించి తెలుగు నేలపై మూఢ విశ్వాసాల ప్రభపావం ఏ స్థాయిలో ఉండేదో అర్థం చేసుకోవచ్చు. అలాంటి మూఢ విశ్వాసాలను ప్రజల నుంచి పారద్రోలడమే రచయితల అసలు లక్ష్యం కావాలన్నది గురజాడ భావన.

## భక్తితో, అనురక్తితో, ఆసక్తితో...

గురజాడను అధ్యయనం చేయడం, ఆయన రచనలను అర్థం చేసుకోవడం అంత సులభం కాదు. భక్తితో, అనురక్తితో, ఆసక్తితో, పరిశీలనతో, పరిశోధనతో నేటితరం పరిశోధకులు, రచయితలు కృషి చేయాల్సి ఉంటుంది. “దేశమును ప్రేమించుమన్నా” అని మహాత్మ గాంధీ గారి ప్రేమసూత్రాన్ని విశ్వజనీయంగా చాటి, “దేశమంటే మట్టికాదోయ్, దేశమంటే మనుషులోయ్” అని ఆ సూత్రానికి నిర్వచనం చెప్పి, ఆ నిర్వచయానికి అనుగుణంగా ప్రవర్తించి మహాకవి గురజాడ సకల దేశాల ప్రజలకు సన్నిహిత సాహితీ బంధువయ్యారు. గురజాడ వారి సంఘ సంస్కరణ ఆశయాన్ని పరిశీలించగా.. అప్పారావు గారి సంఘ సంస్కరణ ఆశయం, మానవత పతాకస్థాయి అందుకొన్న ఉజ్వలగీతపం ‘లవణ రాజు కల’. ఈ గీతాన్ని చదువుతుంటే అప్పారావు గారు ఒకచోట ఉద్ఘోషించిన ఈ మాటలు జ్ఞప్తిపకిరాక తప్పవు.ప ‘మాల వాణ్ణి చూగానే అమాంతంగా కౌగిలించుకోని వాడికి దేశమాత పేరు ఎత్తే అర్హత లేదని నా గట్టినమ్మకం”. గాంధీ మహాత్ముడు కారణజన్ముడుగా, మహాపురుషుడుగా హరిజనోద్ధరణ ఉద్యమాన్ని ప్రారంభించముందు అప్పారావు గారు ఈ అభిప్రాయాలు వెలిబుచ్చారు. తమ ఈ ఉన్నత ఆశయాన్ని ఉదాత్తమైన పద్ధతిలో అప్పారావు గారు ‘లవణ రాజు కల’లో చిత్రీకరించారు. విప్లవాత్మకమైన విషయాన్ని మనోహరమైన వర్ణనలతో కళాశోభితం చేసి మరొక ప్రపంచాన్ని సృష్టించారు. ఈ ప్రపంచంలో మానవులకు, మానవులకు మధ్య కృత్రిమమైన అడ్డుగోడలు లేవు. అందులో దురాచారాలు లేవు. దుష్టమైన శాసనాలు లేవు. అందులో అప్పారావు గారు ఇలా అంటున్నారు.

మలినదేహుల మాలలనుచు
మలిన చిత్తుల కధిక కులముల
నెలవొసంగిన వర్ణ ధర్మము
ధర్మ ధర్మంటే
మంచి చెడ్డలు మనుజులందున
యెంచిచూడగ రెండె కులములు
మంచి యన్నది మాలయైతే
మాలనే అగుదున్

‘లవణ రాజు కల’లో పవిత్రమైన భావాలను, ప్రణయ మాధుర్యాన్ని అప్పారావు గారు అతి రమణీయంగా చిత్రించారు. అప్పారావు గారి ఆలోచనలు కాలంకంటే ముందు పరుగెత్తుతాయని చెప్పడానికి ఈ గీతం ఒక నిదర్శనం.

ISSN No. : 2456-4702
RNI No. APTEL/2003/12253

## విశ్వప్రజల కంఠాలలో నినదించే నిండుదనం :

చిన్న చిన్న మాటలలోనే తీయని తెలుగుదనం ఉట్టిపడే గీతం "కన్యక". అప్పారావు గారి గీతాలన్నింటి లోను తలమానికమైనది "దేశభక్తి" గీతం. ప్రపంచ మహాకవులలో ఒకరుగా అప్పారావు గారికి అంజలి ఘటించడానికి దేశభక్తి గీతం ఒక్కటి చాలు. ఈ గీతంలో అప్పారావు గారు అవధులు లేని మానవతను మూర్తీ భవింపజేసినారు. ఒక కాలానికి గాని, ఒక దేశానికి గాని ఈ గీతం పరిమితం కాదు. మూఢవిశ్వాసాలకు, సాంఘిక దురాచారాలకు ఏమాత్రం చోటివ్వకుండా.. ప్రపంచ మానవాళిని చైతన్యపరిచే దిశగా, బాధ్యతాయుతమైన పౌరులుగా తీర్చిదిద్దే గురజాడ వారి దేశభక్తి గీతం నిర్మిత మైంది. ప్రపంచంలోని యే దేశంవారైనా, ప్రపంచ మానవు లందరు పాడుకొనడానికి పనికివచ్చే జాతీయగీతం ఈ గేయం. సర్వకాలీనత, సర్వజనీత ఈ గీతంలోని ప్రత్యేకతలు. ఇక్బాల్ రచించిన "సారే జహాసే అచ్ఛా హిందుస్తా హమారా" గేయం వంటివి మన భారతీయులు మాత్రమే పాడుకొనడానికి మాత్రమే పనికివచ్చే దేశభక్తి గీతాలు. కానీ అప్పారావు గారు రచించిన దేశభక్తి గీతం అటువంటిది కాదు. అది మనదేశపు యెల్లలను దాటి ప్రపంచంలోని ఏ దేశం ప్రజల కంఠాలలోనైనా నినదిచే నిండుదనాన్ని కలిగి ఉంది. కుల, మత, జాతితో సంబంధం లేకుండా సర్వమానవులు ఆలపించగలిగే ఉత్తమోత్తమ గీతాన్ని రచించిన మహాకవి మన తెలుగువాడు కావడం మన అదృష్టం. ఈ గీతంలోని ప్రతివాక్యం దేశాభిమానాన్ని మొలకెత్తించే సంగీతం. జీవితగమనంలో అడుగడుగున ఈ గీతంలోని యేదో ఒకవాక్యం మనలను ఉద్వేపరచి, ఉత్సాహపరచి మునుముందుకు కదిలిస్తుంది.

## సంఘ సంస్కరణకు సాక్ష్యం "పూర్ణమ్మ గేయం":

గురజాడ అప్పారావు గారి అమృతహస్తాల నుంచి జాలువారిన మరొక ఆణిముత్యం లాంటి సంఘసంస్కర రచన పూర్ణమ్మ గేయం. పూర్ణమ్మ విషాదాంత కావ్యం. లలితమైన వాడుకభాష పదాలతోనే అప్పారావు గారు అద్భుతంగా ఈ కావ్యాన్ని సృష్టించారు. అప్పారావు గారి కవితాశక్తి పూర్ణమ్మలో కట్టలు తెంచుకొని ప్రవహించింది. ఎంతటిభావ తీవ్రతతో, హృదయవేదనతో అప్పారావు గారు పూర్ణమ్మను రచించారో ఆ గీతాన్ని ఒక్కసారి చదివితే బోధపడుతుంది. పూర్ణమ్మను చదివితే శోకపూరితమైన ఒక జీవితాన్ని చూసిన అనుభూతి కలుగుతుంది. పవిచారం ముంచుకొస్తుంది. హృదయంలో చేయిపెట్టి కలచినట్లయి కన్నులనిండా నీరు నిండుతుంది. మూఢ నమ్మకాల ముసుగులో... కన్యాశుల్కం దురాచారానికి ఒక చిన్నారి బలి అయిపోయిన సంఘటన ఇందులోని కథా వస్తువు. ఇది వాస్తవిక జీవితపు సంఘటన. సంఘ సంస్కరణ ఆదర్శంతో, ప్రయోజనంతో అప్పారావు గారు ఈ గీతాన్ని రచించినా ఇందులో కవితాశిల్పం చెక్కు చెదరలేదు. ఒక వైపున కావ్యంగా అలరారుతూనే మరొక వైపున దివ్యమైన సందేశాన్ని అందిస్తుంది ఈ గేయం. అప్పారావు గారి గేయాలను చదువుతున్నప్పుడు మనం ఒకేసారి పాఠకులం, శ్రోతలం, ప్రేక్షకులమూ అవుతాము. ఆయన గీతాలు చదువుతుంటే మైమరిచే సంగీతాన్ని వింటాము. మనల్ని మనం మరిచిపోయి అపూర్వమైన దృశ్యాలను దర్శిస్తాము.

## వాల్మీకి - గురజాడ దగ్గరి సామ్యం :

వాల్మీకి మహాకవి కవితావిర్భావానికి గురజాడ మహాకవి ముత్యాలసరాల అవతరణకు చాలా దగ్గరి సామ్యం కనిపిస్తుంది. ఇద్దరి కవితావేశానికి కారణం ఒక ఉత్కృష్ట ప్రయోజనం. వాల్మీకి మహాకవి హృదయంలోని కారుణ్యం శోకంగా ఉబికి శ్లోకంగా మారింది. తమచుట్టూ మూఢ ఆచారాలతో అనేక రుగ్మతలతో నిండివున్న సమాజంలోని దురాగతాలు అప్పారావు గారి హృదయాన్ని దహించి వేశాయి. ఆ సందర్భంలోనే గురజాడ వారి 'ముత్యాల సరాల' ఆవిర్భావం జరిగింది.

"గుత్తునా ముత్యాలసరములు
కూర్చుకొని తేటైనమాటల,
కొత్తపాతల మేలు కలయిక
క్రొమ్మెరుంగులు జిమ్మగా"

అని వాడుక భాషలోని తేటైన మాటలతో కొత్తపాతల మేలు కలయికగా అప్పారావు గారు ముత్యాలసరాలు

గుచ్చితే వాటిని మెచ్చని వారు గూడ అన్నారు. అయితే మెచ్చుకుంటే మించిపాయెను.

కొయ్య బొమ్మలె మెచ్చు కళ్ళకు
కోమలుల సౌరెక్కునా

అని అంటారు అప్పారావు గారు. ముత్యాల సరాల శీర్షికతో గురజాడ వారు రాసిన గీతాలు 19వ శతాబ్దం, అంతటి పూర్వం సమాజంలో పెట్రేగిపోయిన మూఢ విశ్వాసాలు ఏపాటివో అర్థమవుతుంది. ఈ మూఢ విశ్వాసాలను మానవాళి నుంచి పారద్రోలడానికి ఆయన రచించిన గీతాలు, నాటకాలు ఎంతగానో ఉపకరించా యనడంలో ఏమాత్రం సందేహం లేదు. వర్తమాన సమాజంలో నేటికీ గ్రామీణ ప్రాంతాల్లో అంటరానితనం, కుల భావనలు, మతవిద్వేషాలు ప్రజలను పీడిస్తున్నాయి. ఇలాంటి వాటిపై వర్తమాన పరిశోధకులు గురజాడ వారి స్ఫూర్తితో కలం చేతబట్టి అక్షరపోరాటం చేయాల్సిన అవసరముంది.

**ఆధార గ్రంథాలు :**

1. మహాకవి గురజాడ
2. కన్యాశుల్కం
3. లవణరాజు కల
4. కన్యక
5. ముత్యాల సరాలు

★★★

# స్త్రీవాద సాహిత్యంలో తొలి పద్యకావ్యం - జ్వలిత కౌసల్య అంతరంగం

- డా॥. ఎమ్. పద్మగౌరి, అసిస్టెంట్ ప్రొఫెసర్, పో-ఆ-తెలుగు విశ్వవిద్యాలయం, బొమ్మూరు, రాజమండ్రి.

**ఉపోద్ఘాతం :**

భారతీయ వాఙ్మయంలో రామాయణం ఆదికావ్యంగా ఆరాధింపబడుతుంది. ఈ మహాకావ్యాన్ని రచించిన వాల్మీకి మహర్షి ఆదికవిగా కీర్తినిగడించారు. ఇరవై నాలుగు వేల శ్లోకాలతో కూడిన రామాయణ మహాకావ్యం హిందూ దేశపు ధర్మం, చరిత్ర, సంస్కృతి సంప్రదాయాలు , ఆచారవ్యవహారాలు, నమ్మకాలు, నడివడికలపై అనితరమైన ప్రభావాన్ని కలిగి ఉంది. అయితే మారిన యుగధర్మాలతో పాటు సాహితీవేత్తల, జనుల ఆలోచన లలో వచ్చిన మార్పుల కారణంగా కొత్తకొత్త ఉద్యమాలు ప్రారంభమయ్యాయి. 20వ శతాబ్ది చివరి భాగంలో దళిత, స్త్రీవాద ఉద్యమాలు వచ్చాయి. వాటిని వ్యక్తం చేయడానికి దళిత, స్త్రీవాదకవిత్వం మరియు సాహిత్యం వచ్చాయి.

ఈ నేపథ్యంలో స్త్రీవాద ఉద్యమానికి సంబంధించిన సాహిత్యంలో నవలలు, కథలు, కథానికలు వచ్చాయి. కానీ స్త్రీవాద సాహిత్యంలో పద్య కవిత్వంగా వచ్చిన కావ్యం జ్వలిత కౌసల్య. అత్యధిక భాగం గీత పద్యాలతో నడిచిన కావ్యాన్ని డా. అనుమాండ్ల భూమయ్య రచించారు.

రామాయణంలో మనం కౌసల్యని ఒక సాత్విక పాత్ర గానే చూస్తాం.. ఆ సాత్విక పాత్రలకి కొంత ఆవేశాన్ని, ఆవేదనను ఒక ప్రవాహంలా అందించారు రచయిత. ఈ ప్రయోగం వలన కౌసల్య పాత్రలో ఇంతటి అంతర్మ ధనం ఉన్నదా అని మనం ఆశ్చర్యపోతాం. కౌసల్య కోసల రాజుకుమార్తె, అయోధ్య నగర మహరాజు అయిన దశ రథుని పట్టపురాణి కౌసల్య ఎంతో ఉదారస్వభావం కలిగి ఉండి పుత్రవాత్సల్యంతో నిండి ఉన్న మాతృహృదయం కలది. తన కుమారుడు పట్టాభిషిక్తుడు అవుతాడు అనే ఆనందాన్ని అనుభవిస్తున్న సమయంలో శ్రీరామ చంద్రుడు తన సవత్తి వలన అరణ్య వాసానికి వెలుతున్నాడనే విషయాన్ని విని తట్టుకోలేకపోయింది. పుట్టినింటా, మెట్టినింటా తనకు సుఖం లేకుండా పోయిందని తన ఆవేదనను వ్యక్తంచేస్తూ

'జ్వలనంలో నుండి పుట్టిన చిన్న పద్య కావ్యమే జ్వలిత కౌసల్యం'

ఈ కావ్య సృజనకు స్త్రీవాద సాహిత్య నేపథ్యం ఉన్న దని చేరాగారు అభిప్రాయాన్ని తెలియజేశారు. ఇతివృత్తం ఇది అనడానికి ఆస్కారం లేక పోయినా ఒక చిన్న సంఘటనే ప్రధానమైన అంశంగా తీసుకున్నారు భూమయ్య. శ్రీరాముడు తండ్రి ఆజ్ఞాపించగా అడవులకు బయలుదేరుతూతల్లి దగ్గరికి వస్తాడు.

'తల్లీ నీకెరుక పరిచి
అనుమతి పొందవచ్చితి ననుమతింపు
తండ్రి ఆజ్ఞను పాటింపదలచి అడవి
కేగుచున్న నన్నాశీర్వదింపునమ్ము!

స్త్రీ ఎంత శక్తివంతురాలైనా పురుషుని ద్వారానే లేదా భర్త ద్వారానే జరిపించాల్సిన వన్ని జరిపిస్తారని అనడానికి నిదర్శనే ఈ పద్యం.

తండ్రి ఆజ్ఞాపించాడు. ఏమి ఆలోచించకుండా వన వాసానికి బయలుదేరుతుతూ తల్లికి తెలియపరచాలనే ఉద్దేశ్యంతో ఆమెకి విషయాన్ని మాత్రమే తెలియజేస్తాడు. ఆమాటలు విన్న కౌసల్య శోకతప్త హృదయంలో

"ఓయీ రఘురామా శ్రీరామ! నాయనా! ఇ
దేమిటోయి నా తండ్రి ఇవేవి దినము
కత్తులే కిరణములుగా కరకు గుండె
దాల్చి సూర్యుడిలా ఉదయమునందే?"

(జ్వలిత కౌసల్య - పుట- 19 )

ఓ(శ్రీరామా! ఏమిటిది ఈ ఉదయం ఇలా జరిగిం దేమిటి? సూర్యుని కిరణాలే కత్తులుగా మారి నా గుండెలో దిగినట్లుగా ఉంది. ఇలాంటి వార్త నేను వింటానని ఏనాడు అనుకోలేదు. తనకు సంతానం కలుగక ముందు అసలు సంతానం కలుగుతుందో లేదో అన్న వ్యధ ఒకవైపు రాజ్యానికి వారసుడు కావాలి కనుక పట్టపురాణీ గా ఉన్న తాను అనుమతించినా, లేకున్నా దశరథుడు వివాహం చేసుకోవడం మరోవ్యధ. తన సపతులు ఎవరు తనకంటే సాటి రాని వారు. వారంతా తనకన్న చిన్నవాళ్లు. వాళ్లకీ సంతానం కలగనప్పటికి గొడ్రాళ్ళని సూటిపాటి మాటలతో తనను వేధించడం, ఇదంతా దశరథునికి తెలిసి కూడా ఎవరినీ ఏమి అనకుండా ఉండటం,తనకి శ్రీరాముడు జన్మించిన తరువాతే మనశ్శాంతి వివాహానంతరం పట్టాభిషిక్తుడు అవుతాడనే సమయానికి తన సపత్ని కోరిక మేరకు అడవులకు వెళతాననడంతో తన మానసిక పరిస్థితిని ఈ విధంగా రామునితో వ్యక్తం చేస్తుంది.

నాడు నిన్ననే గనకున్న నష్టమేమి
కలిగెడిది? వంధ్యయను పేరొక్కటియెతప్పబీ
సంతులేదన్న ఏకైక చింత తప్ప
వంధ్యకు మరొక్క చింత రవ్వంత లేదు
(జ్యు.. కా, పుట-18)

తాను గొడ్రాలు అనిపించుకోవడం వల్ల కలిగే బాధ అనుభవించడాని కయినా సిద్ధమే కాని కొడుకు అరణ్యా నికి వెళ్లడాన్ని సహించలేనని తెలియజేస్తుంది.

సపతుల వల్ల తను పడిన కష్టాన్ని తెలియజేస్తుంది. పేరుకు పట్టమహిషినే కాని మీ నాన్నగారి నిర్వాకం నా బతుకు దాసికన్నా హీనం అయిందని నువ్వు రాజువైతే నేను సుఖపడతానని అనుకున్నాను. అది కూడా ఆడియాసే అయ్యింది. భార్యాభర్తల మధ్య ప్రేమాను రాగాలుండాలని అవి దశరధుని వద్ద కనిపించవని స్పష్టం చేస్తుంది. అంతేకాక ఏడు వారాలనగలున్నాయి. నన్ను కొలువ దాసీ జనమున్నారు. రాజుగారి పెద్ద భార్యగా ప్రజల దృష్టిలో మహారాణిని. కాని దేనిని అనుభవించలేని నిర్బందితురాల్ని ఈ నిర్బందాలన్నింటి నుండి విముక్తి కావాలని అని రామునితో చెబుతూ పరోక్షంగా తన భావాన్ని వ్యక్తం చేస్తుంది.

నేను రాణినే అయికూడా మీజనకుడనను. నిగ్రహించి ఇంతయును స్వేచ్ఛనీయలేదు' అని కౌసల్య తన గుండెలోతుల్లో దాచుకున్న ఆవేదనను వ్యక్తం చేస్తుంది. సవతి కొడుకు రాజైతే ఇక నాకు ఈపాటి స్వేచ్ఛ కూడా ఉండదు.

ఇక్కడి కంటే అరణ్యంలోజంతువుల మధ్య జీవించడం నయమని, నీతోపాటు వనవాసానికి తీసుకు వెళ్లమని నర్మగర్భంగా చెబుతుంది.నాడు గర్భం నుండి కాళ్ళతో తన్నితే నీపాదాల కెంత బాధ కలిగిందోఅని నేను బాధ పడ్డాను. అని పలకడంలో ఆరోజు గర్భంలో ఉండి బాధను కలిగించావు, నేడు పెరిగి పెద్దవాడివై చెప్పిన మాట వినకుండా తండ్రికే విలువను ఇస్తున్నావని ప్రశ్నిస్తుంది.

"ఏ ధర్మము లేకుండా ఏలుతున్న ధర్మప్రభువు నా యెడని అధర్మమేల చేయు?.... అని వ్యంగ్యంగా దశ రధుడు పాలన అంతా అధర్మమయమే అని, అందులో ధర్మం కనిపించడకుండా ఉందని, అయినా నేను ఇంత కాలంగా నాలో నేను ఆత్మ క్షోభను అనుభవిస్తున్నాని ఇకపై తిరుగుబాటు చేయవలసిన అవసర పరిస్థితి ఏర్పడిందని చెబుతుంది. తన మాటలను లక్ష్మణుడు సమర్థించాడని, తన మనసులోని భావనను అర్థం చేసుకున్నాడు అతని మాటను కూడా గౌరవిస్తూ తండ్రిని ఎదిరించమని పరోక్షంగా తెలియజేస్తుంది.

అనంతమైన దుఃఖములో ఉన్న తల్లి ఎప్పుడూ నవ్వుతూ కనిపించేది. ఆమె హృదయంలో ఇంతటి అగ్నిపర్వతం దాచుకున్నదని గ్రహించాడు రాముడు. సముద్రం చెలియలి కట్టను తెంచినట్లుగా మహా అగ్నిపర్వతమై రగులు తున్న తల్లి కనిపించింది. తల్లి బాధని, తండ్రి అశక్తతను ఏకకాలంలో గుర్తించాడు, ఓర్చు కున్నాడు. తండ్రి ప్రేమ తనకీ, లక్ష్మణునికి తెలుసునని, వృద్ధాప్యం వలన, తన మూడవభార్య కైకకు ఎదురు చెప్పలేని పరిస్థితిని ఆకళింపుచేసుకున్నాడు రాముడు. భర్తను వదిలి భార్య ఉండడం ధర్మం కాదని సున్నితంగా

సూక్ష్మంగా తెలియజేశాడు. తండ్రిగా కంటే రాజుగానే దశరథుడు బాధ్యతనెరిగిన వాడని, తండ్రి మాటే కాదు తల్లిమాట కూడా తనకు ముఖ్యమని గ్రహించాడు రాముడు.

గడిచినట్టి కాలమ్మదో గడిచిపోయి.
తండ్రి తప్పాడులివే యని తలపలేదు
ఏపరిస్థితు లెట్లు రావిన్ను నాకు
ఒక్క సీతమే ఈ జన్మకున్న భార్య !
(జ. కౌ.. పుట- 43)

రాముని ఏకపత్నీ వ్రత ప్రతిజ్ఞ వినగానే సంతోషించింది కౌసల్య. తన మనసులోని ఆవేదనను, క్రీడారి, బహు భార్యత్వం వల్ల కలిగే కష్టాలను గ్రహించాడని, తన మనసు లోని అంతరార్థాన్ని గ్రహించిన రాముడిని చూసి ఆనందంతో వనవాసానికి పంపిస్తుంది. నీవు తిరిగి వచ్చిన రోజే నాకు నిజమైన సంతోషం కలుగుతుంది. ధర్మమే నిన్ను రక్షిస్తుందని దీవిస్తుంది.

**ముగింపు :**

సవతి కైకేయమలన దశరథుని ప్రేమకు దూరమైన ఆమెజనపనే కాదు, మాతృవాత్సల్యానికి కలిగిన విచ్చితి పైన కూడా, కౌసల్య అంతరంగ మధనాన్ని సున్నితంగా స్త్రీ సహజ ప్రకృతిని, భావనలను చిత్రీకరించి సమస్యా పరిష్కారాన్ని ప్రతిపాదించారు. భూమయ్యగారి కౌసల్య సంప్రదాయాన్ని కాదనకుండానే జన్మసాఫల్యం సాధించు కున్నట్లు ఇలా...

కౌసల్య జ్వలనంలో అగ్నిపునీతమైన సంస్కారాన్ని, ఆవిష్కరింప చేయటంలో సఫలులు అయ్యారు భూమయ్య, ఏక పత్నాత్వాన్ని రాముని ఏకపత్నీ వ్రత ప్రాశస్త్యం కౌసల్య జ్వలనంలోంచి వచ్చిందన్న ఆలోచన, కవి హృదయావిష్కరణ ప్రశంసనీయం. బహుభార్యత్వం వలన తనలా మరే స్త్రీ దుఃఖించ కూడదని, తన కోడలైన సీతకే దుర్గతి కలుగకూడదన్నది కౌసల్య అంతర్గతభావం. సమాజంలోఎన్నటికి మార్పు చెందని రాజరిక వ్యవస్థను, అందులను బహుభార్యత్వాన్ని ధిక్కరించి రాముడిని ఏకపత్ని వ్రతం వైపు కౌసల్య మళ్ళించడం స్త్రీ గా తాను సాధించిన మహా అద్భుతమైన విజయం. ఈ విధంగా స్త్రీవాద సాహిత్యంలో తొలి పదకావ్యంగా 'జ్వలిత కౌసల్య'ని పేర్కొనవచ్చును.

**ఆధార గ్రంథాలు :**

1. జ్వలితకౌసల్య - ప్రథమప్రచురణ - జనవరి 19,1999
2. తెలుగు సాహిత్య చరిత్ర - తెలుగు అకాడమి (1986)
3. వాల్మీకి రామాయణం -(అయోధ్య కాండ) అర్ష్య విజ్ఞాన ట్రస్ట్, (192).

★★★

BHAVAVEENA
Vol. 21, Issue. 09, September 2024

ISSN No. : 2456-4702
RNI No. APTEL/2003/12253

# గిరిజనుల పంచాయతి వ్యవస్థ మళావ్

- డా॥. బానోత్ స్వామి, అసిస్టెంట్ ప్రొఫెసర్, తెలుగు విభాగం, కాకతీయ విశ్వవిద్యాలయం, వరంగల్.

భారతదేశంలో గిరిజన బతుకులు వలస పాలనకు పూర్వం సంచార వాణిజ్యం చేసిన లంబాడాలు ఒక అంతర్గామికులంగా రూపాంతరం చెందారు. వలసవాద ఆంత్రోపాలజిస్టులు సంచార సమూహాలు గాను బంజారా లుగానో వర్గీకరించినప్పటికీ వీరు క్రమంగా ఆయా వృత్తులను అంటి పెట్టుకోకుండా పశుకాపరులుగా వ్యవసాయ కార్మికులుగా మరే ఇతర వృత్తులను చేసు కుంటున్నాప్పటికీ వారి కుల గుర్తింపు గానీ వృత్తి చుట్టూ తిరగడం లేదు. అందుకే కులము కులాల సోపాన క్రమంలో ఒక స్థావరాన్ని ఉనికిని ఏర్పరచుకుంది. ఇది ఒక విలక్షణమైన చైతన్యాన్ని సంతరించుకుంది.

**పరిచయం :**

వలస రాజ్యం నూతన రాజకీయ తర్కం నాగరికతలో ఒక నూతన క్రమాన్ని స్థాపించి తద్వారా బంజారాలో తమ సొంత సాంస్కృతిగా సాంప్రదాయాలను సంస్కరించుకొని పాలన విలువలను పాటించడం మొదలుపెట్టారు. అదే క్రమంలో తండాలలో గిరిజన గూడాలలో స్వయంప్రతిపతి గల పంచాయతీ వ్యవస్థను వారికి వారే అమలు పరచుకున్నారు. ఆ క్రమంలో ప్రతి గిరిజన తండాలలో నాయక్ అనే వ్యవస్థ ప్రారంభం అయింది. అయితే ఈ నూతన రూపాలు మాత్రం వారి ప్రాచీన విలువలపై సాంస్కృతి సాంప్రదాయాలను అనుసరించి పంచాయతీ వ్యవస్థ ప్రారంభమైంది. ఈ పంచాయతీ వ్యవస్థను మాళావ్ అని బంజారా భాషలో పిలుస్తారు.

బంజారాలో తమ సంస్కృతి సాంప్రదాయాలను సంస్కరించుకొని పాలన విలువలను పాటించడం మొదలు పెట్టిన తర్వాత లంబాడాలో తమ సమూహాన్ని తమ వర్గాన్ని తమ గూడాలను తండాలను బలోపేతం చేసుకుని బృహత్కుల హిందూ సమాజానికి అనుసంధా నించుకున్నారు. నాయక్ వ్యవస్థ తండాలలో పెద్దమనిషిగా తండాకు పెద్ద దిక్కుగా భావించేవారు. ఈ విధంగా రూపాంతరం చెందిన వీరి సంస్కృతి సాంప్రదాయాలలో మాళావ్ అనేది వీరి పంచాయతీ వ్యవస్థను స్వయంగా గిరిజనులే స్వయం ప్రతిపత్తి గల వ్యవస్థగా వీరు గ్రామంలో పంచాయతీ వ్యవస్థను ఏర్పాటు చేసుకున్నారు. ఈ విధంగా బంజారాలు ఏర్పాటు చేసుకున్న పంచాయతీ వ్యవస్థ వలస రాజ్యపు సవాళ్లను ఎదుర్కోవడానికి దోహద పడింది. ఈ ప్రక్రియ కొంతకాలం తర్వాత బలోపేతం అవుతూ సమూహ బంధాలు బలపడేలా చైతన్యం పెరిగేలా చేసింది.

సమూహ గుర్తింపు అనేది కేవలం సామాజిక గ్రూపు లోని ఒక వర్గం మాత్రమే కాదు అది సామాజిక సమూహాన్ని ఐక్యం చేసి బలోపేతం చేసే ఒక భావ జాలము. ఎందుకంటే బంజారా వర్గాల ప్రజల మధ్య వారి తండా ఆర్థిక సామాజిక వైవిధ్యాలు వైరుధ్యాలు ఉంటూ కొన్ని సందర్భాలలో వారి మధ్య హింసాత్మక సంఘర్షణలు చోటు చేసుకున్న సందర్భాలు వారి మధ్య భూ వివాద సమస్యలు జీవన విధానానికి సంబంధించిన అంశాలలో సాంస్కృతిక సాంప్రదాయాల భిన్నాభిప్రాయాల విషయాలలో ఆచారాలు పండగలు నిర్వహించే సమయాల్లో జాతరలు ఉత్సవాలు జరిపే క్రమంలో వివిధ సమస్యలను వారు పరిష్కరించుకోవడం నాయక్ పాత్ర ద్వారా జరుగుతుంది. ఈ సమస్యను బంజారా ప్రజలు మాళావ్ ద్వారా నాయక్ నాయకత్వంలో పరిష్కరించు కుంటారు.

ముఖ్యంగా వీరి పంచాయతీ మాళావ్ వ్యవస్థలో ప్రాచీన ఉమ్మడి ఆధ్యాత్మికతచింతనా ద్వారా పరిష్క రించుకునే వీలు కలుగుతుంది. ఇది ముఖ్యంగా బంజారా లలో అంతర్గత వైశాల్యాలను ఎదుర్కొనే ఐకేశక్తిని ప్రసాదించి బంజారాలలో అంతర్గత బంధాలను పెంచు కోవడంతో పాటు సాంస్కృతి సాంప్రదాయాలను కాపాడు కోవడం వారికి వారే తీర్పు చెప్పుకునే స్థాయికి ఎదగడం

ముఖ్యంగా భూస్వాములు, పోలీసులు, వడ్డీ వ్యాపారులు, రెవెన్యూ అధికారులు పెట్టే బాధలను ఎదుర్కోవడం పంచాయతీ వ్యవస్థలో ప్రముఖమైన స్థానాన్ని సంత రించుకుంది.

## మాళావ్ :

గిరిజన తండాలలో గూడాలలో నివసిస్తున్న బంజారా లలో వినూత్నమైన వ్యవస్థ మాళావ్. మాళావ్ అంటే పంచాయతీ సమూహం గుంపుగా మాట్లాడుకునే ప్రదేశం లేదా సమస్యను పరిష్కరించుకునే స్థలం. ఖండాల్లో నివసిస్తున్న బంజారాలో ఒక ప్రదేశంలో అందరూ ఒక చెట్టు కింద లేదా ఎత్తైన ప్రదేశంలో తండా మధ్యలో కూర్చొని సమస్యను పరిష్కరించుకునే వేదిక దీనినే మాళావ్ అంటారు. దీనికి ముఖ్య కార్యనిర్వహకులు, న్యాయ సలహాదారుడిగా నాయక్ వ్యవహరిస్తారు. పూర్వ కాలంలో బంజారాలో వారికి వారే స్వయం ప్రతిపత్తి గల ఒక వ్యక్తిని తండా నుండి ఎన్నుకొని నాయక్‌గా ప్రకటించు కుంటారు. ఆ విధంగా నాయక్ తండాలో ప్రతి సమస్యను మాళావ్ ద్వారా పరిష్కరించుకుంటారు.

ప్రాచీన గిరిజన సమూహాలలో కూడా ఈ వ్యవస్థ కనబడుతుంది ఎందుకంటే గిరిజనులు సామాన్యంగా బయటి వ్యక్తులను నమ్మకపోవడం వారి సంస్కృతి సాంప్రదాయాల్లో హాని కలిగించే వ్యక్తులకు గిరిజనులు అధికారాలు అప్పగించకపోవడం చారిత్రక విషయాల్లో గమనించవచ్చు. ఎందుకంటే గిరిజనులలో వారి సంస్కృతి సాంప్రదాయాలకు ఆచార విశ్వాసాలకు తావు ఇవ్వ కుండా వారి ఉన్నతిని కాపాడుకునే వారు. తండాలో విషయాలు చర్చించాలన్న సమస్యను పరిష్కరించు కోవాలన్న కేవలం పురుషులు మాత్రమే ఉండేవారు. స్త్రీలు గౌరవ ప్రదంగా జీవించేవారు. తండాలో మాళావ్ జరిగే క్రమంలో కేవలం పురుషులు మాత్రమే మాళావ్‌లో కూర్చునేవారు. స్త్రీలు ఈ తంతులో దూరంగా ఉండడం గౌరవప్రదంగా వ్యవహరించడం జరిగేవి.

మాళావ్ జరిగే క్రమంలో కేవలం నాయక్ మాత్రమే తీర్పును ఇచ్చేవారు మిగతావారు అతని మాటకు తీర్పుకు అంగీకారం తెలిపేవారు. మాళావ్ జరిగే ప్రదేశంలో స్త్రీలు వచ్చేవారు కాదు చాలా దూరం నుండి వెళ్లిపోయేవారు ఎంతో గౌరవప్రదంగా జరిగే ఈ ప్రక్రియ గిరిజన సమాజంలో అత్యున్నత న్యాయస్థానంగా మాళావ్ ఉండేది.

తండా వ్యవస్థలో ఉండే ఈ మాళావ్ ప్రక్రియ ప్రాచీన కాలం నుండి వస్తున్న వీరి సాంప్రదాయక పంచాయతీ వ్యవస్థ. ఇందులో నాయక్ ప్రథమ పౌరుడిగా, తండా అన్న పెద్ద వయసు అనుభవం ఉన్న వాళ్ళు పెద్ద మనుషులుగా వ్యవహరిస్తూ కొంతమంది కుల పెద్ద మనుషులు ఇందులో సభ్యులుగా వ్యవహరిస్తారు. ఈ విధంగా తండాలో కొనసాగే ఈ వ్యవస్థ దాదాపు వందల సంవత్సరాల చరిత్ర కలిగినది. ఎంతో ప్రతిష్ఠాత్మకంగా వారి సంస్కృతి సాంప్రదాయాలను కాపాడుకుంటూ వస్తున్న క్రమంలో ఆధునిక సంస్కృతి, ఆధునిక నాగరికత వీరి సంస్కృతిపై నూతన సాంప్రదాయ వ్యవస్థను వెద జల్లింది.

## పంచాయతీ వ్యవస్థగా మార్పు :

సాంప్రదాయ పంచాయతీ వ్యవస్థను అనుసరిస్తున్న గిరిజన జీవితాలలో తర్వాతి కాలంలో మూడంచెల పంచాయతీరాజ్ వ్యవస్థ ప్రారంభమైంది. భారతదేశంలో మొదటగా రాజస్థాన్లో ప్రారంభమైన ఈ వ్యవస్థ, రెండవ రాష్ట్రంగా 1959 నవంబర్ 1న ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో మహబూబ్నగర్ జిల్లాలో పంచాయతీరాజ్ వ్యవస్థ ప్రారంభ మైంది. తర్వాత కాలంలో రాష్ట్రమంతటా విస్తరించి 1994లో పంచాయతీరాజ్ చట్టంగా మారింది. దీని ద్వారా గిరిజన ప్రజలలో వారికి తెలియకుండానే కొత్త చట్టాలు, నూతన విధివిధానాలు వారి జీవితంలోకి ప్రవేశించాయి. సాంప్రదాయబద్ధంగా అనుసరిస్తున్న పంచాయతీ వ్యవస్థలో నూతన సంస్కరణలు ప్రారంభమయ్యాయి.

1986లో బ్లాక్ స్థాయి వ్యవస్థని మండల పరిషత్ గా మార్పు చేస్తూ, 2010 ఏప్రిల్ 24 నుండి జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవంగా నిర్వహిస్తున్నారు. కాలక్రమమైన అనేక నూతన చట్టాలు రావడం సామాజిక చైతన్యంలో భాగంగా వ్యవస్థలో %ూజుూూ% చట్టం

రావడం, అనేక జాతీయ అటవీ చట్టాలు రావడం గిరిజన జీవితాలు నియంత్రణకు లోనయ్యాయి. తండాలో ఉన్న సాంప్రదాయ పంచాయతీ వ్యవస్థలో నాయక వ్యవస్థ మెల్లమెల్లగా కనుమరుగవుతూ సర్పంచ్ వార్డు మెంబర్ కు ఆప్షన్ మెంబర్గా నూతన పంచాయతీ నిర్వహణ అధికారులు పాలన బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఈ విధంగా గిరిజన తండాలలో నాయక్ వ్యవస్థ కార్ భారీ వ్యవస్థ సమూలంగా మార్పు చెందింది. కొంతకాలం తర్వాత గిరిజన గుడాల మీద కొత్త చట్టాలతో పాటు నూతన సంస్కరణలు వీరి మీద రుద్దపడ్డాయి.

## సంస్కృతి సాంప్రదాయాలపై ప్రపంచీకరణ ప్రభావం :

1990 తర్వాత ప్రపంచీకరణ ప్రైవేటీకరణ సరళీకరణ అంశాల మూలంగా తీవ్రంగా నష్టపోయిన వారిలో గిరిజనులు ముందు వరుసలో ఉన్నారని చెప్పవచ్చు. ప్రపంచీకరణ పేరుతో ఎన్నో నూతన మార్కెట్ పారిశ్రామిక వ్యవస్థ అమలులోకి వచ్చి సాంప్రదాయక వస్తు వినిమయాలు విక్రయాలన్ని మార్కెట్ పరం అయ్యాయి. దాని మూలంగా సాధారణ ప్రజల జీవితాలు రోడ్డు మీద పడ్డాయి. సాంప్రదాయ ఆర్థిక వస్తు వ్యాపారంలో భాగమైన వస్తు మార్పిడి పద్ధతి, సహజ వనరుల వినియోగం తగ్గి అత్యవసర వస్తువులు సైతం మార్కెట్ వ్యవస్థతో అందలం ఎక్కాయి.

## ముగింపు :

ముఖ్యంగా గిరిజనుల సంస్కృతి సాంప్రదాయాలు ఆధునిక నాగరికత పోకడలతో వారి జీవితాలపై అనేక ప్రభావాలు చూపించాయి. గ్రామీణ వ్యవస్థలో సహితం సాంకేతిక మార్కెట్ వ్యవస్థ ప్రారంభమై వ్యాపారం ప్రైవేటీ కరణకు లోనయ్యింది. దీనితో కేవలం గిరిజనుల సాంప్రదాయ ఆర్థిక వ్యవస్థతోపాటు రోజువారి జీవితంలో ప్రాచ్యత్య సంస్కృతి వికసించింది. దీని ద్వారా గ్రామీణ ప్రజలు మెల్లమెల్లగా ఆధునిక నాగరికతలో మునిగి పోయారు. ముఖ్యంగా గిరిజనులలో పంచాయతీ వ్యవస్థ, సాంప్రదాయ వ్యవసాయ వ్యవస్థ, సహజ వనరుల లభ్యతలో విపరీతమైన మార్పు వచ్చింది.ప్రకృతిలో దొరికే సహజ సంపదపై సహితం ప్రభుత్వం అనేక ఆంక్షలు విధించి అటవీ సంపదపై నూతన చట్టాలు గిరిజనులను ప్రాజెక్టు నిర్మాణం మూలంగా వలసలకు గురి చేశాయి. బంజారాలో అక్షరాభ్యాసం లేక వలసలకు గురి అయ్యి వివిధ పట్టణ ప్రాంతాలకు వలసలు ప్రారంభించారు.

ప్రపంచీకరణ కేవలం సాంకేతిక పూర్వ అభివృద్ధి సాధించింది కానీ సంస్కృతి సాంప్రదాయాలపై ముఖ్యంగా గిరిజనులపై వారికి తెలియకుండానే వారి మీద అనేక ఆంక్షలు విధించబడి సాంప్రదాయ మార్కెట్ వ్యవస్థ కనుమరుగైపోయింది. ముఖ్యంగా గిరిజనులపై అనేక పెత్తందారీ వ్యవస్థలు అధికారం చలాయించి వారి జీవితాలను సమూలంగా మార్చి వేశాయి. వారి ఆచారాలు వ్యవహారాలు సంస్కృతి సాంప్రదాయాలు ముఖ్యంగా వీరి సాంప్రదాయ పంచాయతీ అయినా మాళావ్ వ్యవస్థ నేడు కనుమరుగైపోయింది. నూతన పంచాయతీ రా చట్టాలు వచ్చి వీరి సాంప్రదాయ పంచాయతీ వ్యవస్థను నాయకులు ఎన్నుకునే అవకాశం లేకుండా చేస్తూ వీరి సంస్కృతిని తర్వాతే కాలంలో సమూలంగా మార్చివేసింది. దీనికి అనేక ఆర్థిక, రాజకీయ, సాంఘిక, కారణాలు ముడిపడి ఉన్నాయి. ప్రస్తుతం తండాలలో కూడా మాళావ్ అనే వ్యవస్థ పూర్తిగా కనుమరుగవుతూ వస్తుంది. వీరి స్థానాలలో సర్పంచ్ ఉప సర్పంచ్ వార్డు మెంబర్ కార్య దర్శి అధికార యంత్రాంగం వచ్చి వీరిని నియంత్రణ లోకి పెట్టుకొని తండా వ్యవస్థను అమలుపరుస్తుంది.

దాదాపుగా బంజారాల సంస్కృతి సాంప్రదాయాలు చాలావరకు విస్మరిస్తూ నూతన పోకడలకు అలవాటు పడిన ప్రజలు ప్రాచ్యత్య సంస్కృతిలో భాగమైపోతున్నారు. ఆ రోజుల్లో మాళావ్లో తీర్పు జరిగితే న్యాయబద్ధత, మాటకు గౌరవం సమూచ్చిత నిర్ణయాలు జరిగి ఉండేవి. కానీ ప్రస్తుతం అవినీతికి పాల్పడుతూ రెండు వర్గాల ప్రజలు సంఘర్షణకు లోనైనా, సరైన న్యాయం పొందక జాతి ఘర్షణలు జరుగుతున్నాయి.

మాళావ్ని అత్యున్నత న్యాయవ్యవస్థగా భావించే గిరిజనులు ప్రస్తుతం ఆధునిక నాగరికతలో మునిగి తేలుతు నూతన పోకడలకు దారితీస్తున్నారు. దీనికి

సమాజమార్పులో అనేక కుల, మత, రాజకీయ, ఆర్థిక, సాంఘిక కారణాలు ఉన్నప్పటికీ సంస్కృతి, సాంప్రదాయాలు మరిచిపోవడం రేపటి నవ్య సమాజానికి హాని జరిగే ప్రమాదం ఉంది. కావున సంస్కృతి సాంప్రదాయాలను కాపాడుతూ సాంకేతిక పురోగాభివృద్ధి అమలు జరగాలని కాంక్ష.

**ఉపయుక్త గ్రంథసూచి :**

1. గోనా నాయక్:భారతదేశంలోబంజారాలు,కేంద్రీయ విశ్వవిద్యాలయం, హైదరాబాద్, 2005. : సుగాలి సంస్కృతి భాషాసాహిత్యం, కేంద్రీయ విశ్వవిద్యాలయం, హైదరాబాద్.
2. చీనియ నాయక్:బంజారా చరిత్ర సంస్కృతి- ప్రగతిఅనంతపురం, ఆంధ్ర ప్రదేశ్ 1998.
3. నదీం హస్ నైన్:భారతీయ గిరిజనులు, హైదరాబాద్, 1995
4. భంగ్య, భూక్యా:నిజాం పాలనలో లంబాడీలు,హైదరాబాద్, 2012.
5. బాలాజీ దాసు రాథోడ్, భూక్య:నవీన బంజారా సాంఘిక సంకీర్తనలు,1982.
6. రాజ్ మహమ్మద్:తెలంగాణ గిరిజనుల మౌఖిక సాహిత్యం,హైదరాబాద్, 2002.
7. వేణుగోపాల్, విట్ట: ప్రాచీనాంధ్ర సాహిత్యంలోగిరిజనజీవన చిత్రణ,ఉస్మానియా విశ్వవిద్యాలయం, హైదరాబాద్, 2008.

★★★

# లంబాడాలు 'రాజపుత్రులా' వీళ్ల మూలస్థానమేది

– డా॥. లక్ష్మణ్ నాయక్ బాణోత్, ప్రిన్సిపల్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మహబూబాబాద్ జిల్లా .

బంజారాలు విశ్వమంతా కన్పిస్తున్నారు. బంజారాలు అంటే ఒక పెద్ద సమాజం లేదా ఒక జాతి అనేది సుస్పష్టం. అయితే తెలుగు దేశంలో బంజారా, లంబాడ, సుగాలీ శబ్దాలను పర్యాయ పదాలుగా వ్యవహరిస్తున్నారు. వీళ్లు రాజ పుత్రులని ఎవరెవరు ఏమన్నారు అనే అంశాలను పరిగణలోకి తీసుకుందాం.

"భారతదేశంలో బంజారాలు విశ్వవ్యాప్తంగా కన్పిస్తున్న రోమా, జిప్సీల సగోత్రులు. వీరి స్వస్థలం రాజస్థాన్ అయినా వీళ్ళు ఈనాడు దాదాపు అన్ని రాష్ట్రాల్లోనూ కన్పిస్తున్నారు. కానీ ఉత్తర, పశ్చిమ, దక్షిణ భారతదేశంలోనే అధికంగా వ్యాపించి ఉన్నారు. వీళ్లది ఒక బహుజన సమాజం. బంజారా అన్నది ఒక కులం కాదు సామాజిక సమూహం (Social Group) వాళ్లలో గోర్ బంజారాలు రాజస్థాన్‌లోని రసపుత్రులతో సగోత్ర సంబంధం గల వాళ్లని రక్త పరీక్షలు నిరూపించాయి.

బి.ఎస్. గుహ గారు భారతదేశ జనాభా మొత్తాన్ని 1931లో జనాభా గణన జరిపిన సందర్భంలో 1. నార్డిక్, 2. నెస్టర్, బ్రాబ్రీసెసాల్, (అర్మినాయిడ్) పేలియో మెడిటేరియన్, ఫోటో ఆస్ట్రలాయిడ్, మంగో లాయిడ్, నిగ్రిటోలు అనే ఆరు వర్గాలుగా వర్గీకరించారు. మానవు లలో తెల్లని వర్ణశరీరులు కాకసాయిడ్ వర్ణంలోకి చేరు తారు. పసుపు వర్ణశరీరులు మంగోలాయిడ్ వర్గానికి చెందుతారు. నిగ్రోలాయిడ్, ఆస్ట్రాలాయిడ్ వర్గంలో సలుపు వర్ణశరీరులుంటారని విజ్ఞుల అభిప్రాయం. అధిక శాతం జనులు కాకసాయిడ్ జాతికి దానికి సంబంధమైన మూడు ఉపజాతులకు చెందినవారు. ఉత్తర భార తీయులు నార్డిక్ ఉపజాతికి చెందుతారని చెప్పవచ్చు. వీరు పొడవైన మేను, పొడుపు తలలు, స్పష్టంగా కన్పించు సొగముక్కు నలుపు లేక కొంచెం గోధుమ రంగుతో వంకరలేని వెంట్రుకలు ఉజ్వల నేత్రాలు కొంచెం తెలుపు మేనిచ్ఛాయను కల్గి వుంటారు. వీరిలో కొందరు ఉత్తర భారతం నుండి దక్షిణానికి వచ్చారు. తెలంగాణ, రాయలసీమల్లో ఇప్పుడు నివసించే లంబాడాలు ఇలా వచ్చినవాళ్లే. కాకసాయిడ్ జాతిలోని రెండవ ఉపజాతవారే ఆల్పైన్ లేక ఆర్మినాయిడ్ ఉపజాతి వాళ్లని విజ్ఞాన సర్వస్వము చెబుతోంది.

భారతదేశ చరిత్రను రచించిన వలసవాద చరిత్ర కారుల్లో ముఖ్యంగా చార్లెస్టాడ్ రాసిన Annuals and Antiquities of Rajasthan అనే గ్రంథంలో రాజపుత్రుల పుట్టుపూర్వోత్తరాలు చరిత్ర వివరణ ఉంది. భారతదేశంలో స్థిరపడిన శకులు, హుణులు, ఘూర్జరులు మొదలైన విదేశ్య జాతులు భారతీయ సమాజం సంస్కృతితో మమేకమై భారతదేశాన్ని మాతృదేశంగా భావించారని ఆ తర్వాత వారిలో కొందరు రాజకీయంగా ఉన్నతస్థాయికెదిగి తమకు తామే రాజపుత్రులుగా ప్రకటించుకున్నారని రచయిత అభిప్రాయపడినారు. రాజపుత్రులు ఆచరించిన అశ్వమేధ యాగాలు, అశ్వపూజ, ఆయుధపూజ మొదలైన ఆచారాలన్నీ విదేశీయమైనవి కాబట్టే 'రాజపుత్రులు' భారతదేశంలో స్థిరపడిన విదేశీయులు అని టాడ్ తనవాదాన్ని వివరించారు. ఈ వాదనను యూరోపియన్ చరిత్రకారులు కూడా సమర్థించారు.

అయితే దీనికి వ్యతిరేకంగా జాతీయ చరిత్రకారులు సి.వి. వైద్య, బి.యస్. ఓజా మొదలైన వారు రాజపుత్రులు తమ శాసనాలలో ఇతిహాస కాలం నాటి సూర్యచంద్ర వంశాలకు చెందిన వారమని చెప్పుకోవడం వల్ల వారి అవయవ సౌష్టవం, రంగు శరీర నిర్మాణం మొదలైనవి ఇతిహాస వీరులను పోలి ఉన్నందువల్ల రాజపుత్రులు భారతీయ ఆర్యులే కాని విదేశీయులు మాత్రం కాదని వివరించారు. అంతేగాక భారతదేశానికి విదేశీయులు రాక ముందు అవ్వమేధ యాగాలు, అశ్వపూజ, ఆయుధపూజ మొదలైనవి రాజపుత్రులు పాటించిన ఆచారాలు. ఇవి కొత్తవి కావని భారతదేశంలో పాలకవర్గాలు ఎప్పుడు వీటిని

పాటిస్తూనే వస్తున్నారని అందువల్ల రాజపుత్రులు భారతీయులే అని సిద్ధాంతీకరించారు. "ఇంతేగాక రాజపుత్రులు అగ్ని నుంచి ఆవిర్భవించిన వారని ఒక కథ ప్రచారంలో ఉంది.

పరుశురాముడు భూమిపై నున్న మొత్తం క్షత్రియ వర్గాన్ని నాశనం చేశాడని పాలకుల కొరకై అబూ పర్వత శిఖరంపై యజ్ఞాన్ని నిర్వహించగా యజ్ఞగుండం నుండి నలుగురు దివ్య పురుషులు పుట్టారని కథను చెపుతుంటారు. వాళ్లే చౌహాణులు, సోలంకీలు, పరమారులు, ప్రతిహారులు. అగ్నిగుండం నుంచి ఆవిర్భవించారు కాబట్టే రాజపుత్రులు అగ్నికుల క్షత్రియులు అయినారని చాంద్ బర్దాయ్ 'పృధ్వీరాజ్ రాసో' అనే గ్రంథంలో వివరించారు.

ఆర్.జి. భండార్కర్, అబూ పర్వతంపై జరిపిన యజ్ఞం విదేశీయులను భారతదేశ వర్ణ వ్యవస్థలో విలీనం చేయడం కోసం ఉద్దేశించిన 'శుద్ధి' కార్యక్రమం మాత్రమే అని తమ అభిప్రాయాన్ని వెలిబుచ్చారు. పండితులైన బ్రాహ్మణులు పాలకవర్గాల నుండి మరింత ఆదరణ, పోషణను పొందటానికే వారికి దివ్యత్వాన్ని, క్షత్రియత్వాన్ని ఆపాదించారని వివరించారు. భండార్కర్ 'రాజపుత్ర' అనే పదం ఆయుధాలను ధరించి యుద్ధాలు చేసే ఒక తెగకు మాత్రమే వర్తిస్తుందని రాజపుత్రులు సూర్యారాధన లాంటి విదేశీయ ఆచారాన్ని, సర్పారాధన లాంటి దేశీయ ఆచారాల్ని రెండింటిని ప్రారంభించినారని తెలిపారు. భారతదేశంలో స్థిరపడిన శకులు హూణులు, ఘూర్జరులు మొదలైన వివిధ విదేశీ జాతులు క్రమేణా స్థానిక ఆటవిక తెగలైన భిల్లులు, గోండు మొదలైన వారితో వివాహ సంబంధాలు ఏర్పరచుకొని హిందూ మతాన్ని స్వీకరించి భారతీయులుగా మారడం వల్ల 'రాజపుత్రులు' అనే నూతన తెగ ఏర్పడిందని భండార్కర్ భావించారు.

## మహమ్మద్ ఘోరీతో రాజపుత్రుల యుద్ధం :

"మహమ్మద్ ఘోరీతో జరిగిన యుద్ధంలో పృధ్వీరాజ్ చౌహాన్ పరివారం పరాజయం పాలైన తర్వాత భయానక దుర్భర పరిస్థితులకు లోనైన రాజపుత్రులు ప్రాణాలను అరచేత పట్టుకొని మూడు విధాలుగా చెల్లాచెదరైనట్లు చరిత్ర చెబుతుంది. ఇందులో కొందరు యూరప్ దేశాలకు ప్రాణభీతితో పారిపోయారు వాళ్లే జిప్సీలు, రోమా బంజారాలు. రెండవ వర్గం అడవులపాలై వీళ్లు కొంత కాలానికి తేరుకొని చిత్తోడ్ ఘడ్ తదితర రాజ్యాలను ఏర్పాటు చేసుకొని పాలన సాగించారు.

మొగల్ పరిపాలన ప్రారంభమయ్యే నాటికి రాజపుత్రులు ఉత్తరాది ప్రాంతాలను పరిపాలిస్తుండేవారు. అందులో ఉదయపూర్ రాజ్యం ముఖ్యమైనది. అక్బరు పరిపాలనా కాలంలో రాజపుత్రవీరుడైన రాణా ప్రతాప్ సింగ్ రాథోడ్ ఉదయపూర్ను పరిపాలిస్తుండేవారు. క్రీ.శ. 1576లో అక్బర్తో జరిగిన యుద్ధంలో రాణా ప్రతాప్ సింగ్ రాథోడ్ ఓడిపోయి హలది ఘాట్ పర్వత ప్రాంతానికి వెళ్లి తలదాచుకున్నాడు. రాణా ప్రతాప్ సింగ్ రాజపుత్ర పరివారం అనుసరించారు. ఆ తర్వాత అక్బరు ఒక వర్తమానాన్ని రాణా ప్రతాప్‌కు పంపిస్తాడు. దాని సారాంశం ఏమిటంటే రాణా ప్రతాప్ తనను శరణుగోరి వస్తే అతని రాజ్యాన్ని అతనికి తిరిగి ఇచ్చేస్తానంటాడు. పౌరుషానికి మారుపేరైన రాణా ప్రతాప్ స్వాభిమానంతో దానిని తిరస్కరిస్తాడు. తిరిగి యుద్ధం ద్వారానే తన రాజ్యాన్ని పొందుతానంటాడు. కాని తన శపథం నెరవేరకుండానే రాణా ప్రతాప్ మరణిస్తాడు. వేరేమార్గం లేక అతని పరివారంలోని కొందరు మొగలాయిలతో రాజీపడి నగర బాట పట్టారు. అలా వెళ్లిన వాళ్లే మార్వాడీలు, గుజ్జర్లు వ్యాపారం చేస్తూ ఆర్థికంగా అభివృద్ధి చెందారు".

మరాఠ్వాడ లంబాడాలు క్షత్రియ వంశం నుంచి వచ్చిన భారతీయులని ఇ.జె. కిల్స్ అన్నారు.

"ఆర్.వి. రస్సెల్ లంబాడాలు రాజపుత్ర వంశస్థులని అన్నారు". ఎడ్గర్ థర్డన్ లంబాడాలు క్షత్రియ వంశానికి చెందినవారని యుద్ధం చేయడంలో, వేటాడటంలో, కాపలా కాయడంలో నిపుణులని పేర్కొన్నారు. ఇంతేగాక ఇర్విన్ కూడా లంబాడాలు రాజపుత్ర వంశస్థులన్నారు.

బంజారా కథా గాయకుల, కవులు కూడా దేఖరే తారో ఇతిహాస్ పూరో రాజపుత్ వంశారో అంటే చూడండి మీ ఇతిహాసం చరిత్ర రాజపుత్రుల వంశం నుంచి పుట్టిందని తెలిపారు. 24 బలిరాం పటేల్ మరాఠీ భాషలో బంజార వంశంపై చేసిన పరిశోధనలో లంబాడాలు పూర్వకాలంలో

రాజపుత్రులు క్షత్రియ వంశస్థులని నిర్ధారించారు. లంబాడాలకు రాజస్థాన్‌లోని రాజపుత్రులకు ఘూర్జర, మార్వాడీలకు ఆచార సంప్రదాయాల్లో, జీవిత విధానంలో, భాషా సాహిత్యాల్లో సామ్యాలు అనేకం కన్పిస్తున్నాయి. అంతేగాక రాజపుత్రులలో పమార్, చౌహాన్, రాథోడ్, జాదవ్ మొదలైన వంశాల పేర్లు లంబాడాల్లో కన్పిస్తున్నాయి. ఈ నిదర్శనాల వల్ల రాజపుత్రుల వల్లనే లంబాడ తెగ ఏర్పడిందని స్పష్టమవుతుంది.

షేర్సింగ్ షేర్ గారు లంబాడాల అంశంపై ఇలా అన్నారు. "Originally they are the Rajputs of Rajasthan and they are known to be very brave people being the Decendents of martial race of Rajputs and have not lost their instinctive martial Sirit" (1883-9-73) లంబాడాలు 'రాజపుత్రులనే విషయాన్ని ఇలా నొక్కి వక్కాణించారు.

ఇలాంటి బంజారాలను గిరిజనులని ఒకచోట, వెనుక వడిన వారిన మరోచోట, దళితులని ఇంకోకచోట వర్గీక రించి పరిగణిస్తున్నారు. వీరిలోని రెండు మూడు ప్రత్యేకతలు ఏ ఇతర జన సముదాయాల్లోనూ లేవు.

1. బంజారాలు భారతదేశంలో అత్యధిక సంఖ్యలో ఉన్న ఒక జన సముదాయం. ఆయా ప్రాంతాల్లోని భాషల్ని నేర్చుకొని ఆయా ప్రాంతంలోని జనులతో కలిసిపోయి తొలివృత్తి అయిన వ్యాపార వాణిజ్యా లను, పశుపోషణను వదలకుండా ఊళ్లకు దూరంగా ఉంటున్నా తమదైన సంస్కృతిని వదల కుండా రక్షించుకొంటూ రావడం.
2. భారతదేశం భిన్నత్వంలో ఏకత్వం కలిగింది అనే నానుడికి బంజారాలే అద్భుతమైన నిదర్శనం కావటం, దేశంలోని ఏ రెండు ప్రాంతంలోని బంజారాలైనా దాదాపు ఒకే గోర్బోలిలో మాట్లాడ గలగటం, అదే వారి సమైక్యతా సూత్రం కావటం.
3. హైందవ మతాల మూలాలను పరిరక్షిస్తూ అటు పంజాబులోని గురుద్వారాలలోనైనా ఇటు ఆంధ్ర ప్రదేశ్‌లోని బాలాజీ మందిరంలోనైనా పరమ భక్తులుగా, నిస్వార్థులైన దేశభక్తులుగా, ఆత్మత్యాగ సంసిద్ధులుగా సేవాతత్పరులుగా పరిణతి పొంది ఉండటం. సేవల్‌భాయ భగవదవతారంగా పరి గణింపబడిన బంజారా వీరుడు కావటం.

ఈ నేపథ్యంలో నుంచి చూసినప్పుడు ఇతర గిరిజన జాతుల వంటిది బంజారా జాతి కాదని గుర్తించవలసి వస్తుంది. ఆటవిక గిరిజన జీవితం వీరికి మధ్యయుగాల్లో వచ్చిందే తప్ప తొలుత వీరు మహానాగరికతా వైభవాన్ని చవిచూసిన వారని వారి సంస్కృతి, వేషభాషలు, కథా సాహిత్యం, పాటలు, సామెతలు, పొడుపు కథలు నిరూపిస్తాయని ప్రొఫెసర్ హెచ్.ఎస్. బ్రహ్మానంద గారు అభిప్రాయపడినారు.

డా॥. తంగిరాల వెంకట సుబ్బారావు గారు ప్రపంచంలో వీరులులేని దేశం లేదు. వీర గాథలు లేని సాహిత్యం లేదు. భారతదేశంలో రసపుత్రులకు జన్మభూమియైన రాజస్థాన్ వీరగాధల పురిటిగడ్డ. మాతృభూమి సంరక్షణలో ప్రాణాలను తృణప్రాయంగా బలిపెట్టిన మహావీరులు రసపుత్రులు. (రాజపుత్రులు) ఈ రసపుత్ర వంశానికి చెందిన వీరజాతి నేటి సంచార జాతియైన బంజారాలు వీరినే! 'సుగాలీ' లంబాడి అనే పేర్లతో పిలుస్తున్నారు.

పాండవ వీరవంశం అభిమన్యునితో అంతరించి పోకుండా శ్రీకృష్ణ భగవానుడు కాపాడాడు. ఉత్తర గర్భంలోని పరీక్షిత్తును రక్షించాడు. ధర్మరాజు తర్వాత పరీక్షిత్తు పట్టాభిషిక్తుడయ్యాడు. పరీక్షిత్తు కొడుకు జనమేజయుడు. అతనికి వ్యాస శిష్యుడైన వైశం పాయనుడు మహాభారత గాధను సవివరంగా వివరిం చాడు.

పాండవులు మహాప్రస్థానం చేసే నాటికే కలియుగం వచ్చేసింది. పరీక్షిత్తు జనమేజయుల వంశంలోని వాడే మహావీరుడ పృధ్వీరాజు జనమేజయుని నుంచి పృధ్వీరాజు వరకు గల వంశవృక్షం బయటపడింది (పూర్వం దీని గురించి భారతిలో ఒక వ్యాసం వచ్చింది) భారతదేశాన్ని భారతీయ సంస్కృతిని కాపాడటానికి

ప్రాణాలొడ్డిన శూర శిఖామణి పృధ్వీరాజు అతడు రసపుత్ర వీరుడు. అలాగే తర్వాతకాలంలో మొగలాయి చక్రవర్తులపై తిరుగుబాటు చేసిన రాణాప్రతాప్ సింగ్ వీరుడు. ఈ మహావీరుల సంతతి వారు బంజారాలు.

భారతవీరులైన రాజపుత్రులలో నాలుగు ప్రధాన వంశాలున్నాయి. రాథోడ్, చౌహాన్, పవార్, జాదవ్ ఈ వంశాలు నాలుగూ రాజపుత్రులు నాలుగు ప్రధాన గోత్రాలు. వీరిలో సగోత్రికులు వివాహం చేసుకోకూడదు. ఈ నియమాన్ని అతిక్రమించడం వల్ల తరువాతకాలంలో రాథోడ్ వంశం నుండి బాణోత్ వంశం విడిపోయింది. రాథోడ్ వంశంలో 27 సగోత్రాలున్నాయి. చౌహాన్ వంశంలో 6 సగోత్రాలు పవార్ వంశంలో 12 సగోత్రాలు జాదవ్ వంశంలో 52 గోత్రాలున్నాయి. మహావీరుడు పృధ్వీరాజ్ చౌహాన్ వంశానికి చెందినవాడు. మహారాణా ప్రతాప్‌సింగ్, రాథోడ్ వంశానికి చెందినవాడు.

ఈ రసపుత్రులు ఉత్తమ క్షత్రియ వంశ సంజాతులు. వీరిలో సూర్యవంశ క్షత్రియులు, చంద్రవంశ క్షత్రియులున్నారు. తరతరాలుగా మహ్మదీయులతో పోరాడిన వీరజాతి రాజపుత్రులు. కాలక్రమాన మహ్మదీయుల క్రౌర్యాలకు తట్టుకోలేక కాందిశీకులై నలుదిక్కులకు చెదిరిపోయారు. భారతదేశంలో ఉన్న బంజారాలు ఐరోపా దేశంలో ఉన్న జిప్సీలు మన రసపుత్ర శూర సంతతి వారే. ఆనాడు దేశం కోసం ప్రాణాలర్పించిన వీరజాతి నిన్న మొన్నటి వరకు నిలువనీడ లేకుండా సంచారజాతిగా బతికినారు. ఇది విధి వైపరిత్యాలలో ఒకటి అని చెప్పవచ్చు.

లంబాడాలు 'రాజపుత్రులా' అనే అంశంపై భారతీయ, పాశ్చాత్య పరిశోధకుల ఆధారాలను మరియు లంబాడా కథా గాయకుల, కవుల తరతరాల వారసత్వ బాణిగా సాగుతున్న అంశాలను కూడా పరిగణలోకి తీసుకొని గమనించగా లంబాడాలలో పమార్, చౌహాన్, రాథోడ్, జాదవ్ అనే వంశాలు రాజపుత్రులని నిర్ధారించవచ్చు. మిగతా వంశాలను లంబాడాలు ఉదార స్వభావంతో తమతో ఏడు తరాల తర్వాత కలుపుకున్నారు. వాళ్లనే నేడు "జాంగడ్" అని పిలుస్తుంటారు. మొత్తం లంబాడా కొన్ని రాజపుత్ర వంశాలున్నాయన్నది సుస్పష్టం.

## వీళ్ళ మూలస్థానమేది? :

లంబాడాల భాషా సాహిత్యాలు, ఆచార వ్యవహారాలు, జీవన విధానం, పండుగలు పబ్బాలు, దుస్తులు, ఆభరణాలు చూడగానే అత్యంత ఆకర్షణగా నిలిచే లంబాడా వేషధారణ రాజస్తాన్ వాళ్లదని స్పష్టమవుతుంది.

ఉత్తర భారతదేశంలోని గోరఖ్‌పూర్ నుండి హరిద్వార్ వరకు ఉప పర్వత శిఖరమే బంజారాల మూలస్థానమైనది. (ఇబ్బన్ 1961:62-63) కర్నల్ మెకంజీ మొదలైనవారు బంజారాలు రాజస్తాన్‌లో మూలనివాసులై వ్యాపార నిమిత్తం సార్థవాహులుగా తీసుకొని దూరప్రదేశాలకు వెళ్లేవారని అభిప్రాయపడ్డారు.

సిక్కుల 9వ గురువైన గురుగోవింద్ సింగ్ (క్రీ.శ. 1676) కాలంలో కొందరు బంజారాలు పని అడగడానికి గురుగోవింద్ సింగ్ దగ్గరకు వెళ్లినప్పుడు మేము మారవాడి, బ్రింజోళీ, సలంబూరుల నుండి వచ్చినామని పరిచయం చేసుకొన్నారని షేర్సింగ్ షేర్ ఉల్లేఖించారు (1883:12). డాక్టర్ గ్రీయర్సన్, నంజుడయ్య అయ్యర్ (1928) అభిప్రాయంలో బంబారాలు క్షత్రియ లేక రాజపుత్రులు ఉత్తరాది వారైనందున వీరి మూలస్థానం మర్వాడ్ అయినది. (135-136) "లంబాడాలు రాజపుత్ర వంశస్థులు, వీరి మూలస్థానం రాజస్థాన్" అని ఆర్.వి. రస్సెల్ అన్నారు. అంతేగాక ఇర్విన్ "లంబాడాల జన్మస్థలం రాజస్థాన్ అని, వీరు రాజపుత్ర వంశస్థులని" అన్నారు. "పృధ్వీరాజ్ చౌహాన్, రాణా ప్రతాప్ సింగ్ రాథోడ్ మొదలైన రాజపుత్ర వీరుల జన్మస్థలం రాజస్థాన్ ప్రాంతమే. తెలుగుదేశంలోని లంబాడాలు కూడా తమ పూర్వీకుల జన్మస్థలం చిత్తోడ్‌ఘడ్ అని, మరికొందరు మేవాడ్ అని చెపుతారు. ఇంతేగాక లంబాడాల ఐతిహ్యాలు కూడా వీళ్ల మూలస్థానం రాజస్థాన్ అని ఋజువు చేస్తున్నాయి.

## ముగింపు :

పాశ్చాత్య, భారతీయ పరిశోధకుల అభిప్రాయాల ప్రకారం చారిత్రకుల ఆధారాలననుసరించి మరియు

ISSN No. : 2456-4702
RNI No. APTEL/2003/12253

ఐతిహ్యాల ఆధారంగా కూడా లంబాడాలకు మూలం రాజ్‌పుత్ క్షత్రియ వంశానికి చెందిన వీళ్ల మూలస్థానం రాజస్థాన్. ఈ రాష్ట్రంలో ప్రధానంగా చిత్తోడ్‌ఘడ్, మర్వాడ్, మేవాడ్ మొదలైన ప్రాంతాలని ఋజువవుతుంది.

**ఉపయుక్త గ్రంథసూచికలు :**

1. బి. చీనియా నాయక్ బంజారా చరిత్ర సంస్కృతి ప్రగతి, పుట : 9, 10.
2. సి.జె. జయదేవ్ విజ్ఞాన సర్వస్వము 10వ సంపుటం, పుట : 11.
3. డా॥. ఎ. బొబ్బిలి, భారతదేశ చరిత్ర - సంస్కృతి, పుట : 220.
4. R.V. Russel, The Tribes and Castes of the Central Province of India, P. 168.

★★★

# బతుకమ్మ పండుగ - చారిత్రక నేపథ్యం, ప్రత్యేకత

- మేకల శిరీష, తెలుగు అధ్యాపకురాలు, తెలంగాణ మైనార్టీ గురుకుల జూనియర్ కళాశాల,
షిర్డి సాయి నగర్, కోదాడ, సూర్యాపేట జిల్లా.

బతుకమ్మ పండుగ అంటే ప్రకృతిలో సహజ సిద్ధంగా లభించే పువ్వులతో అలంకరించి జరిపే పండుగ. బతుకమ్మ పండుగను తెలంగాణ రాష్ట్రంలో ఆశ్వయుజ మాస శుద్ధ పాడ్యమి నుండి తొమ్మిది రోజుల పాటు జరుపుకుంటారు. ఈ బతుకమ్మ (గౌరి) పండుగ లేదా సద్దుల పండుగ దసరాకి రెండు రోజుల ముందు వస్తుంది. ప్రధానంగా తెలంగాణ ప్రజలకు సెప్టెంబర్, అక్టోబర్ నెలలు అనేవి పండుగ నెలలు. ఈ రెండు నెలలలో వచ్చే పండుగలు బతుకమ్మ, దసరా పండుగలను తెలంగాణ ప్రజలు అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తారు. బతుకమ్మ పండుగ తెలంగాణ సాంస్కృతిక ప్రతీకగా ప్రసిద్ధి చెందింది.

బతుకమ్మ పండుగలో భాగంగా తెలంగాణ ప్రాంత ఆడబిడ్డలు రంగు రంగుల పూలను త్రికోణాకారంలో పేర్చి అలంకరించిన బతుకమ్మల చుట్టూ చప్పట్లు చరుస్తూ వలయంగా తిరుగుతూ బతుకమ్మ పాటలు అనే పాటలను పాడుతారు. బొడ్డెమ్మతో మొదలు ఎంగిలి పువ్వు బతుకమ్మ, సద్దుల బతుకమ్మ ఇలా దేని ప్రత్యేకత దానిదే. తొమ్మిది రోజుల పాటు కొనసాగే బతుకమ్మలను బావిలో లేదా నీటి ప్రవాహంలో నిమజ్జనం చేస్తారు. "బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో" అని సాగే ఈ పాటల్లో మహిళలు తమ కష్ట సుఖాలు, ప్రేమ, స్నేహం, బంధుత్వం, ఆప్యాయతలు, భక్తి, భయం మొదలైన మానవీయ విలువలు సమ్మిళితమై ఉంటాయి. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఈ పండుగ ఎంతో ప్రాచుర్యంలోకి వచ్చింది. గత వెయ్యి సంవత్సరాలుగా బతుకమ్మను ఇక్కడి ప్రజలు తమ ఇంటి దేవతగా పూజిస్తున్నారు. ఈ బతుకమ్మ పండుగ సందర్భంగా ఎన్నో చరిత్రలు, పురాణాలు మేళవిస్తారు. ఎన్నో చారిత్రక పాటలు పాడుతారు. ఈ పాటలు చాలా వినసొంపుగా ఉంటాయి.

తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ పండుగ. తెలంగాణ అస్థిత్వం బతుకమ్మలోనే ఉంది. తెలంగాణ నేలపై బతుకమ్మ పండుగను శతాబ్దాలుగా జరుపుకుంటున్నారు. ఈ సంప్రదాయం ఎలా మొదలైందో చెప్పడానికి ఎన్నో కథలు ప్రచారంలో ఉన్నాయి. తెలంగాణ గ్రామీణ సమాజంలో నవాబులు, భూస్వాములు, పెత్తందారీ తనంలో నలిగిపోతున్న మహిళల బతుకులు చాలా దుర్భరంగా ఉండేవి. వారి అకృత్యాలకు నలిగిపోయిన వారిని, తట్టుకోలేక ఆత్మహత్యలు చేసుకున్న వారిని తలచుకొని తోటి మహిళలు విచారించేవారు. వారికి ప్రతీకగా పూలను పేర్చి "బతుకవమ్మా" లేదా "బతుకు అమ్మా" అంటూ దీవిస్తూ పాటలు పాడేవారు. "బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో" పాటల వెనుక ఉండే మర్మం ఇదే.

ఈ పండుగ వర్షాకాలపు చివరిలో, శీతాకాలపు తొలి రోజులలో వస్తుంది. అప్పటికే వర్షాలతో చెరువులన్నీ మంచి నీటితో నిండి ఉంటాయి. రకరకాల పువ్వులు, రంగు రంగులలో ఆరుబయలలో పూసి ఉంటాయి. వీటిలో గునుగు పూలు, తంగేడు పూలు బాగా ఎక్కువగా పూస్తాయి. బంతి, చేమంతి, నందివర్ధనం లాంటి పూలకు కూడా ఇదే సమయం. సీతాఫలాలు కూడా ఈ సమయంలో ఒక పెద్ద ఆకర్షణ. అలాగే జొన్నపంట కోతకు సిద్ధంగా తలలూపుతూ ఉంటుంది. వీటన్నింటి నేపథ్యంలో ఆడపడుచులు ప్రకృతి సౌందర్యాన్ని అద్భుతమయిన రంగు రంగుల పువ్వులతో కీర్తిస్తూ బతుకమ్మ పండుగను జరుపుతారు.

ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో బతుకమ్మ పాత్ర ఎంతో విశిష్టమైంది. ఉద్యమ సందర్భంలో బతుకమ్మతో ఊరేగింపులు చేసిన తెలంగాణ ప్రజలు తమ అస్థిత్వాన్ని సగర్వంగా ప్రకటించుకున్నారు. తెలం

గాణ రాష్ట్రం ఏర్పడిన తరుణంలో బతుకమ్మ ఖండాంత రాలు దాటి ప్రాధాన్యత మరింతగా పెరిగిపోయింది.

**ఉద్దేశ్యం :**

తెలంగాణ రాష్ట్రంలో ఆడబిడ్డలు ప్రకృతిలో మమేకమై, అదే ప్రకృతిలో లభించే వివిధ రకాల పువ్వులను పేర్చుకొని ఆ పువ్వులనే దైవంగా భావించి నిర్వహించే పండుగ బతుకమ్మ పండుగ. తెలంగాణ సాంస్కృతిక ప్రతీక బతుకమ్మ పండుగ. తెలుగు సాహిత్య చరిత్రలో అంతరించిపోతున్న బతుకమ్మ పండుగ యొక్క చారిత్రక నేపథ్యాన్ని నిర్వహణ విధానాన్ని వెలికితీసి పాఠక లోకానికి, సాహితీ ప్రపంచానికి అందించడమే ఈ పత్రం యొక్క ముఖ్య ఉద్దేశ్యం.

**బతుకమ్మ పండుగ - చారిత్రక నేపథ్యం :**

తెలంగాణ ప్రాంతాన్ని రాష్ట్రకూట రాజులు పరి పాలించేవారు. వారి వద్ద వేములవాడ చాళుక్యులు, సామంతులుగా ఉండేవారు. చోళులకు, రాష్ట్ర కూటులకు యుద్ధం జరిగినప్పుడు ఈ చాళుక్యులు రాష్ట్ర కూటులకు మద్ధతుగా నిలిచారు. క్రీస్తు శకం 973లో ఈ చాళుక్య రాజైన తైలపాడు రాజే పరిపాలించేవాడు. క్రీ.శ. 997లో తైలపాడు మరణించడంతో అతని కుమారుడైన సత్య స్రాయుడు రాజ పీఠాన్ని అధిష్టించాడు. అప్పటి వేముల వాడ (ప్రస్తుత కరీంనగర్ జిల్లా)లో ప్రసిద్ధి చెందిన రాజ రాజేశ్వర ఆలయం ఉండేది. ఆపదల్లో ఉండే వారికి రాజరాజేశ్వరి అండగా ఉంటుందని అప్పటి ప్రజలు నమ్మేవారు. ప్రజలే కాదు చోళరాజు పరాంతక సుందర చోళా కూడా రాష్ట్రకూటుల నుంచి ఆపద తలెత్తినపుడు రాజరాజేశ్వరికి భక్తుడుగా మారిపోయాడు. ఆ రాజ రాజేశ్వరి తనను కాపాడిందని నమ్మిన పరాంతక సుందర చోళ తన కుమారుడికి రాజరాజ అని నామకరణం చేశాడు. ఆ రాజరాజ చోళనే క్రీస్తు శకం 985 నుండి 1014 వరకు రాజ్యాన్ని పరిపాలించాడని చరిత్ర తెలియజేస్తుంది. అతని కుమారుడైన రాజేంద్ర చోళ సత్యాస్రాయపై జరిపిన యుద్ధానికి సేనాధిపతిగా వ్యవహరించి విజయం సాధిం చాడు. ఆ విజయానికి గుర్తుగా రాజరాజేశ్వరి ఆలయాన్ని కూల్చివేసి అందులోని భారీ శివలింగాన్ని తన తండ్రికి బహుమతిగా ఇచ్చాడు. తన కొడుకు ఇచ్చిన శివలింగం కోసం క్రీస్తు శకం 1006లో రాజరాజ చోళ ఏకంగా ఒక ఆలయ నిర్మాణాన్ని చేపట్టాడు.

సా.శ. 1010లో నిర్మాణం పూర్తయ్యాక భారీ శివ లింగాన్ని బ్రిహదేశ్వరాలయంలో ప్రతిష్టించాడు. తమ రాజ్యంపై దాడి చేసి దోచుకున్న సొమ్ముతోనే బ్రిహ దేశ్వరాలయ నిర్మాణాన్ని చేపట్టినట్టు కూడా తమిళ శిలాశాసనాల్లో చోళరాజులు చెప్పారు. ఇప్పటికి వేముల వాడలోని భీమేశ్వరాలయ శివలింగానికి, బ్రిహదేశ్వ రాలయంలోని శివలింగానికి మధ్య సారుపత్యను చూడవచ్చు. వేములవాడ నుండి శివలింగాన్ని పార్వతి నుండి వేరుచేసి తంజావూరుకు తరలించినందుకు తెలంగాణ ప్రజల మనస్సు కలిచి వేసింది. బృహదమ్మ (పార్వతి) నుంచి శివలింగాన్ని వేరుచేసినందుకు గాను, తమ దు:ఖాన్ని చోళులకు తెలియజేస్తూ తెలంగాణ వాసులు మేరు పర్వతంలా పూలను పేర్చి బతుకమ్మను నిర్వహించడం మొదలుపెట్టారు. ఆ విధంగా ప్రతి సంవత్సరం బతుకమ్మను జరపడం ఆనవాయితీగా మార్చుకున్నారు. దాదాపు వేయి సంవత్సరాల నుండి బతుకమ్మను తెలంగాణ వాసులు జరుపుకుంటున్నారు. బతుకమ్మ పేరు కూడా బృహదమ్మ నుంచి వచ్చినదే. బతుకమ్మ సందర్భంగా గౌరమ్మను పసుపు రంగు పూలతో పేర్చి తొమ్మిది రోజుల పాటు ఆటపాటలాడి పూలను నీటిలో వదులుతారు.

తెలంగాణ ఆడబిడ్డలు శివుడు లేని పార్వతి గురించి పాటలాగా పాడుతూ బతుకమ్మ పండుగ జరుపు కుంటున్నారు. బౌద్ధంలో ముందు చెడ్డ దేవతగా, పిల్లల్ని ఎత్తుకుపోయే రాక్షసిగా పిలువబడ్డ హారీతి బుద్ధుని వల్ల మంచిదానిగా పిల్లల్ని రక్షించే దేవతగా మారిపోయింది. ఆమెనే పిల్లల దేవతగా కొలుస్తారు. పుట్టిన తమ పిల్లలు బతుకాలని, రోగాలు, రొష్టులు లేకుండా ఉండాలని హారీతిని ఆరాధించేవారు. ఈ దేవత గురించి బౌద్ధ జాతక కథల్లో చదువగలం. 12వ శతాబ్ధం కాలం నాటి ఇక్ష్వాకుల శాసనాల్లో హారీతి పేరు ప్రస్తావించబడింది. పిల్లల్ని బతికించే దేవత హారీతినే బతుకమ్మగా భావించి ఉం

డవచ్చు. బతుకమ్మల తయారీలో కూడా చాలా బేధాలు కనిపిస్తాయి. బతుకమ్మలు స్థూపాల ఆకారంలో ఉంటాయి. లింగాల తయారీలో కూడా ఇటువంటి సంప్రదాయముందని చాలా చోట్ల చెప్పబడింది. పూర్వం బౌద్ధులు తమ ఆరాధనలో భాగంగా చేసుకున్న స్థూపాలను పూలు, మట్టి, ఇసుక, పేడ, రాయి, ఇటుకలతో తయారు చేసుకునేవారు. పూలు, ఇసుక, మట్టి, పేడ మొదలైన వాటితో తయారు చేసిన స్థూపాలను మర్యాదగా భక్తితో నీటిలో కలిపి వేసేవారు. తర్వాత కాలాల్లో వచ్చిన మత పరిణామాల వల్ల ఈ దేవతలను తమ మత దేవతలుగా చేసుకున్నారు. ఆ దేవతలే బౌద్ధంలో హారీతిగా, జైనంలో ఆమ్రకుష్మాండినిగా, హిందూ మతంలో అంభికగా పూజింపబడ్డారు. తమ దేవతల్లో కలుపుకున్న సాంప్రదాయమే బతుకమ్మ జాతరగా నిలిచి పోయింది.

దసరా పండుగలో బతుకమ్మను కలపడం, అమ్మ దేవతలను పూజించే ఆచారంగా మారడం, "పెత్రామాస" (పితృ అమావాస్య) ను ఈ పండుగలో చేర్చడం తర్వాతి కాలంలో వచ్చిన పరిణామమే అని చెప్పవచ్చు. ప్రపంచంలో ఎక్కడా లేని పూల పూజ మన సంస్కృతి. బతుకమ్మ జానపదుల పండుగ. బతుకమ్మ ఆటలో గుస్సాడి నృత్యం, చప్పట్లలో జానపదుల పాట, ఆటల కలయిక మన మూలాలను ఎరుక పరిచే మంచి సాంప్రదాయం. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత రాష్ట్ర ప్రభుత్వం బతుకమ్మ పండుగను రాష్ట్ర పండుగగా అధికారికంగా ప్రకటించింది. తెలంగాణ ఆడబిడ్డలు అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకునే అరుదైన బతుకమ్మ పండుగ చరిత్ర పుటల్లో లిఖించబడింది.

## బతుకమ్మ పండుగ - నిర్వహణ విధానం :

బతుకమ్మ పండుగ నిర్వహణలో భాగంగా తొమ్మిది రోజుల పాటు ప్రతిరోజు ఓ రకమైన నైవేధ్యం సమర్పిస్తారు. మొదటి ఎనిమిది రోజులు ఈ నైవేధ్యం తయారీలో యువతీ యువకులు పాల్గొని భక్తి శ్రద్ధలతో పండుగను చేస్తారు. చివరి రోజును సద్దుల బతుకమ్మ అంటారు. ఈ రోజు మాత్రం నైవేధ్యాన్ని మహిళలు తయారు చేస్తారు.

**ఎంగిలి పూల బతుకమ్మ :**

మహా అమావాస్య రోజు మొదటి రోజు వేడుక మొదలవుతుంది. తెలంగాణలో దీనిని "పెత్రామాస" అని కూడా అంటారు. నువ్వులు, బియ్యంపిండి, నూకలు కలిపి నైవేధ్యం తయారు చేస్తారు.

**అటుకుల బతుకమ్మ :**

ఆశ్వయుజ శుద్ధ పాడ్యమి నాడు చేస్తారు. సప్పిడి పప్పు, బెల్లం, అటుకులతో నైవేధ్యం తయారు చేసి అమ్మవారికి సమర్పిస్తారు.

**ముద్దపప్పు బతుకమ్మ :**

ముద్దపప్పు, పాలు, బెల్లంతో నైవేధ్యం తయారు చేసి సమర్పిస్తారు.

**నానే బియ్యం బతుకమ్మ :**

నానేసిన బియ్యం, పాలు, బెల్లం కలిపి నైవేధ్యం చేస్తారు.

**అట్ల బతుకమ్మ :**

అట్లు లేదా దోశ నైవేధ్యంగా సమర్పిస్తారు.

**అలిగిన బతుకమ్మ :**

ఈ రోజు ఆశ్వయుజ పంచమి. నైవేధ్యమేమి సమర్పించరు.

**వేపకాయల బతుకమ్మ :**

బియ్యంపిండిని బాగా వేయించి వేప పండ్లుగా తయారు చేసి నైవేధ్యంగా
సమర్పిస్తారు.

**వెన్నముద్దల బతుకమ్మ :**

నువ్వులు, వెన్న లేదా నెయ్యి, బెల్లం కలిపి నైవేధ్యం తయారు చేస్తారు.

**సద్దుల బతుకమ్మ :**

ఆశ్వయుజ అష్టమి నాడు అదే రోజు దుర్గాష్టమిని జరుపుకుంటారు. ఈ సద్దుల బతుకమ్మలో ఐదు రకాల నైవేధ్యాలు తయారు చేస్తారు. అవి : పెరుగన్నం, చింతపండు పులిహోర, నిమ్మకాయ అన్నం, కొబ్బరన్నం, నువ్వులన్నం. తొమ్మిది రోజులు సమర్పించే నైవేధ్యాలలో

మొక్కజొన్నలు, జొన్నలు, సజ్జలు, మినుములు, శనగలు, పెసర్లు, పల్లీలు, నువ్వులు, గోధుమలు, బియ్యం, కాజు, బెల్లం, పాలు ఉపయోగిస్తారు.

తొమ్మిది రోజుల బతుకమ్మ పండుగలో మొదటి రోజు బతుకమ్మను ఎంగిలి పువ్వు బతుకమ్మ అని, చివరి రోజు బతుకమ్మను సద్దుల బతుకమ్మ అని అంటారు. ఈ రోజుల్లో ఆడపడుచులు అందరూ అత్తవారింటి నుంచి కన్నవారింటికి చేరుకొని ఈ పూల పండుగ జరుపు కోవటానికి తయారవుతారు. ఈ తొమ్మిది రోజులలో వీరు రోజు బతుకమ్మలు చేసి, ప్రతీ సాయంత్రం వాటి చుట్టూ తిరుగుతూ ఆడుతారు. ఆ తరువాత దగ్గరలో ఉన్న జలాలల్లో నిమజ్జనం చేస్తారు. అయితే చివరి రోజు బతుకమ్మ (సద్దుల బతుకమ్మ) పండుగ అత్యంత మనోహరంగా ఉంటుంది. ఆ రోజు మగవారంతా పచ్చిక బయళ్ళలోనికి పోయి తంగేడు, గునుగు మొదలగు పూలను భారీగా ఏరుకొని వస్తారు. ఆ తరువాత ఇంటిల్లి పాది కూర్చుని ఆ పూలతో బతుకమ్మను తయారు చేస్తారు. ఇందులో గునుగు పూలు, తంగేడు పూలు ముఖ్య భూమికను పోషిస్తాయి. ఈ పూలను జాగ్రత్తగా ఒక రాగి పళ్ళెం (తాంబాలం)లో వలయాకారంగా రంగులు మార్చుకుంటూ పేరుస్తారు. ముందుగా తంగేడు ఆకులు, పూలు పళ్ళెంలో లేదా తాంబాలంలో పేర్చుతారు. ఆపై తంగేడు పూల కట్టలు పేర్చుతారు. మధ్యమధ్యలో ఇతర రకాల పూలను ఉపయోగిస్తారు. ఆ అమరిక ఎంత పెద్దదిగా ఉంటే అంత అందంగా ఉంటుంది. తెల్లని గునుగు పూలను రంగులతో అద్ది పెడతారు. పేర్చడం అయ్యాక పైన పసుపుతో చేసిన గౌరి మాతను పెడతారు. ఇలా పేర్చిన బతుకమ్మను గృహంలోని దైవం స్థానంలో అమర్చి కొవ్వొత్తులతో, అగరు వత్తులతో అలంకరించి పూజిస్తారు.

చివరి రోజు సాయంత్రం బాలికలు, ఆడపడుచులు, స్త్రీలు అందరూ చక్కగా కొత్త దుస్తులు, ఆభరణాలు ధరించి బతుకమ్మను వాకిలిలో పెడతారు. చుట్టు ప్రక్కల ఉన్నవారు కూడా వారి బతుకమ్మలను ఇదే విధంగా అమర్చి వాటి చుట్టూ పెద్ద వలయాకారంలో చేరుతారు. ఐక్యత, సోదరభావం, ప్రేమను కలిపి రంగరిస్తూ మానవ హారం ఏర్పరచి గౌరి దేవిని భక్తి శ్రద్ధలతో కీర్తిస్తూ పాటలు పాడుతారు. ఒకరు ముందుగా పాట మొదలు పెడితే మిగిలిన వారు వారితో గొంతు కలుపుతూ పాడుతారు.

ఈ పాటలల్లో ప్రధానంగా "బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో బంగారు బతుకమ్మ ఉయ్యాలో...", "ఒక్కొక్క పువ్వేసి చందమామ ఒక జాము ఆయే చందమామ...", రెండేసి పువ్వు తీసి చందమామ రెండు జాములాయె చందమామ..." "బొడ్డెమ్మ బొడ్డెమ్మ... బిడ్డలెందారే బవిల పడ్డ వారికి...వారిద్దరమ్మా", "కోసలాధీశుండు ఉయ్యాలో - దశరథనాముండు ఉయ్యాలో", "లోక కళ్యాణమాయె ఉయ్యాలో - లోకమే మెచ్చెను ఉయ్యాలో" ఈ విధంగా జానపద గీతాలు చుట్టుప్రక్కల ప్రతిధ్వనిస్తూ ప్రత్యేకమైన తెలంగాణ సంస్కృతిని ఆవిష్కరిస్తాయి.

చీకటి పడుతున్న సమయంలో స్త్రీలందరూ ఈ బతుకమ్మలను తలపై పెట్టుకొని ఊరిలో ఉన్న పెద్ద చెరువు గాని, తటాకం వైపు గాని ఊరేగింపుగా బయలు దేరుతారు. ఈ ఊరేగింపు కొనసాగినంత సేపు జానపద గీతాలతో వీధులు మారుమ్రోగుతాయి. జలాశయం చేరుకున్న తర్వాత, మెల్లగా బతుకమ్మలను పాటలు పాడుతూ, ఆడుతూ నీటిలో జారవిడుస్తారు. ఆ తరువాత "మలీద" (చక్కెర, రొట్టెతో చేసినది) అనే పిండి వంటకాన్ని బంధుమిత్రులకు పంచిపెడతారు. ఆ తరువాత ఖాళీ తాంబాలంతో పాడుతూ, బతుకమ్మను కీర్తిస్తూ ఇంటికి చేరుతారు. ఈ తొమ్మిది రోజులు ఈ పాటలన్నీ అర్ధరాత్రి వరకు వీధులలో మారుమ్రోగుతూనే ఉంటాయి.

బతుకమ్మ పండుగ వస్తుందంటే తెలంగాణ పల్లెల్లో నూతన ఉత్సాహం వెల్లివిరుస్తుంది. అది ఒక పెద్ద సంబరంగా భావిస్తారు. ఇళ్ళు శుభ్రపరుస్తారు. చక్కగా అలంకరించుకుంటారు. ఆడపిల్లల్ని పుట్టింటికి తీసుకు వస్తారు. కొత్తగా పెళ్ళైన ఆడపిల్లలకు అత్తగారి ఇంటి నుంచి కాగితపు పూలతో చేసిన బతుకమ్మను వాయినంగా పంపుతారు. అత్తగారింట్లో ప్రతి ఆడపిల్లా ఎప్పుడు కన్నవారి ఇంటికి వెళ్ళాలా? కన్నవారి పిలుపు ఎప్పుడు వస్తుందా? తనను తీసుకు వెళ్ళడానికి అన్న ఇంకా రాలేదే అన్న

బాధను వ్యక్తపరుస్తారు. ఉదాహరణకు పండుగ వస్తుందంటే ప్రియుని రాకకై ఎదురు చూసే ప్రియురాండ్లు పాడుకునే పాటగా "బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో.. బంగారు బతుకమ్మ ఉయ్యాలో.. నానోము పండింది ఉయ్యాలో.. నీ నోము పండిందా ఉయ్యాలో.." లాంటి ఎన్నో అర్థవంతమైన జానపద గీతాలను ఆలపిస్తారు. తెలంగాణ ఆడపడుచులు, బాలికలు, స్త్రీలు, పెద్దవారు ఇంటిల్లిపాదిగా చాలా భక్తి శ్రద్ధలతో నిర్వహించుకునే ప్రకృతిలో పూసిన పువ్వులనే దేవతగా ఆరాధించే పండుగ బతుకమ్మ పండుగ.

**ముగింపు :**

ఈ "బతుకమ్మ పండుగ - చారిత్రక నేపథ్యం, ప్రత్యేకత" అనే పత్రంలో బతుకమ్మ పండుగ యొక్క చారిత్రక నేపథ్యం. పండుగను నిర్వహించే విధానమును, ప్రత్యేకతను వివరించడం జరిగింది. కొన్ని చారిత్రక, రాజకీయ పరిస్థితులు, ప్రజల మనోభావాలు, భావో ద్వేగాల వల్ల ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం రెండు తెలుగు రాష్ట్రాలుగా విడిపోయినా గానీ, ఈ రెండు రాష్ట్రాల యొక్క ఐక్యమత్యాన్ని కాపాడుకోవడం తెలుగు వాళ్ళమైన మనందరి బాధ్యత. అదే విధంగా ఈ రెండు తెలుగు రాష్ట్రాలల్లోని ప్రజల మనోభావాలతో, జీవన విధానం, సంస్కృతి సాంప్రదాయాలతో మమేకమైన బతుకమ్మ పండుగ లాంటి తెలుగు జాతి ప్రజల వివిధ రకాల పండుగల యొక్క చారిత్రక నేపధ్యాన్ని, నిర్వహణ విధానాన్ని, ప్రత్యేకతలను వెలికి తీసి తెలుగు సాహితీ ప్రపంచానికి, భవిష్యత్తు తరాలకు అందించవలసిన బాధ్యత మనందరిపై ఉంది. అదే విధంగా తెలుగు సాహితీ ప్రియులమైన మనమందరం ఆ దిశగా ముందడుగు వేసి తెలుగు ప్రజలు నిర్వహించుకునే పండుగల యొక్క చారిత్రక నేపధ్యాన్ని ప్రత్యేకతను వెలికితీసి ప్రపంచ సాహితీ లోకానికి చాటి చెప్పవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉంది.

**ఉపయుక్త గ్రంథ సూచి :**

1. సత్యనారాయణ అడపా, సత్యనారాయణ ద్యావనపల్లి, సంపాదకులు, తెలంగాణ చరిత్ర, సంస్కృతి మరియు ఉద్యమాలు.
2. నవోదయం, తెలుగు పాఠ్య పుస్తకం, తెలుగు ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం, తెలుగు అకాడమీ ప్రచురణలు, హైదరాబాద్.
3. డా॥ సుజాత బండారు, తెలంగాణ బతుకమ్మ పాటలు (జానపద సాహిత్యం), పి.హెచ్.డి పరిశోధన సిద్ధాంత గ్రంథం, ఉస్మానియా విశ్వవిద్యాలయం, హైదరాబాద్.

★★★

BHAVAVEENA
Vol. 21, Issue. 09, September 2024
భావవీణ
ISSN No. : 2456-4702
RNI No. APTEL/2003/12253

# ఓ విజేత

– చిట్టూరి జగదంబిక, తెలుగు అధ్యాపకురాలు, వి.ఎస్.ఆర్.ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మొవ్వ.

డాక్టర్ పి.కేశవరెడ్డి వృత్తిరీత్యా వైద్యుడు. ప్రవృత్తి రీత్యా నవలా రచయిత. ఆయన సృజించిన నవలల్లో ఒకటి అతడు అడవిని జయించాడు. సమస్త కులాల జీవులకు, యదార్థ జీవులకు కావ్య గౌరవం కలిగించి వారి జీవిత కదనాన్ని కథనంగా మలచిన గొప్ప వ్యక్తి. రాసినది తక్కువ నవలలే, అయినా గొప్ప నవలల సృష్టిలో మేటి.

కేశవరెడ్డి గారి 'అతడు అడవిని జయించాడు' నవల లోని కథానాయకుడు పందులను మేపే ఒక ముసలి వాడు. వేసవి కాలపు సాయంత్రం, పౌర్ణమి ముందు జ్వరంతో ఉన్న ముసలివాడు తనకు ఎంతో ఇష్టమైన సుక్కపంది అడవిలోకి మేతకు వెళ్లి రాకపోవడాన్ని గమనించాడు. నెలలు నిండి ప్రసవానికి దగ్గరకు వచ్చిన సుక్క పందిని వెతికి, గుడిసెకు తోలుకు రావడమే ఆ ముసలివాడి ముందున్న ప్రధాన కర్తవ్యం.

ముసలివాడు అంటేనే వయో భారంతో ఉన్నాడు అని. వయోభారంతో ఉన్న అతడు దండయాత్రకు వెళ్లే వానిలా పెద్ద పెద్ద అంగలు వేస్తూ గుడిసెను వదిలి ఈటెతో నడుస్తుంటే దండయాత్రలో విజయం ఖరారైంది ఏమో అని అనిపిస్తుంది. విజయం ఖరారైనా లేకున్నా ఆ వయసులో అతడు చేయబోయే సాహసంతో అతడు ఈ నవలలో విజేత అయిపోయాడు. ముసలివాడు అన్వేషణ ఫలించి, సుక్కపందిని సంరక్షించాలనే ఏకైక సంకల్పంతో అడవికి వచ్చిన ముసలివాడిని, ఆ సుక్కపందే తీవ్రంగా గాయపరచి చంపబోవడం ఒక వైరుధ్యం అయితే, ప్రాణంగా చూసుకున్న సుక్క పందిని తానే చంపుకోవడం మరోవైరుధ్యం కానీ ఇదే విధివిలాసం, అంతటి ధైర్య సాహసాలను ప్రదర్శించిన ఆ ముసలివాడు చివరి వరకు తనకు చేతనయినంత తెగువను చూపి ఈ నవలలో విజేతగా నిలిచి పోయాడు. మూర్ఖత్వానికి రౌద్రానికి పెట్టింది పేరైన సుక్కపంది సలుగులనీనిన వారం వరకు పగవారిని దరిచేరనివ్వదు చివరికి తనని సాకిన ముసలి వాడినైనా అంతే.

దరిదాపులకి ఎవరైనా వెళ్తే చీల్చి చెండాడుతుంది. పుట్టుకతో తనకు సంక్రమించిన మొరటు తనంతో అది శత్రువు మీద విరుచుకుపడుతుంది. అలాంటి సుక్క పంది కోసం అడవంతా గాలించి గాలించి దాని ఆచూకీ తెలుసుకొని దాన్ని, దాని బిడ్డను సంరక్షించుకోవాలని అతని తాపత్రయం సలుగులనీనిన సుక్కపందిని చూసి దాని కంటపడకుండా ఆ వృద్ధాప్యంలో వృద్ధాప్యాన్నే ఎదిరించి చెట్టు ఎక్కి చెట్టు మీద నుంచి పందిని ముద్దుగా ప్రేమగా తనివి తీర చూసుకుంటూ పాట పాడుకుంటూ ఎంతో మానసిక ఆనందం లో మునిగి తేలిపోయాడు. ఇలా వయసునే జయించేశాడు. మరోసారి విజేత అయ్యాడు. మొదటగా సుక్కపంది, పిల్లవాడు తోలుకొస్తున్న గుంపులో కనపడకపోయేసరికి ముసలివాడు ఆందోళనకుగురయ్యాడు. రేపో మాపో ఈనే దాన్ని దొడ్లోనే ఉండనీయకుండా బయటికి ఎందుకు విడిచావు అన్నాడు.

అప్పుడు పిల్లవాడి ఎడమ భుజం మీద ఉన్న పంగల కర్రను చూసి పంగలకర్ర, గులకరాళ్ళతో పక్షులను చెదరగొట్టడంలో పిల్లాడు మునిగిపోయి ఉంటాడని అనుకుని యుద్ధానికి సన్నద్ధమైపోయాడు. అడవిలో సుక్క పంది ఎటు వెళ్లిందో తెలియని తరుణంలో అది ఏ వైపుగా వెళ్ళిందో ఊహించి తెలుసుకోవడం, అసలు దారిని ఛేదించి ముసలి సాహసికుడు మరోసారి విజేత అయ్యాడు.

ఆ వయసులో కట్ట వెంబడి, నీటిలో, దారి లేని చోట, బండల మీద, గుట్టలు ఎక్కుతూ, పల్లాలు దిగుతూ తన ప్రయాణాన్ని ఆశావహ దృక్పథంతో సాగిస్తున్నాడు. పొదలలో గుహలలో వెతుకుతూ కూర్చుంటూ ముందుకు సాగిపోతున్నాడు.

కడుపులో ఉన్న ఈత కల్లు ప్రభావం చూపుతూ ఎంతో మైకం కలిగించినా సుక్క పందిని గురించిన ఆరాటం

అతనిలో ఇసుమంతైన తగ్గకపోవడం ఖచ్చితంగా ఒక ఆశావాది అయిన మనిషికి ఉండే లక్షణమే.

ఎప్పుడైతే అతడిలో నిరాశకు చోటు దొరికిందో అప్పుడే అతడు, పందులను కొనడానికి వచ్చే వాడుకదారుల మాటల కన్నా సులువుగా నేను జంతువుల భాషను అర్థం చేసుకోగలుగుతాను. చెట్లు తమ కొమ్మలు కదలికలతో ఆకుల గలగలలతో ఇచ్చే సందేశాలు నాకు కర తలామలకము అని తనని తాను సంఘటిత పరుచుకుని మరల ఆశతో తన పనికి తగిన శక్తిని కూడతీసుకున్నాడు. ఎప్పుడైతే అతడిలో నిరాశకు చోటు దొరుకుతుందో అప్పుడే అతడు తాను వయసులో ఉండగా సాధించిన విజయాలను తను తెలివితేటలను స్మరించుకుంటూ మంచి ఊపును అందుకుంటున్నాడు. సాధారణ మనుషులు నిజజీవితంలో ఈ విజేతను ఆదర్శంగా తీసుకుంటే అన్నీ విజయాలే. అలా అడవిలో నడుచు కుంటూ శబ్దాలు చేస్తూ పొదలపై రాళ్లు విసురుతూ అక్కడ ఎక్కడ సుక్క పంది లేదని నిర్ధారించుకుంటూ ముందుకు సాగిపోతున్నాడు. ఇక తాగిన కల్లు పూర్తిగా ఆవిరి అయిపోయింది. చాలాసేపు అవటంతో ఆకలవుతుంది అనుకోగానే నా చేతిలో ఈటె ఉంది. నా తలలో నానా యుక్తులున్నాయి. అడవిలో కుందేళ్లు దండిగా ఉన్నాయి. అనుకుని ఎంతో ధైర్యంగా ఉన్నాడు అనిపిస్తుంది. అంటే తన సంకల్పం ముందు సమస్యలు ఏవీ పెద్దవిగా కనిపించడం లేదు. ఇక్కడ తనపై తనకున్న నమ్మకం తెలియచేయడం ద్వారా మరోసారి విజేత అయ్యాడు. ఆ వెన్నెలలోనే అతడు నడుము వంచి కుందేలు అడుగుజాడలు కనిపెట్టి దాని పొద దగ్గరికి చేరి అది బయటికి పోకుండా మూడు వైపులా కంచెకట్టి మొత్తానికి కుందేలుని తన ఈటెసాయంతో పట్టి నిప్పు పుట్టించి తన ఆకలిని తీర్చుకున్నాడు. ఇంకా మిగిలిన మాంసాన్ని పుల్లటి కిచ్చిలి కాయలను మూట కట్టుకుని నడవసాగాడు ఇక్కడ అతడికి రేపటి రోజు మీద ఉన్న ముందుచూపు తెలుస్తోంది.. మళ్లీ అతడిలో శక్తి పుంజుకోవడానికి అడవిలో, తుఫానులో, జడి వానలో, అమావాస్య రాత్రి లోయలో తప్పిపోయిన ఎనుబోతును తిరిగి పట్టుకొచ్చాను అని గుర్తు తెచ్చుకున్నాడు. తనని ఎప్పుడైతే నిరాశ ఆవహిస్తుందో మళ్లీ అప్పుడు తనను గురించి, తన యవ్వనంలో చేసిన సాహసాలను గురించి స్మరించుకుంటూ తనలో శక్తిని కూడతీసుకుంటున్నాడు.

దేవుడు కూడా దయ తలచాలని తన శాయశక్తుల ప్రయత్నిస్తూ అభ్యర్థిస్తున్నాడు. ఒక నీళ్ళకుంట దగ్గరగా సుక్క పంది అడుగుల జాడ కనిపించింది ఆ నీటిలో దాని మెడలో కట్టిన కొబ్బరి చిప్ప కనిపించడంతో సుక్క పంది అపాయంలో పడింది అని అనుకున్న సమయంలో అక్కడ గాలి లేకుండానే తాటాకుశబ్దం రాగా ,నా అర్థం లేని ఆలోచనలపోకడను సరిదిద్దుకోమని ప్రకృతి హెచ్చ రిస్తోంది అనుకుంటూ ప్రకృతితో మమేకమై ఉన్న అతడికి ఆ ప్రకృతి సహాయపడిందనేటటువంటి తలపును మనకు కలిగిస్తున్నాడు. ప్రకృతితో మమేకమవమని మనకి సూచిస్తున్నాడు. మరోసారి పరీక్షగా కొబ్బరి చిప్పను చూసి నేను కట్టింది ఈ దారం కాదు వెంట్రుకల దారం కదా హమ్మయ్య! అని ఒక క్షణం నిట్టూర్పు విడుస్తాడు. సాహసంతో చేసే యాత్రకు ప్రకృతి కూడా తన సహకారాన్ని తెలుపుతుందిగా అనిపిస్తుంది. అక్కడ అదే జరిగింది అక్కడేపంది అడుగుల జాడను గమనించి అటువైపుగా కదలాడు. ఆ పంది జాడకై కత్తి, ఈటెలతో బయలుదేరిన అతడు ఆ వయసులో గోచి బిగించి చెట్టు మానుమీద యువకుడిలాఎగబాకుతున్నాడు .కొమ్మమీద నుంచుని అడవి మొత్తాన్ని గాలించాడు. అంతా గాలిస్తున్న సమయంలో ఒక గువ్వ అరుపు అతడిని ఆకర్షించింది. తను ఏదో వింతను చూసానని ప్రపంచానికి చెప్ప చూస్తోంది. అని అర్థం చేసుకున్న ముసలివాడు ఆహా అయితే ఆ సుక్క పంది ఈశాన్యం దిక్కుగానే ఉందని, ఈనేసినట్లుంది అని అనుకున్నాడు. ప్రాణం అంతా తీంట్ర పొదల చుట్టూనే తిరుగుతోంది .వయసు ప్రభావంలో తొడలు, చేతులు మంట పెడుతుంటే చెట్టు వెంబడి జారికిందకు చేరాడు.క్షణం కూడా ఆగకుండా ఈశాన్య దిక్కుగా నడవసాగాడు మొత్తానికి ఆ గువ్వ సాయంతో తీంట్ర పొదల మాటున సలుగులనీనిన తన సుక్క పందిని కనిపెట్టేసాడు. ఇది ముసలివాని అడవి

ప్రయాణంలో మైలురాయి. ఆ తర్వాత నడిచిన ప్రస్థానం ఒక వైరుధ్యం. అక్కడే ఉన్న ఒక పెద్ద మాను మీద కూర్చుని వాటిని చూసి ఆనందించి పరవశించిపోయాడు. నోటి నుంచి పాట వస్తున్నా గట్టిగా పాడలేడు. దాని దగ్గరకు వెళ్లలేడు.

నెమ్మదిగా కొంతకాలం తర్వాత వాటిని అదును చూసి ఇంటికి తీసుకువెళ్లాలని కలలు కంటున్నాడు. అక్కడికి వాసన పసిగట్టి ఒక నక్క వచ్చి పంది చేతిలో పరాజయం పాలవటం కళ్ళారా చూసాడు. ఆ తర్వాత ముసలివాడు తన ఈటే, కత్తి వాడవలసి రావడం, ఎక్కువ నక్కలు ఒక్కసారిగా దాడి చేసే సమయంలో పంగల కర్ర నా దగ్గర ఉంటే ఎంతో సహాయ పడేదని, ఆవేదన చెందటం వాటి నుంచి తన పందిని సలుగులను కాపాడాలని కిందకి దిగితే ఆ పంది తనని కూడా బతకనీయదని తెలిసినా సాహసించడం చివరికి వీరోచితంగా దానితోనే పోరాడవలసి రావడం దాన్ని చంపి కనీసం ఆ సలుగుల నయినా కాపాడుకోవాలని తన ఈటెకి, కత్తికి పని చెప్పితన ప్రాణంగా చూసుకున్న దాని ప్రాణాలు తానే తీసి పంది పిల్లలతో తిరుగు ప్రయాణంలో బయలుదేరాడు.

ఈ ముసలివాడు ఎంతో శారీరక బాధను అనుభ వించింది ఆ పంది వల్లే. అంతటి గొప్ప ప్రేమను చూపింది దాని పైనే. అప్పటికే ఒళ్లంతా అలసిపోయింది. తన ఈటె తన కు ఊత కర్ర అయింది. అతడు ఆదమరచి చిన్న కునుకు తీసిన సమయంలో కండ్లు తెరిచి చూసేసరికి గంపపై నాలుగు రాబందులు ముక్కులతో పొడుస్తున్నాయి.

ముసలివాడు చూసేసరికి గంప కింద సలుగులకు బదులు ఎనిమిది మాంసం ముద్దలు ఉన్నాయి. ఇంత కష్టపడి ప్రాణంగా పెంచుకున్న సుక్క పందిని చంపుకుని వీటిని కాపాడుకున్నాను అన్న ఆశ కూడా లేకుండా అయిపోయింది. అనుకుంటూ కనుగుడ్లు నుంచి నీళ్లు దొర్లాయి. కళ్ళు తుడుచుకుని యుద్ధం ముగిసింది నేను పూర్తిగా ఓడిపోయాను అనుకున్నాడు. ఒళ్లంతా రక్తంతో కండరాలు వేలాడుతూ ఉండగా చివరికి గుడిసెను సమీపించాడు.

కాస్త సేద తీరాక ఇది నా జీవితంలో ఒకరోజు మాత్రమే నా చివరి రోజు కాదు, ఎన్ని ఎదురు దెబ్బలుతిన్న ఎన్ని దురదృష్టాలకు లోను అయినా మానసికంగా ఎంతో దృఢంగా ఉన్న ముసలివాడు విజేతగాక మరెవరు విజేత అవుతారు ఇలా కథ భీభత్సరస ప్రధానంగా వచ్చి మహా విషాదాంతంగా ముగిసింది. అయినా అతని దృక్పథంతో అతడు మరోసారి విజేత అయ్యాడు. మనిషిగా గెలిచాడు. అతడు అడవిని జయించడంతోపాటు పాఠకుల మనసు లను గెలుచుకున్నాడు.

**ఆధార గ్రంథాలు :**

1. అతడు అడవిని జయించాడు - డాక్టర్ కేశవరెడ్డి
2. తెలుగు సాహిత్య సమీక్ష - జి. నాగయ్య
3. నవలా శిల్పం - వల్లంపాటి వెంకటసుబ్బయ్య

★★★

# సుద్దముక్క కవిత్వంలో ఉపాధ్యాయవృత్తి ఔన్నత్యం

- రేణి ఈశ్వరయ్య, అసిస్టెంట్ ప్రొఫెసర్, తెలుగు విభాగం, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పరకాల.

గురుఃబ్రహ్మ
గురుఃవిష్ణు గురుఃదేవో మహేశ్వర గురు సాక్షాత్
పరబ్రహ్మ తస్మైశ్రీ గురవే నమః

అనాది నుంచి నేటి వరకు గురువుకు సముచిత స్థానం ఉంది. గురువు త్రిమూర్తులతో సమానం. గు అంటే అంధకారం రు అంటే ప్రకాశం. జ్ఞాన ప్రకాశం చేత అజ్ఞానం అనే చీకటిని తొలగించేవారు గురువు అని అర్థం. తల్లిదండ్రుల తర్వాత విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి తోడ్పడేది గురువు. గురు శిష్యుల సంబంధం నానాటికి దిగజారిపోతుంది. అలాంటి సందర్భంలో మళ్లీ గురువు యొక్క ఔన్నత్యాన్ని సుద్ధముక్క కవిత్వం ద్వారా చాటి చెప్పే ప్రయత్నం చేశారు డాక్టర్ నలిమెల భాస్కర్ గారు. డాక్టర్ నలిమెల భాస్కర్ గారు సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం నారాయణపూర్ గ్రామంలో ఫిబ్రవరి 12 1956న కీర్తిశేషులు బుచ్చమ్మ,రామచంద్ర గార్ల పుణ్య దంపతులకు జన్మించారు. భాస్కర్ గారు తాను పుట్టి పెరిగిన పల్లె వాతావరణంను నాటి తెలంగాణ ఉద్యమ పోరాటాలను,జమీందారుల, భూస్వాముల దౌర్జన్యాలను, రైతు కన్నీటి జీవితాలను, పల్లె సంస్కృతిని,సామాజిక రాజకీయ మరియు ఆర్థిక అసమానతలను నిశితంగా పరిశీలించారు. కనీస అవసరాలు తీర్చుకొని ప్రజల దుస్థితిని కళ్లారా చూసి కలత చెందారు.వీటన్నిటి ప్రభావంతో తను రచయితగా ఎదిగారు. తాను కొలనూరులో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వర్తిస్తున్న కాలంలో ఏదైనా అన్య భాష నేర్చుకోవాలని తలంపుతో ద్రావిడ భాషను అధ్యయనం చేశారు. ఆ తర్వాత 14 భాషలను నేర్చుకుని బహుభాష కోవిదుడయినాడు.

ఇంతటితో ఆగకుండా తెలుగు సాహిత్యాన్ని ఇతర భాషల్లోకి ఇతర భాషల సాహిత్యాన్ని తెలుగు భాషల్లోకి అనువదిస్తూ అనువాద అవసరాన్ని చాటుతున్నాడు. తాను మలయాళ నవల స్మారకశిలు నవలను తెలుగులోకి అనువాదం చేశాడు. దీనికి కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం లభించింది. నలిమెల భాస్కర్ గారి ఇతర రచనలు మంద మరియు పదమూడు అనువాద కథలు, అద్దంలో గాంధారి మరి పదకొండు కథలు, భారతీయ కథలు, మానవుడా (గే సంపుటి) కిరణాలు (వచన కవిత సంపుటి) నూరేళ్ల పది ఉత్తమ మలయాళ కథలు, సాహితి సుమాలు (వ్యాసాలు), తెలంగాణ పదకోశం, మట్టిముత్యాలు (నానీలు) ఈతరం పాటలు, భారతీయ సామెతలు ఇలా అనేక రచనలు చేశారు. చాలా పుస్తకాలకు సంపాదకీయం వహించారు. వీరికి రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం 2001లో లభించడం జరిగింది. అలాగే అధికార భాష సంఘ పురస్కారం, శ్రీ పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం సాహితీ పురస్కారం. ఇలా సుమారు 25 పురస్కారాల వరకు లభించాయి.

డాక్టర్ నలిమెలభాస్కర్ సుద్దముక్క కవిత్వ సంకలనంలో ఉపాధ్యాయవృత్తిని, ఉపాధ్యాయుని ఔన్నత్యాన్ని ఆరు కవిత శీర్షికలలో చాటి చెప్పారు.

1) అక్షర ప్రాసన
2) బోధి వృక్షం
3) గది
4) సుద్దముక్క
5) ఒక్కముక్క కాదుసుమా
6) పవిత్రకార్యం

'అక్షర ప్రాసన' అనే కవితలో

'అతడు కాలు మోపడంతోటే
ప్రాంగణంలోని అణువణువూ అక్షరమవుతుంది.
అతని మాటల రెక్కల మీద
పిల్లలు అత్యంత సురక్షితంగా
జ్ఞాన విహాయసంలో విహరించి వస్తారు.'

ఉపాధ్యాయుడు చదువు చెప్పే ప్రాంగణంలోకి అడుగుపెట్టగానే అది పవిత్రస్థలమైతుందని, అతని బోధన వలన పిల్లలు జ్ఞానవిహాయసంలో విహరిస్తారని అంటాడు. అంతేకాకుండా కవి సందర్భోచితంగా ఉపమానాన్ని వేస్తూ తాను చెప్పదలుచుకున్న విషయాన్ని వ్యంగ్యంగా తెలియజేస్తాడు.

"రాముని పాద స్పర్శతో రాయి అహల్యగా మారడం ఏమోగాని ఉపాధ్యాయుని బోధనతో రాళ్ల లాంటి విద్యార్థులు రతనాలుగా మారడం ఖాయమని, ఉపాధ్యాయుని ఉపాధ్యాయ వృత్తి పట్ల తనకున్న విశ్వాసాన్ని, నిబద్ధతను ప్రకటించాడు.

"క్లాసులో ప్రవేశిస్తున్న ప్రతిసారి
అతడి కుడి చేతికి ఆరోవేలు
అదనంగా మొలుస్తుంది. అది ఖచ్చితంగా జ్ఞానం
ఘనీభవించిన తెల్లని
సుద్దముక్కే" సాధారణంగా మనిషి చేతికి ఐదు
వేళ్ళు ఉంటాయి.
చాక్పీస్ పట్టుకోవడం ద్వారా అతని చేతికి ఇంకొక్క
వ్రేలు అదనంగా మొలిచిందని

అంటాడు. ఈ రకంగా అక్షరం జ్ఞానం పెంపొందించే ఉపాధ్యాయుని శరీరంలో సుద్దముక్కను అవయవంగా వర్ణించడంలో వృత్తి పట్ల గౌరవంతో పాటు నిబద్ధతను చాటాడు. ఉపాధ్యాయ వృత్తిలోని సాధక బాధకాలను చెపుతూ...

"ఓసారి మచ్చుకు ఆచార్యుని ఎదమీద
వెన్నముద్ద పెట్టి చూడు అది అతని కష్టానికి క్షణంలో కరిగి
కన్నీరవుతుంది" అని

ఉపాధ్యాయవృత్తి సులభమైనది కాదని అతని కష్టాన్ని ఎత్తి చూపాడు. ఉపాధ్యాయుడు మేడిపండు లాగా పైకి మంచిగ కనిపించినప్పటికీ అతని మదిలో ఆలోచన లావ మరుగుతూనే ఉంటుందని అన్నారు. ఉపాధ్యాయున్ని జాతికి మూలస్తంభం అంటూ పొగుడుతారు. కానీ ప్రస్తుత కాలంలో ఆ మూలస్తంభాన్ని నిర్లక్ష్యానికి గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తపరిచాడు.

భోధివృక్షం అనే మరొక కవితలో నల్లబల్ల ను అయస్కాంతంతో పోలుస్తూ..

"నీ చేతి పొత్తిళ్లలో సుద్దముక్క
పసిపాపై వొదిగి వొదిగీ కడకు కొవ్వొత్తిలా కాలి
పోతుంది.
వెండితెరలు బుల్లితెరల మీద లగ్నమయిన
పిల్లల మనసుల్ని నల్లబల్ల
ఒక పెద్ద అయస్కాంతక్షేత్రమై ఆకర్షిస్తుంది."

పిల్లల మనసుల్ని టీవీలు, సినిమాలు ఆకర్షించిన విధంగా నల్లబల్ల అయస్కాంత క్షేత్రమై విద్యార్థులను ఆకర్షించి విజ్ఞానం అందిస్తుందని స్పష్టంచేశాడు. తరగతి గదిలో స్వేచ్ఛ విహంగాలైన విద్యార్థులను ఉపాధ్యాయుడు తన జ్ఞాన కాంతి చేత ఆకర్షించగలడని అంటారు. నలిమెల భాస్కర్ గురువును బోధివృక్షంతో పోలుస్తూ...

"రాత్రి ఆలుబిడ్డల్ని వదిలివెళ్లిన
గౌతముడిని బుద్ధుని చేసినట్లు
పగలు తల్లిదండ్రుల్ని వదిలి వచ్చిన విద్యార్థిని
సిద్ధార్థుని చేసే
నువ్వు బోధివృక్షానివి నువ్వొక బోధ వృక్షానివి" అని
చెబుతూ

రాత్రి భార్యబిడ్డల్ని వదిలి అడవిలోకి వెళ్ళిన గౌతముడు బోధివృక్షం క్రింద తపస్సు చేసి బుద్ధుడిగా మారాడు. అలాగే పగలు తల్లిదండ్రులను వదిలివచ్చిన విద్యార్థులను జ్ఞాన సిద్ధార్థులుగా తయారుచేసే ఉపాధ్యాయుడు బోధవృక్షం, బోధివృక్షంగా అభివర్ణించాడు. సుద్దముక్కను జ్ఞానాన్ని ప్రసరింపజేసే దీపంతో పోలుస్తూ...

"ఈ దీపం వెలుతురులో
ఎందరో డాక్టర్లు, ఇంజనీర్లు అయ్యారు.
ఈ కాంతిక్షేత్రంలోనే
మరెందరో ఉద్యోగులు,ఉపాధ్యాయులు తయా
రయ్యారు.
దీని రంగు తెలుపు
దీని కాంతి తెలుపు
ఆయుఃప్రయాణం కాస్త అటో ఇటో అరవైనిమిషాలు"

అంటాడు. సుద్దముక్క విద్యార్థి జ్ఞాన సముపార్జనకు దిక్సూచిలా ఉపయోగపడుతుందని, తరగతికి వెళ్ళే ఉపాధ్యాయునికి అది ఊపిరిగుళికని, అంతేకాకుండా ఉపన్యాసాలకు ఊతకర్ర అవుతుందని దాని ప్రాధాన్యతను తెలియజేశాడు. అంతటితో ఆగక నల్లని బోర్డుపై అక్షరాల్ని కురిపించే ఒక మేఘశకలమని వర్ణించి మానససరోవరంలో తెలియాడే రాజహంసతో పోల్చాడు.

కవి దేహంలో సుద్దముక్క కూడా ప్రాణమున్న జీవిగానే చిత్రిస్తూ ముక్కలు ముక్కలుగా సుద్దముక్క తెగిపడుతున్న, క్షణం క్షణం నేలరాలిపోతున్న ఆత్మ బలిదానం తప్ప అన్యమెరుగని త్యాగశీలి సుద్దముక్క అంటాడు. సుద్దముక్కలాగా ఉపాధ్యాయుడి దేహమే ముక్కలైనట్టు వర్ణించాడు. కొవ్వొత్తిలా, మంచుముక్కలా కరిగిపోయి, ఫిలమెంట్‌లా విజ్ఞానాన్ని పంచుతూ సుద్ద మొద్దుల్ని పరిశుద్ధులుగా తీర్చిదిద్దేది సుద్దముక్కే అని అంటారు.

'గది' అనే మరొక కవితలు ఉపాధ్యాయున్ని దయా మయునిగా కీర్తిస్తూ తరగతిగది మరియు బడి ఔన్నత్యాన్ని ఆవిష్కరించాడు.

"ఎక్కడెక్కడి పల్లెల తీరాల నుండో విద్యార్థులు
విహంగాలై ఎగిరి
వచ్చి ఆ వాకిలిపై వాలి తమ ఆకలిని తీర్చుకుంటారు"

విద్యార్థులను స్వేచ్ఛ విహంగాలతో పోలుస్తూ జ్ఞానమనే ఆకలిని తీర్చుకోవడానికి ఉపాధ్యాయుడు తరగతిగదికి తెచ్చిన అక్షరాల జ్ఞాన సంపదను ఆకలింపు చేసుకుంటారని, విద్యార్థును విహంగాలుగా, జ్ఞానాన్ని గింజలుగా పోలుస్తూ ప్రకృతిలోని సహజ గుణాన్ని తరగతిగదికి అన్వయించుకుంటూ గొప్పగా కవి చిత్రించడం జరిగింది. తరగతిగది విద్యార్థిని అజ్ఞానం నుండి విజ్ఞానం వైపు నడిపిస్తుందని చెప్తాడు.

మరొక కవితలో ఉపాధ్యాయుని ఔన్నత్యాన్ని కీర్తిస్తూ ఒక్క ముక్కకాదు సుమా అనే కవితలో

"ఎందరు ఎన్ని రకాలుగా చెప్పినా నీకు ప్రత్యా
మ్నాయం టేప్
రికార్డ్ కాదు నీకు బదులు ఏ టీవీ పాఠాలు రావు"

కరోనాకాలంలో బోధన మొత్తం టీవీ, మొబైల్ లాంటి ఆన్లైన్(అంతర్జాలం) మాధ్యమాల ద్వారా బోధించడం జరిగింది. అంతర్జాలంలో బోధించే ఉపాధ్యాయుడి బోధన అర్థవంతంగా లేక విద్యార్థులు అనేక ఇబ్బందులను ఎదుర్కొన్నారు. అందుకే విద్యావేత్తలు, మేధావులు ప్రత్యక్ష బోధన ద్వారా మాత్రమే విద్యార్థి మానసిక వికాసం జరిగి అతని సర్వతోముఖాభివృద్ధికి తోడ్పడుతుందని అభిప్రాయపడుతున్నారు. ఈ కరోనా విపత్తు రాకముందే ఉపాధ్యాయుని ప్రత్యక్ష బోధనకు ఏ మాధ్యమాలు కూడా సరిరావని చెప్పడం కవి దూరదృష్టికి నిదర్శనం. విద్యార్థికి ఉపాధ్యాయుడే సర్వస్వం అని చెపుతూ

"నువ్వు రక్తమాంసాలతోనూ
అపారమైనా ప్రేమాభిమానాలతోనూ
పిల్లలముందు కదలాడుతున్న
తల్లివి తండ్రివి, మిత్రుడివి, వేదాంతివి
పిల్లలతో నోరారా మాస్టారు అని
పిలిపించుకునే ఒక కాంతి నక్షత్రానివి"

విద్యార్థులకు ఉపాధ్యాయుడే సర్వస్వం. విద్యార్థుల జీవితాలలో వెలుగునింపే కాంతినక్షత్రం ఉపాధ్యాయుడే అని విద్యార్థులచే గౌరవంగా మాస్టారు అని పిలవబడుతాడని గురువు ప్రాశస్త్యాన్ని చెప్పాడు.

మరొక కవితలో ప్రపంచంలోనే ఉపాధ్యాయ వృత్తిని పవిత్ర కార్యంగా అభివర్ణించాడు.

"ఒక అందమైన గది గదంతా విద్యాగంధమైన
అనుభూతి
జ్ఞాన కిరణం సోకిన
గది సరస్సులో
విద్యార్థుల శిరస్సులు
విరబూసిన తామర్లు కావడం కన్నా
కృతార్థత మరేముంటుంది"

విద్యార్థులకు చదువు, సంస్కారం ఉపాధ్యాయుని వలన అందినప్పుడే సార్థకత ఉంటుందని, తరగతి గదిలో ఉపాధ్యాయుని జ్ఞాన కిరణం సోకి విద్యార్థులనే తామర పువ్వులు వికసిస్తాయని తెలిపాడు. ఉపాధ్యాయుడు నిరంతరం జ్ఞాన తృష్ణకలిగి ఉంటాడు. తానుపొందిన

జ్ఞానాన్ని తన బోధనలతో విద్యార్థులలో దాగివున్న జ్ఞానానికి మెరుగులు దిద్దుతాడు. అందుకే ఉపాధ్యాయున్ని అతికే సొల్డరింగ్ రాడ్తో పోల్చాడు. కవి నలిమెల భాస్కర్ దృష్టిలో పిల్లలకు పాఠాలు చెప్పడమంతా పవిత్రమైనటువంటి కార్యం ప్రపంచంలో మరొకటి లేదంటూ ఉపాధ్యాయుని యొక్క ఔన్నత్యాన్ని సుద్దముక్క కవిత్వంలో వివరించారు.

ఈ ప్రపంచంలో కలెక్టర్లను,డాక్టర్లను,కండక్టర్లను ఇంజనీర్లను, లాయర్లను, రక్షకభటులను అలాగే మేధావివర్గాన్ని తయారుచేసి దేశ అభివృద్ధిలో భాగస్వాములు చేసేది గురు లు. అలాంటి గురువును కించపరిచే విధంగా సినిమాలో చూపించడం గాని, సామాజిక మాధ్యమాలలో ఎగతాళి చేయడం గాని చేయకుండా ఉపాధ్యాయులను విద్యార్థులు మరియు సమాజం గౌరవించినప్పుడే సమాజం అభివృద్ధి చెందుతుందని డాక్టర్ నలిమెల భాస్కర్ గారు తన కవిత్వం ద్వారా హితబోధ చేస్తూ గురువు ఔన్నత్యాన్ని చాటాడు.

**ఉపయుక్త గ్రంథ సూచి :**

1. సుద్దముక్క కవిత్వం
2. నవనీతం

★★★

BHAVAVEENA
Vol. 21, Issue. 09, September 2024

ISSN No. : 2456-4702
RNI No. APTEL/2003/12253

# శ్రీమద్రామాయణ కల్పవృక్షం-ఆచార వ్యవహారాలు-శాస్త్రీయత

- **అలిగెల శ్రీకాంత్,** తెలుగు అధ్యాపకులు, ప్రభుత్వ స్వయంప్రతిపత్తి కళాశాల, రాజమండ్రి.

**ఉపోద్ఘాతం :**

రామాయణ కల్పవృక్షం పేరుకు తగ్గట్టు సమాజం కాంక్షించే వాస్తవిక, కాల్పనిక, వైజ్ఞానిక జీవ చైతన్య ఆధ్యాత్మికానుభవాలను అందించే విశిష్ట రచన.

1933-34 కాలంలో శ్రీమద్రామాయణ కల్పవృక్షం రచించినవారు విశ్వనాథ సత్యనారాయణ... అప్పటి నుండి నవ్య సంప్రదాయోద్యమం ప్రారంభం అయినట్లుగా పండితులు, విమర్శకులు భావించారు. ఈయన ప్రారంభించిన నవ్యసంప్రదాయ కవితోత్యమాన్ని కొందరు "నవ్య కావ్య దృక్పథం" అని, నవీన ప్రబందోద్యమమని పిలిచారు. పపకాని నవ్యసంప్రదాయోద్యమం అనే పేరు స్థిరపడింది. విశ్వనాథ కల్పవృక్ష కావ్య రచన ప్రారంభించిన నాటి నుండి నవ్యసంప్రదాయ కవితోద్యమం ప్రారంభం అయ్యిందని చెప్పుకున్నప్పటికీ, బాగా ప్రచారంలోకి వచ్చింది 1982 మధ్యకాల నుండి ప్రారంభం అయ్యిందనే చెప్పవచ్చు.

**పరిచయం :**

ఆయన జీవుని వేదన సమగ్ర కళానుభూతికోసం సమాజ జీవ చైతన్యం వ్యక్తం చేస్తున్న, ఆవేదన, వంద జిహ్వాల సమాజ చేతనకు విశ్వనాథ వారు అందించిన అమృత నైవేద్యమే, అనుభవకోశమే శ్రీమద్రామాయణ కల్పవృక్షం.. (నవ్యసంప్రదాయ కవితోద్యమం - విశ్వనాథ వ్యాసం)

ఈ మాటల్ని బట్టి సమాజ చైతన్యం కోసం విశ్వనాథ కల్పవృక్షం రాశారని భావించవచ్చు. రామాయణ కల్పవృక్షం వ్రాయడానికి అనేక కారణాలు విశ్వనాథ వివరించారు. అందులో ముఖ్యంగా మానవతా దృక్పథం, జీవవేదం అంటే మోక్షాన్ని సాధించాలే తపే ఈ రచనకు ప్రధాన కారణం. అంతేకాకుండా ప్రతి మనిషి ఆనందాన్నైనా, అనుభూతైనా తాధ్యాత్మం చెందటం ఎవరిది వారిదే. కనుక రామకథా రూపమైన భక్తిని కథారూపంలో సమాజాన్ని చైతన్యపరిచే విధం౧ అందించాలని తపించారు.

ఏ భాషలోని కావ్యానికైనా ఆ దేశ ఆచార వ్యవహారాలు ముఖ్యమైన పాత్రను నిర్వహిస్తాయి. సమాజ స్వరూపం ప్రతిఫలించే కావ్యాన్ని పాఠకుడు చదివి ఆనందాన్ని పొందటంతో పాటుగా తాధ్యాత్మం చెందుతాడు. ఏ కవి కావ్యాన్ని రచించినా ఆ కాలం నాటి సామాజిక, సాంఘిక పరిస్థితులను అర్థం చేసుకుని తమ కావ్య రచనలలో వాటిని ప్రతిఫలించే విధంగా రాస్తారు. జానపదుల కాలం నుండి కూడా ఆచార, వ్యవహారాలు అన్ని పాటించేవారు. మనిషి పుట్టుక దగ్గర నుండి మరించే వరకు ఆచార వ్యవహారాలు ఉంటాయి. వాటిని అన్నింటినీ సంప్ర దాయాలన్ని మరచిపోకుండా విశ్వనాథ వారు రామాయణ కల్పవృక్షంలో తెలియజేశారు.

**జాతాశౌచం - శాస్త్రీయత :**

బిడ్డ పుట్టినపుడు జాతాశౌచాన్ని - పదకొండు రోజులు పాటించే ఆచారం హిందూ సమాజంలో ఉంది. విశ్వనాథ వారు ఈ అంశాన్ని రామ, లక్ష్మణ, భరత, శతృఘ్నులు జన్మించినపుడు ప్రస్తావిస్తూ..

జాతాశౌచం వలన పదకొండు రోజులు, రాణులు అగ్ని కార్యాలు, దేవతా సంబంధమైన పూజలను మానివేశారు అని పేర్కొన్నారు. శాస్త్రీయంగా పరిశీలిస్తే బాలింతరాలు పుట్టిన బిడ్డకు అంటు రోగాలు రాకుండా దూరంగా ఉంచేవారు. వారిద్దరికి రోగనిరోధక శక్తి పెరిగే వరకు ఏ పని చేయకుండా అనేకమైన జాగ్రత్తలు తీసుకునేవారు.

జాతాశౌచం అనే పరు పెట్టి వారిని జాగ్రత్తగా చూసుకునే సాంప్రదాయాన్ని ప్రవేశపెట్టారు. అదే విషయాన్ని విశ్వనాథ వారు కావ్యంలో రచించారు.

**గర్భిణీ స్త్రీలు - నూలు వస్త్ర ధారణ - శాస్త్రీయత:**

గుంటూరు మండలంలోని పల్లెల్లో గర్భిణీ స్త్రీలు

కాట్రేని చీరలు ధరించేవారు. ఈ అంశాన్ని దృష్టిలో పెట్టుకొని గర్భంతో ఉన్న కౌసల్య, సుమిత్ర, కైకేయి కూడా కాట్రేని చీరలు ధరించినట్లుగా విశ్వనాథ వారు వర్ణించారు. శిశిర రుతువు వెళ్ళి వసంతం రాగానే రాణులు ముగ్గురు కాట్రేని చీరలు ధరించినట్లుగా తెలియజేశారు. చైత్రంలో రామాదుల జననం సమయానికి వేసవి కాలం ప్రారంభం అవుతుంది. నూలు వస్త్రాలను గర్భిణులు ధరించవలసిన చల్లదనాన్ని కల్గిస్తాయని సౌకర్యవంతంగా ఉంటాయని శాస్త్రీయ ధృక్కోణంలో ఆలోచించారు.

**కలినీళ్ళు చల్లుట - శాస్త్రీయత :**

పుట్టిన శిశువుపై కలినీళ్ళు చల్లటం ఆచారం. బొడ్డు కోసే సమయంలో ఆ కత్తికి తోరం కట్టడం అనాదిగా వస్తున్న ఆచారం.

"తోరము కట్టిన కత్తిని
గోరడమున మంత్రసాని కోసెను బొడ్డున్"
(బాలన - అవతార - 223)

శాస్త్రీయంగా చూసుకుంటే నరుని దిష్టి తగిలితే పగులుతుంది అంటారు. చిన్న పిల్లలు వయస్సు పెరిగే వరకు బాలారిష్ట దోషాలు ఉంటాయి. అవి పోవడానికే దిష్టి తీస్తారు. బాలింతల చేత నెలలోపు బావిలో చేద వేయించే ఆచారం ఉంది. కౌసల్య, సుమిత్ర, కైకేయిలు మహారాణులైనప్పటికీ వారి చేత ఈ ఆచారాన్ని అమలు చేయించారు. బాలింతలు నీటిలో ఉండకూడదు, పనులు చేయకూడదు. కొన్ని నెలల తరువాత తమ పనులు చేసుకోవచ్చు.

**ఉపనయనం - శాస్త్రీయత :**

రామాదుల ఉపనయన సందర్భంలో గొప్పదశిఖా ధారణ, కాసిన, మాంజీ, అశ్వతదండ ధారణ, గాయత్రీ మంత్రోపదేశం, భిక్షాటన మొదలైనవి హైందవ సాంప్ర దాయంలో తరతరాలుగా వస్తున్న ఆచారాలు, బాల వటువుకు, తిలకం, బుగ్గన చుక్క, కళ్ళకు కాటుక, పాదా లకు పారాణి మొదలైన ఆచారాన్ని తెలియజేశారు. శాస్త్రీయంగా చూసుకుంటే పిల్లవాడికి ఐదు లేదా ఏడు సంవత్సరాల వయస్సులో ఉపనయనం చేస్తారు. అంటే వారికి విద్యాభ్యాసానికి అర్హత లభించిందని అర్థం. గురుకులానికి వారిని పంపించటం విద్యాభ్యాసంలో విద్యను నేర్చుకుంటారు. గురుకుల ఆశ్రమ ధర్మాలను పాటించాలంటే రాకుమారుడిగా కాకుండా సామాన్య మానవుడునగా, సన్యాసిగా మారి విద్యను అభ్యసించాలి.

**వివాహం - అరుంధతి నక్షత్రం - శాస్త్రీయత :**

వివాహ సందర్భంలో గోదానం ఇవ్వటం ఆచారం. రామాదులు పెళ్ళికొడుకుపలైనపుడు దశరథ మహారాజు బ్రాహ్మణులకు గోదానం ఇవ్వడమే కాకుండా గోవులనున అలంకనరింనచిన విధానాన్ని, పెళ్ళితంతును కళ్ళకు కట్టినట్లుగా విశ్వనాథ వారు వర్ణించారు. సీతా, రాముల వైవాహిక ముక్తాఫలాలు, మణులు, నీల మణులు కలబోతగా ఉన్నాయిట. అరుంధతీ దర్శనం చేయిం చటం మొదలైన అంశాలను వర్ణించారు.

**అరుంధతీ నక్షత్రం - శాస్త్రీయత :**

"ఆ ధ్రువ నక్షత్ర మను సరించి రేఖ
మలయుచో సప్తర్షి మండలంబు
నాల్గు నక్షత్రముల్ నాల్గు మంచము కోళ్ళ
వలెనున్న యెడదుడి వంక మూడు"
(బాల - కల్యాణ - 99)

ధ్రువ నక్షత్రాన్ని అనుసరించి ప్రవర్తిల్లే సప్తర్షి మండలం నాలుగు నక్షత్రాలు మంచంకోళ్ళలా ఉండి, చివరి నక్షత్రానికి క్రింది వైపు మూడు నక్షత్రాలు క్రిందికి సాగి ఉంటాయి. ఆ మూడింటిలో మధ్యలో ఉన్నవారు వశిష్ఠులు, వారి ప్రక్కన మినుకు మినుకు మంటూ ప్రకాశించే అరుంధతీ నక్షత్రం" సీతారాములకు వశిష్ఠుడు అరుంధతిని చూపించాడట. ఈ విధంగా వివాహాన్ని విశ్వనాథ వారు వివరించారు.

ఈ నక్షత్రాన్ని చూపించడం వెనుక ఉన్న రహస్యం ఏమిటంటే బ్రహ్మదేవుని కుమార్తె పేరు సంధ్యాదేవి. ఈమె వశిష్ట మహర్షి ఉపదేశంతో తన దేహాన్ని అగ్నికి ఆహుతి చేసుకొని, ప్రాతఃసాయంత్ర సంధ్యలతో ఓ స్త్రీ రూపంగా మారింది. ఈ మహిళ అరుంధతి. ఈమె అందానికి ముగ్ధుడైన వశిష్ట మహర్షి పెళ్ళి చేసుకోవాలని అను

కుంటాడు. తన చేతిలోని కమండలాన్ని అరుంధతికి ఇచ్చి, తిరిగి వచ్చే వరకు ఎదురు చూడమని చెబుతాడు. అలా ఎన్నో ఏళ్లు మహర్షి కోసం ఎదురు చూస్తుంది. వశిష్ఠ మహర్షి వచ్చిన తరువాత వివాహం చేసుకుంటుంది. ఆమె పుణ్య స్త్రీగా, ప్రతివ్రతగా నక్షత్ర రూపంలో ఆకాశంలో వెలుగుతుంది. అరుంధతిలా ఓపిక, సహనంతోపాటు కొత్తజంట సంతోషంగా ఉంటారని, అలాగే వారి సంసారం సాఫీగా సాగుతుందని పురాణాలు చెబుతున్నాయి.

**పితృశ్రార్ధ క్రియలు - శాస్త్రీయత :**

విశ్వనాథ వారు పితృశ్రార్ధ క్రియలను కూడా కల్ప వృక్షంలో విశేషంగా వర్ణించారు. నిత్యకర్మలు, దశాహ కర్మ, సంచయనం, ఆస్థి నిమజ్జనము మొదలైనవన్ని హైందవ సమాజంలో జరుగుతున్న పితృకర్మ సంబంధ మైన ఆచారాలు వివరించారు. రాముడు వనవాసానికి వెళ్ళిన తరువాత బాధతో మనస్తాపానికి గురై దశరధుడు మరణించినపుడు ఈ ఆచారాలన్ని జరిపినట్లు విశ్వనాథ వర్ణించారు.

శాస్త్రీయంగా పిండప్రదాం చేయడం వల్ల పితృ దేవతలు సంతృప్తి చెంది వంశాభివృద్ధి జరిగేలా దీవిస్తారని ఆస్థికుల విశ్వాసం రాముడు దశరథుడికి పిండ ప్రదానం చేయాలి అరణ్యంలో ఉన్నారు. తన దగ్గర దొరికిన వస్తువులతో పిండప్రదానం చేసినట్లు వర్ణించారు. గార పండ్ల గుజ్జు కలిపిన రేగు పండ్ల గుజ్జునీ ఉండలుగా చేసి పిండ ప్రదానం చేశాడని వర్ణించారు.

**ముగింపు :**

విశ్వనాథ వారికి తెలుగుభాషపైన తెలుగు నేలపైనా, తెలుగు ప్రజలపైన విశేషాభిమానం ఉంది. అందుచేతనే తెలుగువారి సంస్కృతిని, విశ్వాసాల్ని, ఆచార వ్యవహారాల్ని తన రచనల్లో పొందుపరిచారు. కావ్యం జీవితానికి ప్రతి బింబంలా ఉండాలి. అంటే సమాజంలో ఉన్న ఆచార వ్యవహారలన్ని ఆ కాలానికి అనుగుణంగా ఉండే విధంగా రచించాలి. అప్పుడే పాఠకుడు రసానుభూతి పొందుతాడు. కావ్య రచనా కాలం నాటి సామాజిక పరిస్థితులను తన కావ్యంలో ప్రతిఫలించే విధంగా రచనలు చేయడం వలన పాఠకుడు అర్థం చేసుకుంటాడు. ఆ రచనా కాలం నాటి సామాజిక పరిస్థితులను అవగతం చేసుకుంటాడు. ఆ ఆచార వ్యవహారాలు సమాజంలో, కుటుంబంలో పాటించే విధంగా అలవర్చుకుంటాడు.

ప్రాచీనమైన పురాణ కథలకు ఆధునిక సామాజి కాచారాలను జోడించి కావ్యాన్ని నిర్మించడం ఉత్తమ కవుల లక్ష్యంగా కనిపిస్తుంది. విశ్వనాథ వారు తమ రామాయణ కల్పవృక్షంలో ఎన్నో ఆచార వ్యవహారాలను శాస్త్రీయంగా నిరూపించారు.

**పాద సూచికలు :**

1. నవ్య సంప్రదాయకవితోద్యమం - విశ్వనాథ వ్యాసం.

**ఆధార గ్రంథాలు :**

1. తెలుగు సాహిత్య చరిత్ర - ద్వానా శాస్త్రి.
2. విశ్వనాథ మార్గము : కోవెల సుప్రసన్నాచారులు.
3. సాహిత్య చరిత్రలో చర్చనీయాంశాలు : సుబ్రహ్మణ్యం జి.వి.
4. శ్రీమద్రామాయణ కల్పవృక్షం : విశ్వనాథ సత్యనారాయణ.

★★★

ISSN No. : 2456-4702
RNI No. APTEL/2003/12253

# శివరామ కారంత్ నవల చోముని దుడి తెలుగు అనువాదం

– డా॥. గుండ్లూరు వెంకట రమణ, తెలుగు ఉపన్యాసకులు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, గణపవరం, పశ్చిమ గోదావరి జిల్లా.

తెలుగు సాహిత్యం అనువాదంతోనే మొదలైందనేది ఒక నిర్వివాదాంశం. నన్నయ, తిక్కన, ఎర్రన, పోతన, శ్రీనాథులు సంస్కృతం నుండి అనువాదం చేసి తెలుగులోకి తమ రచనల్ని వెలువరించారు. సమాజంలో ఉండే సాంఘిక, ఆర్థిక, రాజకీయ సామాజికాంశాలెన్నో సాహిత్యంలో ప్రతిఫలిస్తుంటాయి. సార్వజనీనమైన, సార్వకాలికమైన సాహిత్యం ఏ దేశంలో వెలువడినా, ఏ ప్రాంతంలో వెలువడినా, ఏ భాషలో వెలువడినా అది సమాజాన్ని ప్రభావితం చేస్తూ ఉంటుందనే దానికి పరిశుద్ధ గ్రంథం (Holy Bible), మహాభారతం, రామాయణాలు గొప్ప ఉదాహరణలు. ఈ రచనలు ఇలా విశ్వవ్యాప్తం కావడానికి కారణం అనువాదం. అనువాదం ఒక విద్య. ఒక కళ. ఒక శాస్త్రం. ఇలాంటి గొప్ప గొప్ప రచనలు ఏదో ఒక మూలన వెలువడతాయి. స్థానికతతో సార్వజనీనతను చూపించే రచన అత్యంత ప్రతిభావంతంగా సమాజంపై ప్రభావాన్ని చూపుతుంది. ఇలా ఒక మూలన వెలువడ్డ రచన అక్కడికే పరిమితం కాకుండా విశ్వవ్యాప్తం చేయడానికుపకరించే ఏకైక సాధనం అనువాదం. ఇతర భాషలో వెలువడిన రచన మన స్వంత భాషలోకి అనువదించబడినపుడు ఆ రచనను మనం సులువుగా చదువుకుని అర్థం చేసుకోవడానికి వీలవుతుంది. మూల భాష మనకు పూర్తిగా తెలియకపోయినా, అందులో మనకు ఏమాత్రం ప్రవేశం లేకపోయినా లక్ష్య భాషలోకి వచ్చిన రచనలను మనం అర్థం చేసుకోగలం. ఫలితంగా రెండు భాషల్లోని సాహిత్యాంశాలను అర్థంచేసుకునే వీలుంటుంది.

ఒక భాషలోని రచన ఇతర భాషలోకి అనువాదం చేయబడటంవల్ల మూల రచనలో ప్రతిఫలించిన రాజకీయ, ఆర్థిక, సామాజికాంశాలు, ఆచార వ్యవహారాలు, కట్టుబాట్లు, సంస్కృతి మొదలగు అనేకాంశాలు అనువాద రచనలో కూడా చోటు చేసుకుంటాయి. ఫలితంగా వాటిని అర్థంచేసుకునే అవకాశం ఉంటుంది. మన సోదరభాష అయిన కన్నడంలో కోట శివరాయ్ కారంత్ గారు రాసిన 'చోమునిదుడి' అనే నవలను 'చోముని డప్పు' అనే పేరుతో శర్వాణి తెలుగులోకి అనువదించారు. అనువాదకునికి రెండు భాషల్లోనూ ప్రవేశముండాలి. అనువాద రచనా పాఠకునికి మూలభాష తెలియకపోయినా ఫరవాలేదు. కాబట్టి అనువాద రచనా పాఠక దృక్పథంతో "చోముని డప్పు" నవలలోని కొన్ని అంశాల్ని వివరించటానికి ప్రయత్నిస్తాను.

'చోముని డప్పు' నవల్లో ఉండే అంశాలను పరిశీలించేందుకు ముందుగా ఆ నవలా రచయిత అయిన కోట శివరాయ్ కారంత్‌ను గురించి కొంత పరిచయం చేయటం ఎంతైనా సమంజసమే.

ఆధునిక కన్నడ సాహిత్య వినీలాకాశంలో పున్నమినాటి నిండు జాబిల్లి శివరాయ్ కారంత్. కన్నడ సాహిత్య చరిత్రలో మనదేశంలో సాహిత్య కారులకిచ్చే అత్యున్నత పురస్కారమైన "జ్ఞానపీఠ్ అవార్డు"ను పొందిన ఏడుగురిలో కారంత్ ముచ్చటగా మూడోవాడు.

కారంత్ బహుముఖ ప్రజ్ఞాశాలి. ఆయన రాసిన "మూకజ్జిగ కనసుగలు" అనే నవలకు ఆయనకు జ్ఞానపీఠ్ అవార్డు వచ్చినది. కారంత్ కర్ణాటక రాష్ట్రంలో ఉడిపిజిల్లా, కోట గ్రామంలో 10వ తేదీన, 1902 అక్టోబరులో జన్మించాడు. ఒక సంప్రదాయ బ్రాహ్మణ కుటుంబంలో జన్మించారు. కారంత్ తన తల్లిదండ్రులకు ఐదో సంతానం. తండ్రి శేష కారంత్, తల్లి లక్ష్మమ్మ. కారంత్ ఒక గొప్ప రచయిత, సామాజిక ఉద్యమకారుడు, పర్యావరణవేత్త, అద్భుత కళాకారుడు. గత అరవయ్యేళ్ళ కాలంలో నవభారత నిర్మాతలుగా పేరుగాంచిన పదిమందిలో కారంత్ ఒకరు. కారంత్‌ను భారత ప్రభుత్వం పద్మభూషణ్‌చే సత్కరించినా, ఇందిరాగాంధీ విధించిన అత్యవసర పరిస్థితి కారణంగా దాన్ని తిరస్కరించాడు.

ఒక అపారమైన, అసమానమైన ప్రతిభా సంపత్తి గలవారు కారంత్ 47 నవల్లే కాకుండా 31 ఏకాంకికలు, 4 చిన్న కథలు, 6 వ్యాసాల పుస్తకాలు, చాళుక్యుల శిల్పకళ, సంస్కృతికి చెందిన 13 పుస్తకాలు, 240 చిన్న పిల్లలకు సంబంధించిన పుస్తకాలు, ఒక ఆతకథ మొదలగు 417 పుస్తకాల్ని రాశారు.

**చోముని డప్పు :**

"చోముని దుడి" అనే పేరుతో కోట శివరాయ్ కారంత్ దీన్ని కన్నడలో రాశారు. శర్వాణిగారు దీన్ని 'చోముని డప్పు' అనే పేరుతో తెలుగులోకి అనువాదం చేశారు.

'చోముని డప్పు' నవల ఒక అస్పృశ్యజాతికి చెందిన చోముడియొక్క జీవితాన్ని చిత్రించిన నవల. చోముడికి వున్న తన ఒక్కగానొక్క కోర్కె 'సొంతంగా సాగు చెయ్యాలి' అనేది తీరకుండానే ఎలా తన జీవితం ముగిసిపోతుందో అనే అంశాల్ని చిత్రించిన నవల. 'చోముని డప్పు' నవలలో ప్రధాన పాత్ర చోముడు. భోగన పల్లిలో నివాస ముంటాడు. చుట్టూ దట్టమైన అడవి, కొండ ప్రాంతం, ఆ దిగువనే భోగపల్లె. సుమారు 40/50 గడపలుంటాయి. 200 మంది దాకా ఉండచ్చు. చోముడికి ఐదుగురు పిల్లలు. నలుగురు కొడుకులు, ఒక ఆడపిల్ల. చనియ, గురువ, బెళ్ళి, నోళ, కాళలు. చోముడి భార్య వ్యాధితో కొంత కాలానికి మరణిస్తుంది.

ప్రతి ఏడాది భోగనపల్లె పక్క ఊర్లో జాతర జరుగుతూ ఉంటుంది. చోముడు, పిల్లలూ ఆ జాతరకు వెళ్తారు. అందులో చోముడు డప్పును విశేషంగా వాయిస్తాడు. చోముడు తన జీవితంలో కష్టమొచ్చినా సుఖమొచ్చినా, కన్నీళ్ళచ్చినా, దుఃఖమొచ్చినా డప్పు తీసుకుని వాయించే వాడు. జాతర నుంచి ఇంటికొచ్చాక ఇంటిలో తినడానికేమీ ఉండదు. ఆ రోజు రాత్రి తన ఇంటిలోని ఆకలికేకకు తన డప్పు శబ్దాన్ని జోడిస్తాడు.

సంకప్పయ్య భోగనపల్లిలో ఒక ప్రముఖ జమీందారు. చోముడు అతని కుటుంబమంతా సంకప్పయ్య ఇంట్లో పనిచేసుకుంటూ జీవనం సాగిస్తుంటారు. చోముడు రోజంతా కష్టపడిపనిచేస్తే అతనికి దొరికేది అర్ధశేరు బియ్యం. అందులోనే అతడు కల్లుతాగేవాడు. మిగిలిన భత్యంతో కుటుంబాన్ని పోషించుకునేవాడు. చోముడి చిన్న కొడుకులకు ఎప్పుడూ ఏదో ఒక జబ్బు ఉండనే ఉంటుంది. పెద్దకొడుకు లిద్దరూ అడవికెళ్ళి ఆకు తెచ్చి యజమాని ఇంట్లో వేస్తుంటారు. బెళ్ళి ఖాళీ సమయాల్లో బుట్టలల్లుకుంటూ ఉండేది. ఓ రోజు చోముడు తన కోరికను తన కూతురు బెళ్ళితో చెప్తాడు. ఆమె వద్దం టుంది. కానీ రెండు విషయాల్లో తను గర్వపడుతూ ఉంటాడు. ఒకటి తాను ఎవరికీ అప్పు బాకీ పడలేదని, ఎప్పటికైనా సొంతంగా సాగుచేసి పంట పండించాలని. మాదిగవాళ్ళు వ్యవసాయం చెయ్యటం అంటే ప్రళయం వచ్చినట్లేననే అభిప్రాయం ఆ ఊరి వారందరిలో ఉం డటం వల్ల బెళ్ళి అతన్ని వ్యవసాయం చెయ్యద్దని చెప్తుంది. ఆవేశంతో డప్పు మోగిస్తాడు.

బెళ్ళి తన తండ్రిని ఓదారుస్తుంది. సాగు చేసు కోవాలంటే, బ్రాహ్మణులగానో, కాపులుగానో, గౌడలుగానో పుట్టాల్సింది. ఈ దిక్కుమాలిన మాదిగకులంలో పెట్టి, సాగుచేస్తానంటే కుదురుతుందా? 'నియమాల్ని పాటించక పోతే నలుగురూ దుయ్యబట్టరూ" అనంటుంది. అర్ధరాత్రి పూట డప్పు మ్రోగించి పిల్లల్ని ఆడమంటూ ఉంటాడు. తన యజమాని ఒకసారి ఈ మధ్య ఉదయం కూడా కల్లు పాకకు వెళ్తున్నావా అనడిగితే మీరిచ్చే దానికీ ఉదయమేమిటి? సాయంత్రం మేమిటి ఎపుడైనా వెళ్ళచ్చునంటాడు. అందుకు యజమాని తన ఇంటికి రావద్దని ఆజ్ఞాపించాడు. బెళ్ళి వెళ్ళి యజమానితో మొరపెట్టుకుంటుంది.

ఇంతలో అప్పు తీర్చలేదని మన్వేలుడు మళ్ళీ వస్తాడు. ఈసారి బెళ్ళి, నీలలు ఆ తోటలో పనిచేసి అప్పు తీర్చడానికని బయలుదేరతారు. ఇంకా వెళ్ళటానికి మూడు రోజులు గడువుంటుంది. ఈ లోపు బంధువులు ఇంటికొస్తారు. అసలే వర్షాకాలం. తింటానికి తిండికి కరువు. బంధువులంతా ఒక వారం రోజులుండి మొత్తం తినేసి బయల్దేరతారు. బెళ్ళి, నీలలు తోటలో పనికెళ్తారు. కొద్దిరోజులకు నీలకు జ్వరం పట్టుకుంటుంది. అందుకు బెళ్ళికి పనికెళ్ళటం, తమ్ముని్న చూసుకోవటం చాలా కష్టంగా ఉంటాయి. అందుకు మణ్వేల మేస్త్రీ తన ఇంట్లో

పనిచేయమంటాడు. బెళ్ళికి వయసు వస్తుండగా మణ్వేలుడు ఆమెను లోబర్చుకుంటాడు. బెళ్ళి లంగిపోతుంది. మణ్వేలుడు ఆమెకు ఒక చీరను కొనిస్తాడు. ఓ రోజు నీల మరో పిల్లాడు ఆడుకుంటూ మాటా మాట వచ్చినపుడు తిట్టుకుంటారు. 'మేస్త్రీ బామ్మర్ది' అని నీలను తిట్టగా విషయం అందరికీ పాక్కిం దని బెళ్ళి భయపడి ఆ రాత్రే అక్కడ నుండి మాయమై ఇంటికొచ్చేస్తుంది.

చోముడు బెళ్ళికి పెళ్ళిచెయ్యాలనే ఆలోచనలలో ఉంటాడు. జాతరలో ఆమెకు ఒక భర్తను చూడాలని బయల్దేరతాడు. రెండోరోజు మళ్ళీ ఓసారి తన కోరిక యజమానితో చెప్పగా "నీవు వ్యవసాయం చెయ్యాలంటే మా అమ్మ చచ్చిపోవాలంటాడు" అనంటాడు. ఇంతలో నీల యేటి నీటిలో మునిగి చనిపోతాడు. అక్కడ ఒక బ్రాహ్మణుడున్నా అతన్ని కాపాడడు. ఎందుకంటే అతడు మాదిగపిల్లాడు. కులం కాటేసి 'నీల'ను చంపేస్తుంది. డప్పు మోగుతుంది.

ఇంట్లో చావులు, ఆకలి కేకలు, వస్తులు, ఏడ్పులు... ఇవన్నీ చూసి చోముడు ఒక నిర్లిప్త దశకొస్తాడు. బెళ్ళి కూడా కొంత అనుభవాన్ని గడిస్తుంది. చివరికి తన కోరికను ఎలాగైనా తీర్చుకోవాలని అనుకుంటాడు. నేను ఫాద్రి మతంలో ఎందుకు చేరకూడదు అని అనుకుంటాడు. అదే ఆలోచనతో ఫాద్రితో మాట్లాడుదామని 'కొక్కడం' అనే ఊరికి వెళ్తాడు. అప్పటికే 'గురువ' మారిని పెళ్ళి చేసుకుని సొంతంగా వ్యవసాయం చేస్తుంటాడు. ఈ సంగతి విని చోముడికి మరింత ధైర్యం వస్తుంది. చోముడు కొక్కడానికి బయల్దేరతాడు.

ఇంతలో మన్వేలుడు బెళ్ళిని వెతుక్కుంటూ అక్కడికి వస్తాడు. పాత పరిచయం వల్ల, ఎవరూ ఇంట్లో లేక పోవటం వల్ల ఆమె అతనికి వివశురాలవుతుంది. మేము కూడా ఫాద్రి మతంలో చేరాలని అనుకుంటున్నామని మన్వేలుడితో చెప్తుంది. ఇద్దరూ ఒకే చాపమీదుంటారు. ఇంతలో చోముడు ఇంటికొస్తాడు. జరిగింది చూసి ఆవేశంతో కర్రతో మన్వేలున్ని విసురుతాడు. బెళ్ళిని ఏం చేయాలో తెలియక గట్టిగా మెడ పట్టుకుని ముద్దు పెట్టుకుంటాడు. బెళ్ళి జరిగిందంతా చెప్పి పశ్చాత్తాపపడి, తండ్రితో అన్నీ చెప్పేయాలనుకుంటుంది. చోముడు తన తప్పును తెలుసుకుని బాధపడతాడు. వయసొచ్చినా పెళ్ళి చెయ్యకపోవటం తన తప్పేనని పశ్చాత్తాపపడతాడు.

చోముడికి చివరికి తన కోరిక తీరదన్న ఆలోచన మనసులో స్థిరపడిపోగా ఆ రెండు ఎడ్లనూ తోలుకుని పోయి అడవిలో వదిలిపెట్టి వస్తాడు. ఇంటికొచ్చి నాగలిని తీసుకుని దాన్ని ముక్కలు ముక్కలుగా నరికి కాల్చేస్తాడు. ఇంట్లో ఒక్కడే తలుపులు మూసేసి డప్పును తీసుకొని మోగిస్తాడు. కొంతసేపటికి శబ్దం ఆగిపోతుంది. "చోముడు మాత్రం లేడు" అనే వాక్యంతో నవల ముగుస్తుంది.

చోముడు తన కులంవల్ల ఎంత కఠినమైన అస్పృశ్య జీవితాన్ని అనుభవించాడో కారంత్ మన కళ్ళకు కట్టినట్లు చూపించాడు. దీని ద్వారా అస్పృశ్యత అనేది ఒక దేశానికో, రాష్ట్రానికో లేదా ఒక ప్రాంతానికో పరిమితం కాలేదనేది స్పష్టమౌతుంది. మాదిగవాడు కావడంవల్ల సొంతంగా వ్యవసాయం చేసే యోగ్యత లేదు. అదే మాదిగవాడు, వాని నాగలి, వాని ఎద్దులు యజమాని పొలంలో పనిచేసి పండించిన పంటను వాళ్ళు బాగా తినవచ్చు. అయితే ఈ అభాగ్యునికి గుక్కెడు గంజినీళ్ళు కూడా కరువే. మనదేశంలో, రాష్ట్రంలో, ప్రాంతంలో అస్పృశ్య ఛాయలు ఇంకా తొలగిపోలేదు. సమాజంలో 'ఒక కులం' అనేది ఎంత బలమైన పాత్ర వహిస్తుందో తెలుసుకోవడానికి చోముడు మనకు ప్రత్యక్ష ఉదాహరణ. ఇలాంటి చోముళ్ళు ఇంకా ఉన్నారు. వెదికి పట్టుకుంటే ఖచ్చితంగా మన కళ్ళెదుట కొస్తారు. చోముడి జీవితంలోని కులం వల్ల తను అనుభవించిన నష్టాలు -

సొంతంగా కొంత మడిచెక్కను సాగుచేసుకోలేక పోవడం. తన కొడుకుని కళ్ళముందే నీటిలో మునిగి చావటం అందరూ చూస్తుండగా మాదిగ వాడని ఎవరూ కాపాడటానికి ముందుకు రాకపోవటం. బెళ్ళి మన్వేళ మేస్త్రీకి లొంగిపోవటం. కళ్ళుకు నిలయం చోముడి సంతానం, బంధువులు, ఆకలికేకలు పాటలు, డప్పు దరువులు నాట్యాలు. ఏడ్పులు, రోగాలు, జ్వరాలు, ఎవరూ చూడకపోవటం. ఇలా ఎన్నో ఎన్నో కారణాలు

మనకు కనబడుతాయి. తనకు దక్కింది ఇతరుల కెందుకని ఎద్దుల్ని అడవిలో వదిలేసిరావటం. చివరికి తన కుటుంబం విచ్ఛిన్నమై ఒంటరిగా చచ్చిపోవటం. ఈ నవలలో దళిత జీవితాన్ని అద్భుతంగా చిత్రించబడింది.

చోముడు "నేను మాదిగవాడు కాకుండా మరే కులపు వాడినైనా నా నీలుడు బ్రతికి బయటపడేవాడు గదా ! మాదిగకులందేవుడికి అక్కర్లేనపుడు నాలాంటి వాళ్ళందర్నీ ఆ కులంలో ఎందుకు పుట్టించాలి? ఇలా ఎందుకు ప్రాణాలు తియ్యాలి" అని దేవుణ్ణి ప్రశ్నిస్తాడు. ఆ బాధ, తీవ్రత, నొప్పి అనుభవించినవాడికే తెలుస్తాయి. అంటూ బాధలు ఎవరైతే అనుభవిస్తున్నారో వారిని తప్పకుండా చోముడు పుట్టిన కడజాతిలో పుట్టకూడదనిపిస్తుంది.

## ఆధార గ్రంథాలు :

1. మల్లెమొగ్గల గొడుగు, మాదిక కథలు, దండోరా ప్రచురణలు, హైదరాబాద్, అక్టోబర్ 1999.
2. నల్లద్రాక్ష పందిరి, ఉభయ భాషా కవిత్వం, జె.జె. ప్రచురణలు, హైదరాబాద్, జూన్, 2002.
3. పుష్కర కవితలు, కవితలు, మానస, మనోజ్ఞ ప్రచురణలు, రాజమండ్రి, 2003.
4. వర్గీకరణీయం, దళిత దీర్ఘ కావ్యం, మానస, మనోజ్ఞ ప్రచురణలు, బ్లాక్ డే, 2004, డిసెంబర్, గుడ్ ఫ్రైడే, మార్చి 2005.
5. "ఆటా" జనికాంచె.., అమెరికా యాత్రా కవితలు, మానస, మనోజ్ఞ ప్రచురణలు, రాజమండ్రి, జూన్ 2006.
6. జాషువా సాహిత్యం - దృక్పథం - పరిణామం, పిహెచ్.డి. సిద్ధాంత గ్రంథం, 1993, మానస, మనోజ్ఞ ప్రచురణలు, రాజమండ్రి, ఏప్రిల్, 2007.

★★★

ISSN No. : 2456-4702
RNI No. APTEL/2003/12253

# తెలుగు మగువల వెలుగు కిరణం

- డా॥. పురుషోత్తం గుంట, పరిశోధక విద్యార్థి, ఆంధ్ర విశ్వవిద్యాలయం, విశాఖపట్టణం.

అనేకాంధ్ర ప్రక్రియలకు ఆద్యుడు అసాంఘికాచారాలను నయం చేసిన వైద్యుడు ఆడబిడ్డలకు అండగా నిలిచిన పూజ్యుడు. అఖిలాంధ్ర కోటికి విశ్వ ఆరాధ్యుడు కందుకూరి వీరేశలింగం పంతులు గారు. తెలుగు సాహిత్యంలో స్త్రీ పాత్రకు ఎనలేని స్థానమున్నప్పటికీ స్త్రీ అభ్యున్నతిని చిత్రించిన కవిత్వం అంతంత మాత్రంగానే ఉండేది. పురాణాల్లో స్త్రీ పూజింపబడింది కానీ భర్త అడుగు జాడలోనే నడిచింది. ప్రబంధాలు స్త్రీ ప్రణయ శృంగార దేవతగా వర్ణింపబడింది. భావకవిత్వంలో స్త్రీ సౌందర్య మూర్తి. అనురాగమూర్తిగా చిత్రించబడింది. కానీ ఈ ప్రక్రియలో స్త్రీలు కేవలం పాత్రధారులుగానే మిగిలి పోయారు. కానీ నిజజీవితంలో స్త్రీ పడుతున్న అగచాట్లను, వేదనను తెలుసుకొని వారి జీవితాల్లో వెలుగు నింపడం కోసం కంకణం కట్టుకొని తన సాహిత్యం ద్వారా, సంస్కరణల ద్వారా పత్రికల ద్వారా, ఉపన్యాసాల ద్వారా స్త్రీ జనోద్ధరణకు కందుకూరి వీరేశలింగం పూనుకున్నాడు.

వీరేశలింగం పంతులు గారు స్త్రీల కోసం రాజమహేంద్రవరంలో ప్రార్థన సమాజమును ఏర్పాటు చేశారు. ప్రతి వారము వారిని సమావేశపరిచి ప్రార్థనలు చేస్తుండేవారు. తన భార్య రాజ్యలక్ష్మమ్మ గారి కోరికపై వీరేశలింగం గారు మందిరం కూడా నిర్మించారు. ఇలా కందుకూరి వారు తన భార్యను, అదేవిధంగా మగువుల మేలు కోసం అహోరాత్రులు శ్రమించారు. సంఘ సంస్కరణకు వైరుధ్యాల సమాలోచన నుంచి ప్రభవించి ప్రభవించి ప్రకటితమైన అసాధారణ వస్తు స్వభావమే నూతన యుగం! మానవుని చరిత్రలో ఈ నూతన యుగం కర్తవ్యరూపంగా కాలక్రమంలో ప్రకటితమవుతూ వస్తున్నది. ఈ నూతన యుగ ప్రభావానికి ప్రేరకాలు పరిస్థితులూ, కారకులు మనుష్యులూ అవుతారు. ఆ విధంగా అలా కారకులైన మనుష్యుల్నే యుగపురుషులు అంటారు. వీరేశలింగం యుగ పురుషుడు.

ఈ దేశము మిమ్ములను నుండియే యెంతో మేలును పొంది ప్రతీక్షించుచున్నది. లోకమంతాయు దేశాభివృద్ధి కొరకు మీకోసం ఎదురు చూచుచున్నది. అభిముఖములై వచ్చి మీ తోబుట్టువులకు సహాయము చేయడం “సంఘీశక్తి కతాయుగే’ అని అయుండుట వలన వచ్చి యౌదార్యముతో సహాములు కండి. మీరు సిద్ధపడుడు మేము వెనుదీయగలవారము కాదు. మేము ఋణం పూర్వకముగా పనిచేయుచున్న వారమని నమ్ముడు అని రాజమహేంద్రవరములో 1879 సెప్టెంబర్‌లో స్త్రీ పునర్వివాహ ప్రవర్తక సమాజ కార్యదర్శిగా ప్రాధేయ పూర్వకముగా ఉపన్యసించారు. మనదేశం నందలి విద్యావంతులను అభ్యర్థిస్తూ పై విధంగా తెలిపారు.

రాజశేఖర చరిత్రము నవలలో చిన్న వయస్సులో భర్తను కోల్పోతే ఆ స్త్రీ ఒంటరిగా బాధపడే విషయాలు, అదేవిధంగా ఆనాటి అత్తగారి ఆరడీలను, కోడండ్ర కష్టాలను, కళ్ళకు కట్టినట్లు కందుకూరి వారు చిత్రీకరించారు. ఈ విధంగా తన నవల ద్వారా ఆనాటి స్త్రీల దయనీయ స్థితిని కందుకూరి తెలియజేశారు. ‘ఉత్తమ మాత’ అను వ్యాసము ద్వారా నేటి సమాజానికి చక్కని సందేశం ఇచ్చారు. స్త్రీలు సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా అన్ని రంగాలలో పదములై కీర్తిశిఖరాలు అధిరోహించాలి. సమాజములో తాను ఒక భాగమని గుర్తించాలి. విద్యావంతురాలగుటకు ప్రతి స్త్రీ కృషి చేయాలి. సత్ప్రవర్తన అలంకారం సత్ప్రవర్తన కలిగి ఉండి గృహ నిర్వాహకత్వం జరిగించుచుండాలి. మారుతున్న సమాజానికి అనుగుణంగా అన్ని రంగాలలో మీదైన ముద్ర వేస్తూ విజయ పదములో పయనించాలి. సంస్కృతి సాంప్రదాయాలు పరిరక్షించడానికి కృషి చేయాలి. మూఢ నమ్మకాలను, మూఢాచారాలను పారద్రోలాలి. అందరూ చదువుకునేలా ప్రోత్సాహం అందించాలి. తన ప్రేమ చేత బిడ్డలను సరైన పద్ధతులలో పెంచాలి. పై వ్యాసము ద్వారా ఉత్తమ మాత గురించి కందుకూరి తెలియపరిచారు.

వీరేశలింగం గారు వితంతువుకు శరణాలయాన్ని

నిర్మించడానికి 30 ఎకరాల స్థలముకొని ఒక ధాత సాయంతో భవనం కట్టించారు. దానిని వితంతు శరణా లయంగా మార్చారు. వితంతువులకు చాలా సందర్భాల్లో వధూవరుల పెద్దల అంగీకారముతోనే పెళ్ళిళ్లు చేయిం చారు. ఎందరో అనాథ బాలికలకు తన ఇంట్లో ఆశ్రయం ఇచ్చారు. వారికి ఇంట్లోనే చదువు చెప్పారు. ఈ విధంగా కందుకూరి మగువ ఉన్నతి కోసం నిర్విరామంగా శ్రమపడ్డారు. అతడు 1906లో తన మిత్రులందరినీ పిలిచి తాను తలపెట్టి కార్యక్రమాలు, స్థాపించిన సంస్థలు శాశ్వతంగా చక్కగా సాగటానికి వీలుగా 'హితకారిణి సమాజం' అనే సంస్థను స్థాపించారు. తాను స్థాపించిన ఆస్తిక ఉన్నత పాఠశాలలో స్త్రీలకు, హరిజనులకు ప్రవేశం కల్పించి, వారికి ఉచితంగా విద్యాబోధన చేయించాడు. ఈ విధంగా స్త్రీల శ్రేయస్సును తోడ్పాటు అందించారు. చిలకమర్తి నరసింహం గారు నడిపే మాధ్యమిక పాఠశాలను తీసుకొని దానిని ఉన్నత పాఠశాలగా మార్చి వదాన్యుల సహాయంతో భవనాలు కట్టించి రాజమండ్రిలో ఆస్తిక ఉన్నత పాఠశాలను స్థాపించాడు. ఆరుద్ర గారు కందుకూరి గూర్చి ఇలా అన్నారు.

"మగువ హైన్యత మగువదైన్యత
మాపి పొందెను తాను ధన్యత"
(ప్రొఫెసర్ వెలమల సిమ్మన్న - తెలుగు సాహిత్య విమర్శ సిద్ధాంతాలు, పుట : 413)

ఈ విధంగా స్త్రీ యొక్క హీనస్థితిని మరియు దయనీయస్థితిని తొలగించి తాను సార్ధకత పొందారు. కందుకూరి స్త్రీలపై జరుగుతున్న అన్యాయాలను దృష్టిలో పెట్టుకొని 1891లో "సత్యరాజపూర్వదేశయాత్ర" అనే గ్రంధాన్ని వ్రాశారు. ఈ గ్రంథం ఆంగ్ల, కన్నడ భాషలలోనికి అనువదించబడింది. అదేవిధంగా "అతి బాల్య వివాహం" అనే గ్రంథంలో బాల్యవివాహ వ్యవస్థలోని దుర్మార్గాన్ని కందుకూరి ఎండగట్టాడు. తర్వాత బాల్య వివాహాలు ఏయే కారణాల వల్ల జరుగుతున్నాయో వాటిలో తల్లి దండ్రులు, పురోహితులు స్వార్థం ఏమిటో స్పష్టం చేశారు. బాల బాలికల కోసం కందుకూరి నీతి కథా మంజరి రాశారు. కందుకూరి గూర్చి ఆరుద్ర గారు ఈ విధంగా అన్నారు.

"తెలుగు జాతిని తెరలు తెరలుగా
కారు చీకటి కమ్మినప్పుడు
మూఢ చాందస గాఢ రుగ్మత
మూలుగుల్లో చొచ్చినప్పుడు
కాంతి ఖడ్గము కరుణ వైద్యం
కార్యవాదిగా కావ్యశీలిగ
జాతి జనుల సముద్ధరించగ
జనన మొందెను తెలుగు గుడ్డను"
(ఆచార్య సజ్జామోహన్ రావు గారి సంపాదకత్వంలో వెలువడిన "సాంఘికోద్యమ రూపకాలు" పుట : 432)

ఈ విధంగా తెలుగు వారిని అనేక సాంఘిక దురాచారా లను, చీకట్లు అలుముకున్నప్పుడు మూఢ విశ్వాసాలనే రోగాలు, ఆనాటి మనుషుల ఎముకుల్లో నిండి ఉన్నప్పుడు ఒక కాంతి ఖడ్గం అనగా లేజర్ ట్రీట్మెంట్ లా వైద్యం చేసి సంస్కరించాలని పనికట్టుకుని కావ్యాలను రచించి తెలుగు ప్రజలను బాగు చేయాలని తెలుగు గడ్డపై పుట్టిన వారు వీరేశలింగం పంతులు గారు.

ఆరుద్ర గారు అన్న మాటలు అక్షర సత్యాలు ఆనాటి సమాజంలో ప్రబలిన ప్రమాదకర అసాంఘికాంశం వేశ్యాలోలత. వేశ్యాలోలతను 'బ్రహ్మ వివాహం' 'వేశ్యా ప్రియ ప్రహసనం', 'కౌతుక వర్ధిని' మొదలగు ప్రహసనాల్లో ప్రస్తావించి వేశ్యాప్రియత్వం వలన కలిగే అనేక నష్టాలను తెలియజేశారు. పెద్దయ్యగారి పెళ్లిగా ప్రాచుర్యం పొందిన 'బ్రహ్మ వివాహం' ప్రహసనంలో కన్యాశుల్కాన్ని, బాల్య వివాహాలను కందుకూరి దుయ్యబట్టారు. దీనిని బట్టి ఆనాటి మగువలు పొందిన బాధ మనకు అవగతం అవుతుంది. 1881 లో రాజమండ్రి ఇన్నిసుపేటలో బాలికా పాఠశాలను స్థాపించారు. 1897-98లో చెన్నపట్టణంలో తమ ఇంట్లోనే వితంతు శరణాలయాన్ని స్థాపించారు. 1902-1903లో రాజమహేంద్రవరంలో స్త్రీ ప్రార్ధనా సమాజ మందిరాన్ని నిర్మించి ఇచ్చారు. 1905లో రాజమహేంద్రవరంలో స్త్రీ విక్టోరియా బాలిక పాఠశాలను, వితంతు శరణాలయాన్ని స్థాపించారు. 1909లో రాజమహేంద్రవరంలో 'పతిత యువతి' రక్షణశాలను స్థాపించారు. ఈ విధంగా కందుకూరి వీరేశలింగం గారు మగువులు మేలు కోసం అహోరాత్రులు శ్రమించారు. ఇంగ్లీషులో ల్యాంబను అనునతడు వచన రూపమున రచించిన కథలలో కొన్ని కథలను వీరేశలింగం గారు సులభ శైలిలో తెనిగించారు. ఇవి స్త్రీలు వినోదకరముగా చదువుకొని ఆనందించుటకు తగినవి అని తలచి

తెనిగించారు. ఆ రచనలు కురంగేశ్వర వర్తక చరిత్రము, గయ్యాళిని సాధు చేయుట, సుమిత్ర చరిత్రము, సతీమణీ విజయం, దాన కేసరి విలాసం, వైదర్భి విలాసం, సరసమనోభిరామము, భానుమతి కళ్యాణం మొదలగునవి మగువుల అభ్యుదయాన్ని ప్రోత్సహించే రచనలు.

**కందుకూరు గురించి ప్రముఖుల అభిప్రాయాలు:**

**చిలకమర్తి లక్ష్మీనరసింహారావు గారి అభిప్రాయంలో..**

"తన దేహము తన గేహము
తన కాలము తన ధనమ్ము తన విద్య జగ
జ్జనులకు వినియోగించిన
ఘనుడీ విరేశలింగ కవి జనులారా!"

(డాక్టర్ ద్వా.నా. శాస్త్రి తెలుగు సాహిత్య చరిత్ర, పుట : 347)

ఈ విధంగా కందుకూరి తన శరీరాన్ని, ఇంటిని, సమయాన్ని, డబ్బుని, జ్ఞానాన్ని, లోకములోని మనుషులకు వినియోగించిన గొప్పవాడని అర్థం.

**రాయసం వెంకట శివుడు గారు అభిప్రాయంలో..**

"వీర సంస్కర్త వీరేశలింగం".

(ప్రొఫెసర్ వెలమల సిమ్మన్న - తెలుగు సాహిత్య విమర్శ సిద్ధాంతాలు, పుట : 410)

**శ్రీపాద గోపాల కృష్ణమూర్తి గారు అభిప్రాయంలో...**

"పిచ్చి నమ్మకాలు, విపరీతపు పూర్వాచారాలు, రాజ్యం చేస్తూ ఉండే కాలంలో పుట్టి, హేతువాదమనే ఆయుధాన్ని పట్టుకొని, అరటి నరుకుడు వంటి విధ్వంసానికి ఉద్యుక్తులైనారు వీరేశలింగం పంతులు గారు.

("ప్రొఫెసర్ వెలమల సిమ్మన్న - తెలుగు సాహిత్య విమర్శ సిద్ధాం తాలు, పుట : 410)

**డాక్టర్ కడియాల రామ్మోహన్ రాయ్ గారు అభిప్రాయంలో...**

"విద్యుచ్ఛక్తి రాకముందున్న ప్రపంచానికి, విద్యుచ్ఛక్తి కనుగొన్న తర్వాత ప్రపంచానికి ఎంత వ్యత్యాసమున్నదో, వీరేశలింగం గారి రచనలకు పూర్వం ఆంధ్ర సాహిత్యానికి, వీరేశలింగం గారి తర్వాత ఆంధ్ర సాహిత్యానికి అంత భేదం ఉన్నది" అని అన్నారు.

(ప్రొఫెసర్ వెలమల సిమ్మన్న - తెలుగు సాహిత్య విమర్శ సిద్ధాంతాలు, పుట : 412)

ఈ విధంగా తన రచనల ద్వారా మరియు తన సంఘ సంస్కరణాభిలాష ద్వారా తెలుగు మగువుల జీవితాల్లో వెలుగు రేఖలను నింపిన కందుకూరి వీరేశలింగం పంతులు గారిని ప్రముఖ సంస్కర్త ఈశ్వరచంద్ర విద్యా సాగర్‌తో పోల్చుతూ దక్షిణ భారత ఈశ్వరచంద్ర విద్యా సాగరుడు అంటారు. ఈశ్వరచంద్ర విద్యాసాగరుడు వలె వీరేశలింగం గారు స్త్రీ జనోద్ధరణకు వేసిన బీజాలు ఈనాటి స్త్రీ స్వేచ్ఛకు, సాధికారతకు చేయూతనిచ్చాయి.

**ఆధార గ్రంథాలు :**

1. ఆచార్య సి. నారాయణరెడ్డి : ఆధునికాంధ్ర కవిత్వం, సంప్రదాయములు : ప్రయోగములు, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, హైదరాబాద్.
2. డాక్టర్ ద్వా.నా. శాస్త్రి : తెలుగు సాహిత్య చరిత్ర, ప్రగతి పబ్లిషర్స్, హైదరాబాద్.
3. ఆచార్య జి. నాగయ్య : తెలుగు సాహిత్య సమీక్ష (రెండవ సంపుటం) నవ్య పరిశోధక ప్రచురణలు, తిరుపతి.
4. ఆచార్య ఎన్.వి. రామారావు : తెలుగులో సాహిత్య విమర్శ అవతరణ - వికాసములు, పసిడి ప్రచురణలు.
5. ఆచార్య బూదాటి వెంకటేశ్వర్లు : తెలుగు సాహిత్య విమర్శ, హిమకర్ పబ్లికేషన్స్, హైదరాబాద్.
6. ప్రొఫెసర్ వెలమల సిమ్మన్న : తెలుగు సాహ్యి విమర్శ సిద్ధాంతాలు, దళిత సాహిత్య పీఠం, విశాఖపట్టణం.
7. ఆచార్య సజ్జా మోహన్‌రావు గారి సంపాదకత్వంలో వెలువడిన సాంఘికోద్యమ రూపకాలు, విజయ నరసింహ పబ్లికేషన్స్, టెక్కలి, శ్రీకాకుళం.
8. పింగళి లక్ష్మీకాంతం : సాహిత్య శిల్ప సమీక్ష, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, హైదరాబాద్.
9. వీరేశలింగం రచనలు.

★★★

# బంజారా సాంస్కృతిక వైవిధ్యంలో తీజ్, శీత్లా పండుగల గేయాల పాత్ర

- సాలి ధనావత్, పరిశోధక విద్యార్థి, తెలుగు శాఖ, ఉస్మానియా విశ్వ విద్యాలయం.

పండుగలు సమాజంలోని ఆయా జాతుల, తెగల సామాజిక, సాంస్కృతిక, నైతిక చారిత్రక,ఆధ్యాత్మిక తాత్వికతల విశేషాంశాలతో ఆచార సంప్రదాయాలకు అద్దం పడతాయి. కొన్ని పండుగలు ఆయా ప్రాంతాలకే పరిమితమైనవి అయి ఉంటాయి. బంజారాలు వలస జీవులై స్థిర నివాసమేర్పరచుకున్న తరువాత తమ ఇరుగు పొరుగు సంస్కృతులతో కొంత ప్రభావితమైనను, తమ సంప్రదాయ బద్ధమైన శీత్లా, తీజ్, దసరా, హెరీళి, దాటోడి లాంటి పండుగలను జరుపుకుంటూ తమ పూర్వపు సంప్రదాయాలను పదిల పరుచుకుంటూ వస్తున్నారు. ఈ పండుగల సంధర్భంలో గేయాలు వారి సాంస్కృతిక జీవన సౌందర్యాన్ని వెల్లడిస్తాయి. బంజారాలు గేయాల ద్వారా తమ ఆరాధనా విధానాన్ని ప్రకటిస్తారు. ఈ విధాన మంతా ఎంతో ప్రత్యేకంగా ఉంటుంది. ఈ విషయాన్నే తెలుపుతూ "బంజారా సాంస్కృతిక వైవిధ్యంలో తీజ్, శీత్లా గేయాల పాత్ర"ను తెలియ జేయడమే ఈ వ్యాసం ముఖ్య ఉద్దేశం.

జానపద సాహిత్య ముఖ్యలక్షణం మౌఖిక ప్రసారం. ఇది "ముఖే ముఖే సరస్వతి" అన్నట్లు ఒకరి నుండి మరొకరికి ఒక ప్రాంతం నుండి మరొక ప్రాంతానికి ప్రసారమయ్యే క్రమంలో ఆయా ప్రాంతాల ఆచారాలను, కట్టుబాట్లను, నమ్మకాలను, విశ్వాసాలను జానపద సాహిత్యం నిక్షిప్తం చేస్తుంది.ఈ జానపద పదం అమర కోశంలోను, వ్యాసుడు రచించిన మహాభారతంలోను, ఎర్రన అరణ్య పర్వంలలో జానపదులు గ్రామీణులనే అర్థంలో వాడబడింది.

"జనపదుల్ పురీ జనులు సంత సముం బ్రమదం బెలర్పనీ
చాడ్పున నీవ యిమ్మహిన్"

(భారతము - అరణ్య - 346)

జానపద సాహిత్య పరిశోధన పరిశోధకులకు అక్షయ పాత్ర అయ్యింది. తెలుగు సాహిత్యాన్ని దృష్టిలో పెట్టుకొని ఆచార్య బిరుదురాజు రామరాజు, ఆచార్య నాయని కృష్ణ కుమారి, ఆచార్య తంగిరాల వెంకట సుబ్బారావు ఆర్వీయస్ సుందరం మొదలైనవారు శాస్త్రీయ దృక్పథంతో జానపద సాహిత్యాన్ని విభజించారు. అందులో నాయని కృష్ణకుమారి గారి విభజన ప్రజాదరణ పొందింది.

అవి; 1. జానపద వాఙ్మయం 2. వచనశాఖ 3. గేయశాఖ (కథాసహితం, కథారహితం)లు మానవ సాంస్కృతిక ప్రగతిలో గేయం ఎప్పుడు పుట్టిందో కచ్చితంగా ఎవరు చెప్పలేదు. మానవ పరిణామక్రమంలో శబ్దాల ఉత్పత్తి పెరుగుతూ వచ్చి శ్రమజీవిగా జీవితాన్ని సాగించాడు. శారీరక శ్రమను మరవటానికి కూని రాగాలు తీయటం ప్రారంభించాడు. ఆ కూని రాగాలే రాను రాను గేయ రూపాలను సంతరించు కున్నాయి. అందుకే గేయం గురించి ఆచార్య బి.రామరాజుగారు "సుఖమో దుఃఖమో అనుభవించినప్పుడు అతని ఉద్విగ్న హృదయం నుండి లయాన్వితమైన గేయమో, గేయ పాదమో వెలువడు తుందని, ఇది ప్రజల నోళ్ళలో నాని పెరిగి తిరిగి స్వయంభువుగా నిలుస్తుందని" (బి. రామరాజు - జానపద గేయ సాహిత్యం, పుట 18 )పేర్కొన్నాడు. "లయాన్విత మైన నాటి పాటలే అనేక మార్పులు చెంది ఈనాటి రూపాలను చెందాయి. ఈ పాటల పుట్టు పూర్వోత్తరాల గురించి ప్రశ్నించుకుంటే భాష ఎంత ప్రాచీనమైందో, గేయం కూడ అంత ప్రాచీనమైందని. భాష ఎప్పుడు పుట్టిందో తెలియదు గాని అయిదువేల సంవత్సరాల క్రితమే భాష ఉన్నదని తెలుస్తుంది", (సుబ్రమణ్య శాస్త్రి వేదుల, జానపద గేయ సాహిత్య ప్రభ, పుట. 28) అన్నారు.

ISSN No. : 2456-4702
RNI No. APTEL/2003/12253

**బంజారా గేయం :**

ప్రాచీన కాలంనుండి నేటి వరకు జీవన వ్యవస్థలో సంస్కృతి, సంప్రదాయం, ఆచారాలలో ఎట్టి మార్పును చెందని వారు బంజారాలు. ఈ బంజారాల జీవితాలను, జానపదగేయ సంగీతాన్ని వేరుచేసి చూడలేం. సామూహిక జీవితానికి అలవాటు పడ్డ వారి జీవన విధానం, ప్రకృతిలో ఆటపాటలతో మమేకమై పోయింది. వారి గేయాలు, వారి సంస్కృతిని ప్రతిబింబించే విధంగా ఉంటాయి.అందులో పండుగల సందర్భంలో పాడుకునే తీజ్ గేయాలు, శీత్లా గేయాలు ఎంతో ప్రత్యేకంగా ఉంటాయి.

**తీజ్ పండుగ గేయాలు :**

తీజ్ పండుగను మొలకల పండుగ అని కూడా అంటారు. అనగా గోధుమ మొలకల నారు పండుగ. తీజ్ పండుగ ఆడవారు జరిపే పండుగ. ముఖ్యంగా పెళ్ళి కాని ఆడ పిల్లలు చేసే పండుగ. తీజ్ పండుగ బతుకమ్మ పండుగను పోలి ఉన్నది. బతుకమ్మను తొమ్మిదవ రోజు నీటిలో వదిలితే, తీజ్ గోధుమ నారును కూడా తొమ్మిదవ రోజున నీళ్ళలో నిమ్మజనం చేస్తారు. పండుగ జరిగే రోజుల్లో ఆడపిల్లలునియమనిష్టలతో ఉండి కార్యక్రమాలు చేస్తున్నప్పుడు, మగపిల్లలు వారిని ఆటంకపరిచి, ఏకాగ్రత కోల్పోయేటట్లు చేస్తారు. అయినా మొక్కవోని దీక్షతో తొమ్మిది రోజుల పండుగను నిర్వహించుకుంటారు. హాస్య, వంగ్య చలోక్తులతో పాటలు పాడుతుంటారు. శీతలా పండుగ జరిగిన మరుసటి రోజు ఉదయాన్నే తండాలో ఉన్నా ఆడ పిల్లలందరూ కలిసి తండాలోని పెద్దలందరిని ఒక దగ్గరకు పిలుచుకొని రావడానికి తండాలో తిరుగుతూ పాటలు పాడుతారు.

**గేయం :**

"బాపూ బ్యాటోర దేవళేమా/ ఘడి ఘడి దేకూరే లాల్
దేకు/ దేకూరే లాసేరియా ఘడి
ఘడి దేకూరేలాల్ బాపూ /బ్యాటోర మళాయేమా ఘడి
ఘడి నాచూరే లాల్/ నాచు
నాచూరే లాసేరియా/ ఘడి ఘడి నాచూరే లాలోకి"

**భావం :** దేవాలయంలో దేవుణ్ణి చూస్తే మనస్సు ఆనందంతో నిండిపోతుంది. ఓ నాయనలారా మీరు వలయా కారంలో గుంపుగా కూర్చుంటే నాకు నాట్యం చేయాలని అనిపిస్తున్నది. తండాలోని పెద్దలందరు వలయాకారంలో కూర్చుంటే మాకు పట్టలేని ఆనందంతో నాట్యం చేయాలని సంతోషం కలుగుతున్నది. మీరు పండుగ చేయాలని నిర్ణయిస్తే మా సంతోషాలకు పట్ట పగ్గాలుండవని తమ మనసులో మాటను పాట ద్వారా వ్యక్తీకరిస్తున్నారు.

**గేయం :**

"హమ తీయారే నాయేకేరో/ నాం జెరపచ బోలియా
గీద్ హమ లీయారే/
నాయకణేర్ నాం జెర పచ బోలియా గీచ్: హమ
లీయారే/ కారభారిరో నాంర ప బోలియా గేదె
హమహొలియానేహొ/గందిరోగదలే గరణేన వాజళ
మేల హెలి ఛీజేన ధరతి చూలవే/ మారే
భూరియా మేల హెలి జే ధరతి చలచేడి మారే/
హాయిసలేవడ దరన మేల హెలి/భీంజేన
ధరతి చూంచేది మారే/ కారభారి వర వరస మేల
పోలి భీంజేన ధరతి చూంచేది/మారే
నాయేకే వర వరస మేల హెలి భీంజేన ధరతి
చూంబేడి /మారే శీతలా పద వరస మేల
హెలిజి ఛీజేన ధరతి చూంచేది"

**భావం :** ఆకాశంలో మెరుపు మెరిసి నిండుగా మబ్బులు కమ్ముకొని, భూమి తదవడానికి సిద్ధంగా ఉన్నది. నా ముక్కు పోగు (భూరియా) మీద వర్షం పడడానికి నా మెడ కంటే (వాంసలో) మీద వర్షం పడడానికి, నా తండా కార్యదర్శి(కార్బారి) మీద వర్షం పడడానికి, నా తండా నాయేక్ మీద వర్షం పడడానికి నా శీతలా మీద నర్షం పదడానికి భూమి తడిసిపోయింది. ఇలా పాటలు అయిపోయిన తరువాత అందరు కలిసి భవానిలకు మొక్కుతారు.

"యా యాడి సాతి భవాని/శీతలా యాడి సాయినేస్/
సరే దార్ తార్ బోల్/తోన
పూలదాయేచ యాడ్ /గావ గోదార్ సాయివేస్/కూంట
ముంగరీర్ సాయివేస్/గానది
గోదార్ బాబా హజాద్ కోస్ టాకేస్/సాయి వేసి సవాయి
రకాడేస్ మారి యాడి శాపణి"

ISSN No. : 2456-4702
RNI No. APTEL/2003/12253

**భావం :** అమ్మా తల్లి సంవత్సరంలో మొదటి పూజ నీకు ఇస్తున్నాం. పశువులను చీడ పీడల నుండి కాపాడి మమ్మల్ని దీవించు తల్లి, అని ప్రార్ధించిన తరువాత నైవేద్యం, వండిన మాంసాన్ని అందరికి పంచి పెడతారు ఆ తరువాత ఏపిడి మాంసపు పోగులు వాళ్ళు తీసుకొని వండుకొని తిది తాగి ఎవరి ఇళ్ళకు వారు చేరుకుంటారు. దీనితో పండుగ అయిపోతుంది.

ఈ విధంగా బంజారాలు తీజ్ పండుగను అత్యంత పవిత్రంగా చేసుకుంటూనే దానిలో ఒక సౌందర్యాన్ని తమ గేయాలలో నింపుతారు. దాని ద్వారా తరతరాలుగా వారి జీవన విధానంలో కొనసాగుతూ వస్తున్న తీరుని చాటుతారు.

ఈ వైవిధ్యం తెలంగాణ లోని అన్ని జిల్లాల్లో కని పిస్తుంది. నేను పరిశోధన చేస్తున్న యాదాద్రి భువనగిరి జిల్లాలోని తీజ్ గేయాలలో కూడా అంతే ప్రత్యేకత ఉం టుంది. ఇక్కడ కొన్ని గేయాల్లో కథా గేయాలు కూడా ఉంటాయి. ఆయా ప్రాంతాల్లో తీజ్ పండుగను ఏ విధంగా జరుపుకున్నారు అనే విషయాలను కొందరు బంజారాలు కథా గేయాలుగా పాడుకుంటూ ఉంటారు.

ఇక ఇటువంటిదే మరొక పండుగ శీతల పండుగ. బంజారాల్లోని గ్రామదేవతలలో ఈ శీతల మాత ఒకరు. వీరు ఏడుగురు అక్క చెల్లెలు. అందులో శీతల మాతను ప్రత్యేక దినాలలో పండుగను చేసి కొలుస్తారు.ఆ సందర్భంలో పవిత్ర గేయాలలో స్తుతిస్తూ కొలుస్తారు.

**శీతలా పండుగ :**

ప్రాచీన కాలం నాటి లంబాడీలకు పశుసంపదే జీవనాధారం, వస్తువులను, సరుకులను ఒక ప్రాంతం నుండి మరొక ప్రాంతానికి చేరవేయడానికి పశువులను ఉపయోగించేవారు. పశుసంపద అభివృద్ధి కొరకు వాటి ఆరోగ్యం కొరకు శీతలా దేవిని వీరు పూజిస్తారు. దేవి అగ్రహిస్తే పశుగణం నశిస్తుందని నమ్ముతారు. ఏడుగురు శక్తి దేవతలైన అణది, దోకాంగర్, మసురు, హింగళా, తోకజా, యంబా, శీతలాలను పూజిస్తారు. వీరికి గల తమ్ముడిని లూంతడియా అని పిలుస్తారు. అయితే ఏడుగురు అక్కా చెల్లెళ్ళలో ప్రతి సంవత్సరం మొదటిగా అందరి కంటే చిన్న అయినా కితలా భవానిని లంబాడీలు పూజిస్తారు దానికి గల చారిత్రక కారణాలను వారు మౌఖిక కథలుగా చెప్పుకుంటారు.

ఒకరోజు లోకాన్ని చూసి రావడానికి మోట్ యాడి బయలు దేరగా, దారిలో ఒక రాక్షసుడు అడ్డు వచ్చి, నీకు దారి కావాలంటే నాతో కలు బడి గెలిచిన తరువాత వెళ్ళాలని, ఓడిపోతే నీ తలను తీసుకుంటా నని నేను ఓడిపోతే నా తలను నువ్వు తీసుకోవచ్చని షరతు విధిస్తాడు. లోకమాత అయిన భవాని సరే అని ఆట ఆడితే మాయతో కుట్రపన్ని ఓడిస్తాడు. అలా అరుగురు అక్కా చెల్లెళ్ళు ఓడిపోయి బంధింపబడతారు. ఇక మిగిలిన ఒకరు శీతలా భవాని మాత్రమే వాళ్ళ తమ్ముడు లూంకడియా వెళ్ళి శీతలాను తీసుకొని వస్తాడు శీతలా భవాని పాచికలు ఆడి గెలుస్తుంది. తరువాత రాక్షసుడిని సంహరించి అరుగురు అక్కులను రక్షిస్తుంది. అందరి ప్రాణలు కాపాడిన నీవే అందరి కంటే ముందు పూజలు అందుకోవాలని చెప్పారట. ఆ రోజు నుండి శీతలా భవాని పండుగ మొదటగా జరుపుతారు.

శ్రావణ మాసంలో తండా పెద్దలందరూ ఒక దగ్గరకు చేరి శీతలా పండుగ ఎప్పుడు జరుపుకుందామని చర్చించి ఫలానా రోజు అని అనుకుంటారు. పండుగ ముందు రోజు రాత్రి ధాలియా తండాలో డప్పు కొడుతు “హంపిదో వాంపిడో” అగి అరుస్తూ బాటింపు చేస్తాడు. మరుసటి రోజు ఉదయం పెద్దలందరు ఒక మేకపోతును కొనుగోలు చేస్తారు. ప్రతి ఇంట్లో జొన్న, కందులతో కలిపి గుగ్గిళ్ళు వండుతారు. పెళ్ళి కాని అద పిల్లలు తమ ఇంట్లో దాచుకున్న “పూలియా గాల” బయటకు తీసి గుగ్గిళ్ళను మందు పళ్ళెంలో పోసు కొని ఆ పళ్ళెం పైన “పూలియా గోడ్లో”ను కప్పుకొని తండా బయట ప్రతిష్టించిన ఏడుగురు శక్తి దేవతల రుపాలతో ఉన్న ఏడు రాళ్ళు ఎదురుగా ఒక రాయి లూంకరియా దగ్గరకు పాటలు పాడుకుంటు చేరు కుంటారు. అక్కడికి చేరుకున్న ఆడపిల్లలు ఐదు బిందెల నీళ్ళు (ప్రాంచ్ బెడో) ఎత్తుకొని వస్తారు..

తండా కార్బారి సమక్షంలో ఆ నీళ్ళతో ఆ దేవతల ప్రతిమలను కడిగి జాజూ పూసి నెయ్యి పోస్తారు. ప్రతిమల

ముందు అలికి ముగ్గు (చాకో చేస్తారు. నెయ్యితో దీపాన్ని వెలిగించిన తరువాత తండాలోని ప్రతి ఇంటి నుండి తెచ్చిన గుగ్గిళ్ళను ప్రతిమల ముందు పోస్తారు. ఆ తరువాత తండా కార్యదర్శి(కార్భారి) వెల్లంతో కలిపిన బియ్యాన్ని పాయసంగా వండి నైవేద్యం సమర్పించిన తరువాత మేకపోతుపై నీళ్ళు చల్లి. దడ్ ద ఇప్పించి తలను కోస్తారు. ఆ కోసిన తలను ప్రతిమల ముందు ఉంచుతారు. మేకపోతు తలను కోసేటపుడు కొంత రక్తాన్ని పట్టుకొని అందులో కోసిన మేకపోతు పొట్టపేగులోని పెండను తీసి చక్తంలో కలుపుతారు. దీనినే "వాంప్లో" అంటారు. ఇప్పటి లోపు తండా మొత్తానికి సంబంధించిన పశువులను ఒక దగ్గరికి చేరుస్తారు. అప్పుడు తండా కార్భరి పశువులను తెమ్మని సైగ చేయగానే కేకలు వేసుకుంటూ పశువులను ముందుకు తోలుతారు దేవతల ప్రతిమలకు, లూంకడియా ప్రతిమకు మర్చన ఉన్న ఖాళీ స్థలంలో నుండి పశువులను అల్లిస్తూ వాంపినోను చల్లుతారు అలాగే కొంతమంది కోళ్ళను కూడా కోసిపశువుల పైకి విసురుతారు.

పశువులు భయం భయంగా ప్రతిమలను దాటుతూ ముందుకు వెళ్తాయి. దీని వలన సంవత్సరమంగా పశు వులకు ఎలాంటి హాని కలగదని విశ్వసిస్తారు. తరువాత మగవాళ్ళు అందరూ మేకపోతును కోస్తూ, భాగాలుగా చేస్తుండగా ఆడవాళ్ళు నాట్యం చేస్తూ ఈ విధంగా పాటలు పాడుతారు.

**గేయం :**

"సతేరోయే శీతలా సపనేమా కేగో/ నాయేకేన వంపిడో
కరాకన కేగో/ కారభారిన
జోకడ భణా కనకేగో/ సతేకోయే శీతలా సపనేమా
కేగో/ నాయేకన డబడా మరొకన కేగో/
నాయేకణేన ఝురలో భలా కేగో/ సతరోయే శీతలా
సపనేమా కేగో/ నాయేకేన బోకడ కటా
కన కేగో సతచోయే శీతలా సపవేమా కేగో/ నాయేకేన
ఘవు భణా కన కేగో /సతేరోయే
శీతలా సపనేమాకేగో /కారభారిన ఢాకలో ఘలా కన
కేగో/ సతేరోయే శీతలా సపనేమా కేగో
/కారభారిన ఝుదలో నచాకన కేగో/ సతీరోయే శీతలా
సపనేమా కేగో/ నాయేకణేన
ఝురలో నచాకన కేగో"

**భావం :** మహిమ గల శీతలా కలలో వచ్చి పాని గుగిళ్ళు పండించమని తండా కార్యదర్శిని మేకలను కొనుగోలు చేయమని తండా నాయకుని తప్పెట కొట్టించమని నాయకుని భార్యను ఆడవాళ్ళను పోగేయ మని అలాగే తండా నాయకునికి గోధుమలు ఖరీదు చేయమని, తండా కార్యదర్శిని లీజ్ బుట్టల కోసం మంచె ఏర్పాటు చేయమని అడవాళ్ళను పోగేసి నాట్యం చేయించమని చెప్పిపోయింది.

లంబాడీలు పూజించే ఏడుగురు స్త్రీ శక్తి దేవతలలో శీతలా భవానిని అందరి కంటే ముందు పూజిస్తారు. ఆపండుగ సందర్భంలో తండా నాయక్, కార్యదర్శిలు చేయవలసిన పనులను పురమాయిస్తూ, బాధ్యతలను గుర్తు చేస్తూ భవాని కలలో చెప్పిందని పాడుతూ తయారు అవుతారు .

"కడే కటారి మాతేవర రో గ్యాని బియా జాళతా హాటో
పేర్ కడే కటారి మాతేవర రో గ్యాని
బియారో వాళణా భరకతో"

**భావం :** నడుముకు చిన్న కత్తి తలపై తలపాగా పెట్టుకున్న ఓ జ్ఞానవంతుడివైన అన్నయ్య ఆవులమంద చెదిరిపోతుంది. మందను తిరిగి మళ్ళించు. శీతలా పండుగ సందర్భంగా దేవతల ముందు కోళ్ళను కోసి ఆవుల మందలో వేస్తూ పెద్దగా కేకలు వేస్తారు. అప్పుడూ ఆవులు చెదిరిపోతుంటాయి, వాటిని చూస్తూ ఈ పాట పాడుతారు.

"బాలా బాహూరో బాడూ భలో/ బాజూ బిందేదో
ఖాడూవోమ డోళియా భలో/ బాజూ బిందేదో
సింగేన సింకడి ఖ్యాలే /బాజూ బిందేదో తపాళీన
చారియా ఖ్యాలే/ బాజూ బిందేదో కారభారిరో
ఖాట భలో /బాజూ బిందేదో ఖాడూవోమ సాండియా
భలో/ బాజా విందేదో బ్యాలే బాపూరో
సాండియా భలో/ బాజూ బిందేదో పాండియాన నారళ
పొడే/ బాజూ బిందేదో సాండియాన

సింకడి ఖ్వలే బాజూ /బిందేదో తపాలిన చాందియా
ఖ్వలే బాజూ/ బిందేదో బగూవోరో ఖాడూ
భలో /బాజూ బిందేదో ఖారూవోమ డోళియా భలో/
బాజూ బిందేదో దోళియాన కాయి ఖ్వలే
/బాజూ బిందేదో తపాళీన చాందియా ఖ్వలే/ బాజూ
బిందేదో సింగేన సింకడి ఖ్వలే/బాజూ బిందేదో''

**భావం :** బాలాజీ దేవుని అవుల మందలో ఆంబోతు ఉన్నది. దాని సుదురుకు చెందియా అనే అలంకరణ వస్త్రం కొమ్ములకు బంగారపు తాపడాలు తమ ఇష్ట దైవమైన శ్రీవేంకటేశ్వరస్వామికి ఆవులనుండ ఉన్నదని, ఆ మందలో ఉన్న ఆంబోతును అలంకరించిన లంబాడీలు తనుకు ఆవులు ఎంత ప్రీతి పాత్రమైనవో ఈ పాట ద్వారా తెలియజేస్తున్నారు. అలాగే తమ స్థానిక దేవుడు, తండా కారభారి, తమ అన్నయ్యలు ఆవుల మందలకు కూడా అవే అంశాలను జోడిస్తూ పాటలు పాడుతున్నారు..

**గేయం :**

''కనియానో కనమన జోదరే తూ/హెూరిలో నాచేన
హెరీరిలో హూంస్ కనియావో
మళానో భలాయోరే తూ/ హెూలో నాచేన హెరీదిలో
హూంస్ కనియానో శీతలా పూజాయోరే
తూ హెూరిలో నాలేన హెరీరిలో హూంస్ కనియావో
కూకదో కటాయోరే తూ/ కనియానో
బకరా కటాయోరే తూ/ కనియానో యాదిపూన
కుషాల కరాయోరే తూ / హెరీరిలో నాచేన
హెరీరిలో హూంస్''

**భావం :** ఓ కనియా! మాకు నాట్యం చేసి ఆనందించేందుకు అవకాశం ఇచ్చావు. నీవు శీతలా పండుగ చేయించావు కోళ్ళను, మేకలను కోయించావు నీవు తీజ్ పండుగ చేయించావు. కీజ్ బుట్టలను అల్లించావు.. ఆ బుట్టలలో గోధుమలు చల్లించావు. జడవాళ్ళ గుంపును పిలిపించావు. ఆ తీజ్ బుట్టల కోసం మంచె పెట్టించావు అమ్మాఇుల గుంపుతో నాట్యం చేయించావు. ఆ నాట్యంతో అందరు ఆనందించేటట్టు చేశావు. ఈ గేయంలో కనియాను ప్రతీకగా చూషిస్తూ శీతలా, తీజ్ సండుగల సమయంలో ఎలా ఆనందిస్తారో రమణీయంగా వర్ణించబడినది.

''గదలే గరణేన వాజళ మేల హెలి / ఛీజేన ధరతి
చూలవే / మారే భూరియా మేల హెలి
/ జే ధరతి చలచేడి / మారే హాయిసలేవడ దరన
మేల హెలి.. / భీంజేన ధరతి చూంచేది
/ మారే కారభారి వర వరస మేల పోలి / భీంజేన
ధరతి చూంచేది / మారే నాయేకే వర
వరస మేల హెలి / భీంజేన ధరతి చూ%శీ%బేడి /
మారే శీతలా పద వరస మేల హెలి/ ఛీజేన
ధరతి చూంచేది ''

**భావం :** ఆకాశంలో మెరుపు మెరిసి నిండుగా మబ్బులు కమ్ముకొని, భూమి తదవడానికి సిద్ధంగా ఉన్నది. నా ముక్కు పోగు (భూరియా) మీద వర్షం పడడానికి నా మెడ కంటే (వాంసలో) మీద వర్షం పడడానికి, నా తండా కార్యదర్శి(కార్బారి) మీద వర్షం పడడానికి, నా తండా నాయేక్ మీద వర్షం పడడానికి నా శీతలా మీద నర్షం పదడానికి భూమి తడిసిపోయింది.

ఇలా పాటలు అయిపోయిన తరువాత అందరు కలిసి భవానిలకు మ్రొక్కుతారు.

''యా యాడి సాతి భవాని / శీతలా యాడి సాయినేస్
/ సరే దార్ తార్ బోల్ / తోన
పూలదాయేచ యాడ్ / గావ గోదార్ సాయివేస్ /
కూంట ముంగరీర్ సాయివేస్ / గానది
గోదార్ బాబా హజాద్ కోస్ టాకేస్ /సాయి వేసి సవాయి
రకాడేస్ మారి యాడి శాపణి%డనబశీబీ

**భావం :** అమ్మా తల్లి సంవత్సరంలో మొదటి పూజ నీకు ఇస్తున్నాం. పశువులను చీడ పీడల నుండి కాపాడి మమ్మల్ని దీవించు తల్లి అని ప్రార్ధించిన తరువాత నైవేద్యం, వండిన మాంసాన్ని అందరికి పంచి పెడతారు ఆ తరువాత ఏపిడి మాంసపు పోగులు వాళ్ళు తీసుకొని వండుకొని తిది తాగి ఎవరి ఇళ్ళకు వారు చేరుకుంటారు.

ఈ విధంగా బంజారా గేయాలలో తీజ్ పండుగ, శీతల పండుగ గేయాలకు విశిష్టమైన స్థానం ఉంది. బంజారాలు ఆయా కాలాలలో సంప్రదాయ దుస్తులు ధరించి నృత్యం ఆడుతూ గేయాలను పాడుతూ ఈ

పండుగను జరుపుకుంటారు. ఇలా వారి సంస్కృతికి ప్రతిబింబంగా ఈ సాంస్కృతిక కార్యక్రమాలు సాగిస్తూ తమ అస్తిత్వాన్ని ప్రకటిస్తారు బంజారాలు. ఈ మొత్తం ప్రక్రియలో వారి గేయాలు ప్రముఖ పాత్ర పోషిస్తూ వైవిధ్యాన్ని వ్యక్తం చేస్తాయి. ఇంత వైశిష్ట్యాన్ని కలిగిన బంజారా గేయాలను పరిరక్షించు కోవాల్సిన ఆవశ్యకత ఉంది.

**ఉపయుక్త గ్రంథ సూచి :**

1. రామరాజు బి.- జానపద గేయ సాహిత్యము
2. సుబ్రమణ్య శాస్త్రి వేదుల - జానపద గేయ సాహిత్య ప్రభ
3. శంకరయ్య జె. - తెలుగు లంబాడీల గేయ సాహిత్యము

**గేయాలు పాడినవారు :**

1. రూప్లి, వయస్సు 55 సం॥లు, ఎం. కంబాయి తండా, చౌటప్పల్ మండలం, యాదాద్రి భువనగిరి జిల్లా.
2. ముదావత్ ఇజ్జిబాయి, వయస్సు 62 సం॥లు , ఏ టి బి తండా, భువనగిరి మండలం, యాదాద్రి భువనగిరి జిల్లా .
3. పోరి బాయి, 61 సం॥లు, శివలాల్ తండా, ఆలేరు మండలం, యాదాద్రి భువనగిరి జిల్లా.

★★★

# జానపదం - పాటలు

- పి. బాలముని శివకుమార్, పరిశోధక విద్యార్థి, రాజధాని కళాశాల, చెన్నై.

**ఉపోద్ఘాతము :**

పల్లె వాతావరణం ప్రపంచ వాతావరణమునకు మూలం. పల్లెటూరిలో నివాసముండడం, జానపదులతో సాన్నిహిత్యం వల్ల జానపద సాహిత్యంపై మక్కువ ఏర్పడింది. జానపద సాహిత్యంపై పరిశోధన చేయాలనే అభిలాష కలిగింది. ఫలితంగా తిరుపతి జిల్లా, శ్రీకాళహస్తి మండలం జానపద గేయ సాహిత్యంపై ఈ పరిశోధనా పత్రం రూపొందింది.

**పరిచయం :**

పూర్వకాలంలో ప్రజలు నివసించే ప్రాంతాలలను "జనపదాలు" అనేవారు. ఈ జనపదాలలో ప్రజలు మాట్లాడే భాషను "జానపదం" అన్నారు. "జానపదము" అనగా జనపదానికి సంబంధించినది. దీనినే "పల్లెటూరు" అంటారు. జన అంటే జనులు (లేదా) మనుషులు, పదం అంటే ప్రదేశం (లేదా) స్థలం అని అర్థం. జనపదంలో నివసించే వారిని "జనపదులు" అంటారు. వీరు వాడే పదాలను "జానపదాలు అని, ఈ జానపదులు పాడుకునే పాటలను జానపద గేయాలు అని అంటారు. వీటినే ఆంగ్లంలో ఫోక్‌సాంగ్స్ అని అంటారు. జానపద గేయాలు పురాతన కాలం నుండి ఉన్నాయి. ఆశ్చర్యకరమైన విషయం ఏమంటే ఈ జానపదుల గేయాలలో మంచి ప్రాసలు, చక్కని ఛందస్సు ఉంటుంది.

ఆదిమానవుని కాలంలో మనిషి ఒంటరిగా జీవించిన తర్వాత మనిషి సంఘజీవిగా ఏర్పడినాడు. ఇలా సంఘజీవిగా ఏర్పడడానికి పూర్వం కుటుంబ వ్యవస్థ ఏర్పడి, కొన్ని కుటుంబాలు కలసి ఒక ప్రాంతంలో తమ నివాసాన్ని ఏర్పాటు చేసుకొనేవి. అలా ఏర్పడిన ప్రాంతాలనే "జనపదాలు"గా పిలువబడేవి. ఈ జనపదాలు తెలుగు సాహిత్యానికి కేంద్ర బిందువులు.

**అజ్ఞాత కర్తృత్వం :**

ఏ భాషలో అయిన మొట్టమొదటగా జానపద సాహిత్యమే పుడుతుంది. జానపద సాహిత్యం శిష్ట సాహిత్యానికి భిన్నమైనది. ఇది మౌఖిక సాహిత్యం. అంటే ముఖసంగతిగా ప్రాచుర్యం పొందింది. జానపద సాహిత్యానికి కర్తృత్వం అజ్ఞాతమైనది. ఎందువలనంటే జానపదాలను రచించిన వారి పేరు ఎక్కడా ఉండదు. ఒక తరం నుండి మరో తరానికి మాటలు, పాటల ద్వారా వ్యాప్తి చెందింది. ఆ తరువాతనే లిఖిత సాహిత్యం వెలువడింది. దీనినే పల్లెవాసుల లేదా గ్రామీణ సాహిత్యం అంటారు. కావున పల్లెల నుండి సామాన్యుల ద్వారా పుట్టిందే జానపద సాహిత్యం.

**పరిశోధన :**

జానపద సాహిత్యాన్ని సేకరించి దానిపై పరిశోధన చేసిన వారిలో ముఖ్యులు :

- మొట్టమొదట జానపద గేయ సాహిత్యం పరిశోధన చేసిన వారు ఆచార్య బిరుదురాజు రామరాజు.
- జానపద గేయ వాఙ్మయ పరిచయం ను హరి ఆదిశేషువు గారు రచించారు.
- స్త్రీల రామాయణపు పాటలను "కృష్ణశ్రీ" శ్రీపాద గోపాల కృష్ణమూర్తి సేకరించి, ప్రచురించారు.
- నాయని కృష్ణకుమారి జానపద కథా గేయాలపై పరిశోధన చేశారు.
- రావి నూతల ప్రేమలత తెలుగు జానపద సాహిత్యం పురాణగాధలు వెలువరించారు.
- బి. రామరాజు, దొణప్పల ఆధ్వర్యంలో త్రివేణి అనే జానపద గేయ సంకలనం వెలువరించారు.
- పాడుపు కథలపై కసిరెడ్డి వెంకటరెడ్డి పరిశోధన చేశారు.
- జీ.వి.యన్. మోహన్ "జానపద విజ్ఞాన అధ్యయనం" అనే పుస్తకం ప్రచురించారు.

**జానపద వాఙ్మయంలో ఉన్న ముఖ్యమైన భాగాలు:**

- జానపద గేయాలు
- జానపద కళారూపాలు
- జానపద కథలు
- "సామెతలు, జాతీయాలు, పొడుపు కథలు

**జనపద గేయాలు :**

జానపద సాహిత్యంలో జానపద గేయాలు ఒక భాగం. జానపద గేయాలకు పల్లెసీమలు ఆటపట్టు. పనిపాటలు చేసేటప్పుడు శ్రమ ఉపశమనానికి, పనిలో బరువు, ఒత్తిడి తెలియకుండా వుండడానికి పాడే పాటలు. వేడుకలు, వినోదాలలో జానపదుల రాగాలు వినసొంపుగా వుంటాయి. జానపదుల కష్టసుఖాలు, సాంప్రదాయాలు, భక్తిభావాలు, కుటుంబ బంధాలు, పట్టువిడుపులు ఇలా అనేకం జానపదుల జీవితంలో పాటలరూపంలో ఇమిడి ఉంటాయి.

జానపదుల తిండితిప్పలు, వంటవార్పు, ఆటపాట, పెళ్ళి పేరంటాలు, నగానట్రా, చీర సారె, పండుగలు, జాతరలు, ఉత్సవాలు జానపదుల గేయాలలో కని పిస్తాయి. బిరుదురాజు రామరాజు జానపదగేయాలను పిల్లల పాటలు స్త్రీల పాటలు, వేడుక పాటలు, శ్రామికుల పాటలుగా విభజించారు. ఇందులో భాష సరళంగా, విసర్గంగా ఉంటుంది. జానపదుల జీవితాలు సంస్కృతితో ముడిపడి ఉంటాయి. ఈ పాటలు ఒకరినుండి మరొకరికి మౌఖికంగా వ్యాపించాయి రాత ద్వారా కాదు. జానపదుల గేయాలు లోకజ్ఞానానికి, సమిష్టితత్వానికి, మనోవికాసానికి తోడ్పడుతుంది. "జ్ఞానపద విజ్ఞానం" అనే గ్రంథంలో ఆర్.వి యస్. సుందరం ఎన్నో జానపద వాఙ్మయ విశేషా లను వివరించారు.

జానపదులు పండుగలకు, ఉత్సవాలకు, జాతరలకు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తారు. ముఖ్యంగా సంక్రాంతి పండుగ సందర్భంగా ఆడపిల్లలు పాడే గొబ్బిపాటలు, జాతరలలో పాడే అమ్మవారి పాటలు, ఉత్సవాలలో ఆడి పాడే భజన, కోలాటం పాటలు వినడానికి, చూడటానికి ఎంతో విజ్ఞానాన్ని, వినోదాన్ని అందిస్తాయి. అటువంటి జానపదుల పాటలు కొన్ని ఇప్పుడు చూద్దా!

**కోలాటం పాట :**

ప్రదర్శనకు యోగ్యమైన జానపద కళారూపాల్లో కోలాటం ఒకటి. 'కోలాలు' అనే పదానికి కోలంఆట' అనేది వ్యుత్పత్తి. తమిళంలో కోలంఅట్టం = కోలాటం అనేది వ్యుత్పత్తి. 'కోల' అనే పదానికి చేతికర్ర, బెత్తం, చెరకు గడ, దండం, పుల్ల, పడక అనే అర్థాలు. సూర్యరాయాంధ నిఘంటువులలో చెప్పబడ్డాయి. 'ఆట' అంటే నటనం, నర్తనం, నృత్యం, నాట్యం, లాస్యం అనే అర్థాలున్నాయి. 'కోలాటం' అంటే కర్రపుల్లలతో చేసే నర్తనం అని అర్థం వస్తుంది.

**ఉదాహరణ :** తలపెట్టిన కార్యం నిర్విఘ్నంగా సాగ డానికి విఘ్నేశ్వరుడిని వేడుకోవడం భారతీయులకు పరిపాటి. జానపదులు ఏ కళారూపాన్ని ప్రదర్శించాలన్నా ముందు వినాయకుడ్ని పూజించి ప్రార్థించిన తర్వాతే మిగిలిన పాటల్ని పాడుతారు. శివకుమారుడైన విఘ్నరాజును వేడుకొన్న ఈ కోలాలు పాటలో జానపదుల అచంచల భక్తి సర్వమానవ సమానత్వం గోచరిస్తుంది.

గాణాన్నాథా ఇగ్గన గాణన్నాథా
ముప్వలింగా రాజ క్రిష్ణా గాణన్నాథా
బాపానోళ్ళూ నిన్నూ గొల్వా గాణన్నాథా
నిను బ్రమ్మా దేవుడందూరయ్యా గాణన్నాథా
కోమాటోళ్ళు నిన్నూ గొల్వా గాణన్నాథా
నిన్ను కోటివేల్పూరందురయ్యా గాణన్నాథా
సాకలోళ్ళు నిన్నూ గొల్వా గాణన్నాథా
నిన్ను సాకీబండావందరుయ్యా గాణన్నాథా
గొల్లావాళ్ళూ నిన్నూ గొల్వా గాణన్నాధా
నిన్ను గొర్లాదొరడందూరయ్యా గాణన్నాథా
ఒడ్డీ వాళ్లూ నిన్నూ గొల్వా గాణన్నాథా
నిన్ను దొడ్డాదేవుడందూరయ్యా గాణన్నాథా

**గొబ్బి పాట :**

గర్వా శబ్దభవము "గొబ్బి" అని ఆచార్య తూమాటి దొణప్ప అభిప్రాయం. కొంతమంది స్త్రీలు ఒక జల్లెడలో గాని, దబ్బలతో అల్లిన తట్టలోగాని ఆవుపేడ ముద్దనో

లేక పసుపు ముద్దనో పెట్టి, గురివిందగింజలతో కళ్ళు, చిక్కుడు పూతతో ముక్కు. నోరు, చెవులు ఏర్పాటు చేసి, చెవులకు కమ్మలు పెట్టి, పసుపు కుంకుమలు పెట్టి అలంకరిస్తారు. బొమ్మ తలమీద గుమ్మడి పూలతో గాని లేదా కస్తూరి పూలతో గాని అలంకరిస్తారు. దాన్నే 'గొబ్బెమ్మ' అంటారు.

**ఉదాహరణ** : ఒక వ్యక్తికి ఇద్దరు భార్యలుండడం సమంజసం కాదు. కాబట్టి భిక్షాటన చేసే శివునికి మాత్రం ఇద్దరు భార్యలుండడం సమంజసం కాదని గంగను విడిచి పెట్టమని అడగటం కింది పాటలో గమనించ వచ్చును.

గొబ్బియల్లో ఇక్కి దాసరి కూర ఈ బావి నీళ్ళు
ఈశ్వరా నీకేల ఇద్దరు భార్యలు
ఇద్దరిలో ఒకర్ని విడనాడ రాద
జ్ఞాన నిడుస్తును గాని గంగను విడువను
పారేస్తానన్నది పార్వతిని గంగు
ఇద్దరి పోరు పడలేక శివుడు
శివుడుపోయెనె అడవుల మీదకు
గొబ్బియల్లో అడవుల మీద శివుడు పక్షి అయినే
నల్ల రోకళ్ళ మిద రాచిలుక వాలే
రాచిలుక పేరేమి? రాజు పేరేమి?
రాచిలుక జ్ఞానమ్మ రాజు కాళ్ళప్ప
కూర్చి ముత్యమ్మ కొడుకు కుమారస్వామి.

**గంగమ్మ పాట :**

గణ గణ డప్పులు మోగని గంగమ్మ
జల జల వర్షాలు పారని గంగమ్మ
నీతోటే మేమమ్మ మాతోటే నువ్వమ్మ
నుయాడుంటే ఆడే మాకు జాతరమ్మ
పొంగల్లు పెట్టేము గంగమ్మ
పొట్టేళ్ళు తెచ్చాము గంగమ్మ
మా ఇల్లే నీ ఇల్లు చూడమ్మా
నీ ఇల్లే ఈ ఇలలు రావమ్మా
నుయాడుంటే ఆడే మాకు జాతరమ్మ
పసుపు కుంకుమ ఇచ్చేము నీకమ్మా
చీర రవిక సారె నీకమ్మా
పూలు గాజులు వేసెము గంగమ్మ
అంబళ్ళు పోసేము మాయమ్మ

**ముగింపు :**

పై విధంగా జానపదుల సాహిత్యంలో పలురకాలైన పాటలు పాడుకొంటారు. ఈ జానపద పాటలన్నింటిలోను సామాజిక జీవితానికి సంబంధించిన అన్ని కన్పిస్తాయి. ఎక్కువగా శృంగార, హాస్య, భక్తి గేయాలే జానపదాలలో చోటు చేసుకుంటాయి. ఆంధ్రదేశంలో ఎక్కువ ప్రచారంలో ఉన్న ఈ జానపద కళారూపం వినోదాన్ని, విజ్ఞానాన్ని, మానసిక ఆనందాన్ని, శారీరక వ్యాయామాన్ని కూడా చేకూరుస్తుందనడంలో సందేహం లేదు.

**ఉపయుక్త గ్రంథాలు :**

(1) జానపద గేయ వాఙ్మయం పరిచయం - ఆదిశేషువు, హరి.
(2) జానపద గేయాలు - గంగప్ప. యస్.
(3) జానపద కళాసంపద - దొణప్ప. తూమాటి
(4) చిత్తూరు జిల్లా కోలాటం పాటలు - శ్రీనివాసులు రెడ్డి. పేట.
(5) తెలుగు జానపద గేయ సాహిత్యం - రామరాజు. బిరుదురాజు.
(6) వ్యాస మాలిక - మునిరత్నం. కె.

★★★

# రాయలసీమ రచయిత్రుల కథల్లోని పాత్ర చిత్రణ

– కోడూరు జయప్రకాష్, పరిశోధక విద్యార్థి, తెలుగు అధ్యయనశాఖ, శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం, తిరుపతి.

తెలుగు సాహిత్యం లో నేడు రకరకాల ప్రక్రియలు వస్తున్నప్పటికి కథల ప్రాముఖ్యం ఏ మాత్రమూ తగ్గిపోలేదు ఎందుకంటే కథా ప్రక్రియ అనేది చాలా ప్రాచీన కాలం నుండి వస్తోంది. అయినప్పటికి మారుతున్న కాలానికి అనుగుణం గా కథలూ మారుతూ వస్తున్నాయి. అయితే అప్పటికి ఇప్పటికీ కథలో చాలా ముఖ్యమైంది పాత్రచిత్రణ పాత్రచిత్రణ అంటే పాత్రల స్వరూపం, లక్షణం.

పాత్రచిత్రణ వల్ల కథకు పరిపూర్ణ రూపం వస్తుంది. కథకు ముఖ్యం పాత్రలు. పాత్రలు ఎటువంటివైనా, ఎలా ఉన్నా వాటివల్లే కథ మొదలై ముగుస్తుంది. రచయిత చెప్పదలచుకొన్న విషయాన్ని పాఠకునికి లేదా సమాజానికి నేరుగా చెబితే పట్టించుకోరు. అలా కాకుండా ఒక కథలో ఒక పాత్ర లేదా పాత్రలతో చెబుతే అవి పాఠకుని గుండెకు హత్తుకొనిపోతాయి. తద్వారా. ఆలోచించ గలుగుతారు. ఇలా రచయిత లేదా రచయిత్రి సమాజానికి చెప్పాల్సిన విషయాన్ని కథలోని పాత్రల ద్వారా వివరంగా చెప్పగలరు. కథలో ఏదో ఒక పాత్ర ఆ కథకు మూలాధారం అవుతూ.. మిగిలిన పాత్రలన్ని ఆముఖ్య మైన పాత్ర చుట్టూ తిరుగుతూ, ఆ పాత్రకు సహాయం చేసేవిగా ఉంటాయి.

రచయితకూ పాత్రకు ఉన్న సంబంధాన్ని తెలుపుతూ ఎలిజిబెత్ బోలెన్ - 'రచయిత పాత్రల్ని సృష్టించడు, వాటిని వెదికి పట్టుకుంటాడు. ఒక రకంగా చూస్తే అది పరిసరాల ప్రభావం తో రచయిత మనస్సులో రూపుదిద్దు కుంటాయి. అవి మసక వెలుతురులో ఎదుటి బెంచీ మీద కూర్చొని తమను గురించి తాము రచయితకి చెప్పుకొనే సహ ప్రయాణీకుల వంటివి' అని అంటాడు.

పాత్రచిత్రణ ప్రాముఖ్యాన్ని శ్రీవిహారి, శాలివాహన ఆధునిక కథా రచనల్లో పాత్ర సృష్టికి శ్రద్ధ పెరిగింది. పాత్ర యొక్క వ్యక్తిత్వ నిరూపణకు ప్రాముఖ్య పెరిగింది. దీనితో పాటు తాను నివసిస్తున్న సమాజంలోని కొన్ని విచిత్రమైన పరిస్థితులు, కొందరి విలక్షణమైన మతాన్ని కథల్లో ప్రస్ఫుటీకరించడానికి రచయిత ప్రయత్నిస్తున్నాడు అని అంటాడు.

కథలలోని పాత్రలకు, సమాజంలోని వ్యక్తులకు ఏమాత్రం తేడా ఉండదు. సమాజం లోని వ్యక్తుల మనస్తత్వాలను బట్టి అవి పాత్రలుగా రచించబడతాయి. పాత్రల విషయంలో, పేర్ల విషయంలో సన్నివేశాల్లో కూడా చిన్న కథ జీవితానికి అతి దగ్గరగా ఉండాలి.

రాయలసీమ రచయిత్రుల కథల్లో పాత్ర చిత్రణకు ఎంతో ప్రాముఖ్యాన్ని ఇచ్చింది. రచయిత్రి కథలలో సమాజంలోని వ్యక్తులను, మనస్తత్వాలను పాత్రలుగా మలచి జీవం పోసింది. ఈ కథలలోని పాత్రలు కొన్ని మనతో నేరుగా సంభాషిస్తున్నట్లు గా, మరికొన్ని ప్రత్యక్షంగా చూస్తున్నట్లుగా అనుభూతిని కలిగిస్తాయి. కథల్లోని పాత్రలు ఆసక్తిగా చదివిస్తాయి. ఆలోచనలు రేకెత్తిస్తాయి. కన్నీరు పెట్టిస్తాయి. మనస్సును కుదిపేస్తాయి. ఆలోచింపచేస్తాయి. ఆచరించేలా చేస్తాయి.

రాయలసీమ రచయిత్రుల కథల్లోని పాత్రల్ని కింది విధంగా విభజించాను 1) స్త్రీ పాత్రలు 2) పురుష పాత్రలు 3) పిల్లల పాత్రలు 4) పశుపక్షాదుల పాత్రలుగా విభజించాను.

## స్త్రీ పాత్రలు :

రాయలసీమ రచయిత్రుల కథల్లో అనేక స్త్రీ పాత్రలు పేర్కొనబడి ఉన్నాయి. రాయలసీను స్త్రీలకు ఎంతో ప్రాధాన్యముంది. స్త్రీ మూర్తి లేని కథల్ని ఊహించడం కష్టం. అమ్మకాని అక్కగా, చెల్లిగా, వదినగా, అత్తగా, భార్యగా స్త్రీకి ఎనలేని ప్రాధాన్యముంది. సుఖ దుఃఖాలు లాగే మంచిచెడులు కూడా సాధారణం. రాయలసీను రచయిత్రుల కథల్లో మంచి పాత్రలు, చెడు పాత్రలు కూడా చోటు చేసుకొని ఉండడం గమనార్హం. స్త్రీ పాత్రలను కింది విధంగా విభజించడం జరిగింది.

**ఆదర్శ పాత్రలు :**

స్నేహితుల పాత్రలు
గృహిణి పాత్రలు
నీచ పాత్రలు
ఉద్యోగస్థుల పాత్రలు
సంప్రదాయ పాత్రలు

**ఆదర్శ పాత్రలు :**

సమాజంలో మంచి చెదులుంటాయి. అలాగే మనుషుల్లో ఉన్నట్టే కథల్లో కూడా మంచి చెడులు ఉంటాయి. మంచి స్త్రీ పాత్రలు, చెడు స్త్రీ పాత్రలు ఉంటాయి.

**బూబమ్మ :**

కువైట్ రైలు కథలో రచయిత్ర విష్ణుప్రియ చిత్రించిన పాత్ర బూబమ్మ. బూబమ్మది చిత్తూరు జిల్లా భాకరాపేట దగ్గర తురక పల్లె గ్రామం. వయస్సు ముప్పై సంవత్సరాలు ఉం డవచ్చు. కానీ బారీ ఆకారం కలిగిన స్త్రీ ఆమె కొడితే ఇద్దరు మనుషులు పైకి లేయకుండా పడిపోతారు. భర్త మంచి వాడు. ఇద్దరు మగ పిల్లలు ఒక ఆడపిల్ల ఉన్నారు. ఆడ పిల్ల పెద్ద మనిషి అయిన వెంటనే పెళ్ళి చేసినట్లు వంటి వ్యక్తి. ముప్పైవేలు అప్పు చేసింది. చేసిన అప్పు తీర్చడానికి, మగ పిల్లల కోసం డబ్బు సంపాదించు కోవడం కోసం. కువైట్ కు వెళ్ళడానికి సిద్దపడినటు వ్యక్తి బూబమ్మ.

బూబమ్మ కువైట్ ఇంట్లో పని చేసే దానికి వెళ్ళింది కువైట్లో తెల్లవారి లేచినప్పటి నుండి రాత్రి ఒకటి, రెండు వరకూ పని చేయడం వల్ల ఒక నెల వరకు ఆరోగ్యం బాగుండిన తర్వాత తలనొప్పి, కండ్లు లాగేవి డాక్టర్ దగ్గరకు కూడా తీసుకు పోలేదని చాల బాధపడింది బూబమ్మ. తన ఆరోగ్యం బాగా లేదని టీ అప్పు చేసిన డబ్బు పంపిస్తాదని భర్త ఆశగా ఎదురు చూస్తుంటాడు అని ఆరోగ్యం భాగ లేకున్నా చేసేది. కువైట్లో చాలా కష్టాలు పడి ఎంబసీ వాళ్ళ కాళ్ళు పట్టుకొని మూడు రోజులు కంటిమీద కునుకు లేకుండా. లైన్లో నిలబడి ఇండియా గవర్నమెంట్ టికెట్లతో ఇండియాకు వచ్చేస్తుంది. తొమ్మిది నెలలు పని చేసినా ఒక పైసా జీతం తీసుకోనందుకు బాధపడినా ప్రాణంతో ఇండియాకు వచ్చినంద కు కొంచెం సంతోష పడింది. ఎంబసీలో పరిచయమైన రత్నక్క తనకు అనారోగ్యంగా ఉన్నా తల్లి లాగా భాగా చూసుకొన్నదని రైలు ప్రయాణంలో అందరికి గొప్పగా చెప్పింది.

**రత్నమ్మ :**

కువైట్ రైలు కథలో రచయిత్రి విష్ణుప్రియ చిత్రించిన పాత్ర రత్నమ్మ. రత్నమ్మ పూర్తి పేరు సుబ్బరత్న ఊరు తిరుపతి. భర్త శ్రీనివాసులు. భర్త మోపెడ్ ప్యాక్టరీలో పిట్టర్ గా పని చేస్తున్నారు. ఆయన పని చేస్తున్నంత వరకు వారి జీవితం బాగుండేది. ప్యాక్టరీ లో మూత పడిన తర్వాత వారి జీవితం ఇబ్బందిగా మారింది. రాజంపేట కు చెందిన రుప్పిని ఆమె వైట్లో పని చేస్తునాందని అక్కడికి నువ్వు వెళ్ళితే బాగా సంపాదించు కోవచ్చుని ఆశ చూపించే సరికి రుప్పిని భర్త దగ్గర నుండికి ఐదు రూపాయలు వడ్డీ చొప్పున ఇరవై ఐదు వేలు వడ్డీకి తీసుకొని కువైట్కు వెళ్ళింది.

కువైట్లో నెలకు నలభై వేల గల పని కుదిరింది. సెతాని చాలా చెడ్డది అని తెలుసుకొంది. కువైటిలో చాలా కష్టాలు పడింది. సెతాని ఇంట్లో పనులు అన్ని చేయించుకొని సరిగా అన్నం కూడా పెట్టెది కాదని. చాలా భాదపడింది. ఇలా కొన్ని రోజులకు ఇండియాకి తిరిగి వస్తుంది.

రెండోసారి కువైట్కు తన బిడ్డల కోసం అని వెళ్ళింది. తన స్నేహితురాలు పంపిన విసా సాయంతో కువైట్ చేరింది. రెండోసారి కువైట్ వచ్చిన వెంటనే సెతాని తన పాస్పోర్ట్ లాక్కుంది. తెల్లవారి లేచి రాత్రి వరకు చాలా పనులు చేసేది. చాలా కష్టాలు అనుభవించి రుప్పిని భర్త దగ్గర తీసుకొన్న డబ్బు తిరిగి చెల్లించింది.

పైన వివరించిన రాయలసీమ రచయిత్రుల కథల్లో స్త్రీ పాత్రలు మంచి పాత్రులు గా ఇలాగే 'అనురాగ సంగమం' గాజుకళ్ళు మొదలయిన కథల్లో పాత్రలు ఉన్నాయి.

**స్నేహితుల పాత్రలు :**

రాయలసీమ రచయిత్రుల కథల్లో స్నేహితుల

పాత్రలు. ఉన్నాయి. 'భాస్కర బాలభారతి' రాసిన 'తనదాకా వస్తే' కథలో పాత్ర ఉదాహరణ.

**ప్రవీణ :**

తనదాకావస్తే కథలో ప్రవీణ స్నేహితురాళ్ళు ఉమ, శిరిష, కల్పన, రేష్మా వీళ్ళంతా ప్రవీణ తో కలిసి అమ్మాయిల హాస్టల్లో ఉంటారు. వీరందరూ ఒకే గదిలో ఉంటారు. ప్రవీణ ఒంటరిగా, మానంగా ఉండటాన్ని మిత్రులందరూ గమనించారు. తను ఇన్ఫిరియారిటి కాంప్లెక్స్ తో బాధపడుతున్నదని గ్రహించారు. ప్రవీణను ఎలాగైన మార్చాలని ఉద్దేశంతో ఆమెకు తెలియకుండానే ఒక మగ స్నేహితుడు గా ఎంతో అందంగా అందాన్ని వర్ణిస్తూ ఉత్తరం రాశారు ప్రవీణ కు స్నేహితులు. స్నేహితులు. అందరు తనకు ఉత్తరం వచ్చింది అని ప్రవీణకుచెప్పి వారందరు కాలేజీ కి వెళ్ళారు. ఆ ఉత్తరం చదివి మారిపోయిన ప్రవీణను చూసి ఆశ్చర్యపోయి ఆనందించారు. మిత్రులందరూ తమ ప్రవీణాళిక విజయవంత మైనందుకు అందరూ ఒకరినొకరు అభినందనలు చెప్పుకున్నారు.

ఇలా రాయలసీమ రచయిత్రుల కథల్లో రెండు సందర్భాలు, బాడీ సర్వీసింగ్, 'అనురాగ సంగమం మొదలైన కథల్లో స్నేహితులకు చెందిన పాత్రలు ఉన్నాయి.

**ముగింపు :**

రాయలసీము రచయిత్రుల కథల్లో పాత్రలను విభజన చేసి వివరించాను. ఇలానే మిగిలిన కథల్లో కూడా. స్త్రీల పాత్రలు, పురుష పాత్రలు, పిల్లల పాత్రలు, లుగా విభజన చేసి రాసుకున్నాను. మిగిలిన ఎవరి విలువ నాన్న, జవాబు లేని ప్రశ్న, రెక్కలున్న పిల్ల కాళీయంత్ర, నల్లడబ్బు, ఒక పక్షి కథ, నీళ్ళు, మచ్చ, తపన అనురాగ సంగమం, మరణవాగ్మూలం, తీరనిదుఃఖం పోను పిలిచింది. సిలుకుజిబ్బా, లాటిట్యూడ్, అటరూం నా, ఎంగిలాకు, చిన్నబోయిన ఆకాశం, జాతస్యవ మరణం, మబ్బులు తొలగిన ఆకాశం, రేపటి కిరణం, గతేలమ్మ, బాడీసర్వీసింగ్ తనదాకావస్తే, కువైట్రైలు జ్ఞాపిక, గాజుకళ్ళు, మన్ను లోమన్నునై, తాజ్‌మహల్ తారాబాయి తాజ్మహల్, ఆ గమ్మంఎక్కడితో, వెన్నెల్లో చీకటి మరకులు, స్టేషనుకు రండి, ది మెర్సి కిల్లింగ్, నీ గుండె కార్చిన కన్నీళ్ళు సమ్మె, బ్రిడ్జికింద్ర, ఎవరివిలువలునాన్న , జవాబు లేనిప్రశ్న మొదలయిన రాయలసీమ రచయిత్రుల కథలులో ప్రతికథలో పాత్రలును నేను వర్గీకరించు కొని రాసుకున్నాను.

**ఆధార గ్రంథాలు :**

1. కథాశిల్పం - వల్లంపాటి వెంకట సుబ్బయ్య
2. తెలుగు కథలు - కథన రీతులు - సింగమనేని నారాయణ
3. మన నవలలు - మన కథానికలు - రాచపాళెం చంద్రశేఖర్ రెడ్డి
4. సాహిత్యంలో దృక్పథాలు - ఆర్.ఎస్. సుదర్శనం.

★★★

# గిరిజన జీవన విధానంలో సామెతలు

- వి. యల్. నరసింహారావు, పరిశోధక విద్యార్థి, తెలుగు విభాగం, ఉస్మానియా విశ్వవిద్యాలయం, హైదరాబాద్.

ప్రతి జాతి జీవితంలో సామెతలు ప్రత్యేక స్థానాన్ని పొందుతాయి. సామెతలను సందర్భానుసారంగా మాటల రూపంలో వాడుతూ ఉంటారు. ఒక్కొక్క సామెత వెనుక ఒక్కొక్క పరిపూర్ణ జీవిత సత్యమే దాగి ఉంటుంది. ప్రతి మనిషి తన నిత్యజీవితంలో సుఖదుఃఖాల రెండింటిని సమానంగా అనుభవిస్తాడు. తాను అనుభవించిన దాన్ని ఇతరులకు ఉపదేశాత్మకంగా, సందేశ రూపంలో చిన్న వాక్యంలో అందిస్తాడు. సామెతలు అనుభవాల నుండి పుట్టినవి. సామెత అనేది పెద్దల అనుభవం పొదిగిన ముక్క అని కూడా చెప్పవచ్చు. ఆ అనుభవం కేవలం ఒక్కరిది మాత్రమే కాదు. జన సామాన్యులందరిది. సామెత కూర్పు మాత్రం ఒక్కరిదే కావచ్చు. ఒక సూక్తిని కట్టినంత మాత్రానికే అది సామెత అనిపించుకోదు. అది ప్రజామోదాన్ని పొంది జనజీవితంలో చలామణి కావాలి. ఒక సంపూర్ణ జీవన సారమంతా ఒకే వాక్యంలో ఇమిడి ఉంటుంది. సామెతల గురించి పలువురు సాహిత్య పరిశోధకులు పలు రకాల నిర్వచనాల్ని ఇచ్చారు. కీ.శే. డా. విశ్వనాథ సత్యనారాయణగారు "ఒక పండితార్థాన్ని కొద్ది మాటలలో చెబుతుంది సామెత" అని అన్నారు.

"సామెత- సాటవ అనునవి ఏకార్థమున ప్రయోగింప బడుచున్నవి. సాటి అయినవే సాటవ" అని కీ.శే. డా. దివాకర్ల వేంకటావధానిగారు పేర్కొన్నారు.

"సామెతలలో సమత ఉంటుంది. వాక్య నిర్మాణం రెండు దళాలుగా ఏర్పడి ప్రాసగాని, యతిగాని రెండును జత కలసికొని వుంటుంది. స్థూలంగా లోకోక్తికి, సామెతకు గల భేదం నిరూపించినా దాని విలక్షణత శాస్త్రబుద్ధికిగాని విభిన్నాలుగా తోపని పరిస్థితులు కూడా లేకపోలేదు. ఈ కారణాల వల్ల సామెత అనగా జన వ్యవహారంలో క్షుణ్ణమైన ఉక్తి అనే. అయితే ఇప్పటికి తృప్తి పడవచ్చు అనగా నలుగురి నోట పడి నలిగిన మాట అని అర్థం" అని శ్రీ సంపత్ రాఘవాచారిగారు నిర్వచించారు. సామెతలు నన్నయ భారత రచనకు పూర్వమే ఉన్నాయనీ శ్రీ సంపత్ రాఘవాచారిగారు సామెత అనేపదం మొదట 15వ శతాబ్దిలోని వరహపురాణంలో ప్రయోగింపబడిందని తెలిపారు.

సామెతల గురించి ఆరుద్రగారు ఇలా అన్నారు. "గతానుభవాన్ని దృష్టిలో ఉంచుకొని, వర్తమానాన్ని ఆలోచిస్తూ భవిష్యత్తునకు వర్తించునది సామెత" అని నిర్వచించారు.

సామెత అనే మాట సామ్యత నుండి పుట్టింది. సంస్కృతంలో సూక్తి అని సుభాషితమని ఆంగ్లంలో Proverb అని అంటారు. సామెత గురించి ఆచార్య జి.ఎస్. మోహన్ గారు ఇలా అన్నారు. సామెతలనగా "అల్పాక్షరాలలో అనల్పార్థ రచన" అనుభవాన్ని సూటిగా చెప్పడం. "Much matter in decoted into a few words" అని Thomas fuller నిర్వచించారు.

"A short popular saying that express effectively some complete truth of useful thought"అని Random House Diction- ary నిర్వచించింది. "Proverbs are the cream of a nation's thought "Anon మొ ॥ ఆంగ్లంలో నిర్వచించారు.

సామెతలు ఎప్పుడు పుట్టినాయో చెప్పటం చాలాకష్టం. రామాయణ కాలంనాటికే సామెతలు ప్రచారంలో ఉన్నట్లు "జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసీ" ఈ వాక్యం ద్వారా అర్థమవుతుంది. ఇరువురికి సంబంధించినవి కొన్ని సామెతలను పరిశీలిస్తే -

1) బెల్లం ఉన్నప్పుడే ఈగలు వాలుతాయి (గోళ్ రత్తోజో మాక్కీ వాళే)

మన దగ్గర సిరిసంపదలు ఉంటేనే బంధువులు, స్నేహితులు అందరూ చేరుతారు. అనే సందర్భంలో ప్రయోగిస్తారు.

2) బండిఎడ్లు ఒక్కటైతే గుట్ట ఎక్కవచ్చు.
బండి బళద్ ఏక్వతో గట్ల చడేవాసు.

అలాగే భార్యభర్తలు కలిసికట్టుగా ఉంటే ఎటువంటి సమస్యనైనా ఎదుర్కొనవచ్చు.

3) అత్తవి నాలుగు రోజులు, కోడలివి నాలుగు రోజులు
(సాసుర్ చార్దాడే బ్వాడిర్ చార్ దాడే)
ఏది ఎవరికి శాశ్వతం కాదు!

4) పెళ్ళి చేసి చూడు, ఇల్లుకట్టి చూడు
(ఘర్ బాంధన్ దేఖ్ వయకరణ్ దేఖ్)

పెళ్ళి చేయడం, ఇల్లు కట్టడం అనేవి కష్టంతో కూడుకున్నవి.

5) పేదోడి పెళ్ళాం అందరికొద్దినె
(గరిబెర్ గ్వాణి - సబ్జెర్ భోజాయి)

బలహీనుడు అన్నా, అతని భార్య అన్నా అందరికీ చులకన.

6) నిద్ర చావు ఒక్కటే
(సుత్తోన్ మువ్వో ఎక్కజ్)

నిద్రపోయినవాడికి ఏమి తెలియదు అనే అర్థంలో వాడతారు.

7) ఊరందరిది ఒక దారి ఉలిపికట్టదొక దారి)
(టాండే వాళెరొ ఏక్వాట్ పెంటియార్ ఏక్ వాట్)

గ్రామంలోని వాళ్ళని కాదని వేరుగా మాట్లాడేవారి సందర్భంలో ప్రయోగిస్తారు

8) నోరు మంచిదైతే ఊరు మంచిదే
(మూండో ఆచ్చొరత్తో టాండో సారీ అచ్చొజ్)

నోటి దురుసుగల వాళ్ళ గురించి ప్రస్తావించే సందర్భంలో ఈ సామెత వాడతారు.

9) కూర్చొని తింటే గుట్టైనా కరిగిపోతుంది.
(బ్యాసన్ ఖావతో గట్లాబి ఖుట్వా)

ఏ పని చేయకుండా కూర్చొని తింటే సంపాదనంతా ఆవిరైపోతుంది అనే సందర్భంలో వాడబడుతుంది.

10) సముద్రాన్ని ఈదవచ్చుకాని, సంసారాన్ని ఈదలేము.
(సంద్రేన ప్యారేవాసు పణన్ సంసారమేన ప్యారాని)

సంసారం ముందు సముద్రం చిన్నది అనే సందర్భంలో వాడుతారు.

అలాగే కొన్ని సామెతలు లంబాడీలలో మాత్రమే కనిపించేవి అవి.

1) పొటియాతి పంచాతి తుటేని
(పొట్టోనితో పంచాయితి తెగదు)

పొట్టివాడు ప్రతిసారి ఏదో ఒకటి అడ్డుపుల్ల వేస్తాడు.

2) ఆద్మి ఆంగ్ల అవడ - వాతే హతే సరికి
(మనిషి వేలంత - మాటలు చేతులంత)

చిన్నవాడైనా పెద్ద పెద్ద మాటలు మాట్లాడుతున్నప్పుడు వాడతారు.

3) కాణిన చాందిర్ కొచ్లో మళాతో పాణీ పీన్ పేట్ ఫోల్డిది.
(గుడ్డి దానికి ఇత్తడి కంచం ఇస్తే నీళ్ళు తాగి కడుపు పగలగొట్టుకుది)

వస్తువు విలువ తెలియని వాళ్ళ గురించి ప్రయోగిస్తారు.

4) కుత్రార్ పుంచి ఝలన్ ఖాల్యా ప్యారజు
(కుక్క తోక పట్టుకొని వాగు దాటినట్లు)

మూర్ఖునితో స్నేహం ప్రమాదకరం అనే సందర్భంలో ప్రయోగిస్తారు.

5) ఘాలేవాళో అప్నొ ఆద్మిరత్తో కత్తె ప్యాసతోయి ఏకజ్.
(వడ్డించే వాడు మనవాడైతే ఎక్కడ కూర్చున్న ఒక్కటే)

మన మీద ప్రేమలేని వాళ్ళ గురించి మాట్లాడే సందర్భంలోనిది

6) సో లబ్బారి కరన్ తొయి వాయకర్నొ
(వంద అబద్ధాలు ఆడైనా పెళ్ళి చేయాలి)

మంచి పని చేసేటప్పుడు అబద్ధం ఆడినా పర్లేదు అనే సందర్భంలోనిది.

7) బెబ్రి వాళ్ రత్తా - పాణి వాళొగ
(నది వంకరతే నీళ్ళు వంకరనా)

మనిషి అంగవైకల్యం ఉన్నా మనసు మంచిది

8) దీయో రెత్తాజ్ ఘర్ సర్దలేనో
(దీపం ఉండగానే ఇల్లు సర్దుకోవాలి)

వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

9) కాక్లర్ సరాపేతి బళజ్ మరగే?,
(కాకి శాపంతో ఎద్దు చనిపోతుందా!)

కష్టపడకుండా కృషి లేకుండా ఏ విజయాన్ని అందు కోలేరు.

10) కుత్రాన ఖీర్ ఘాలేతొ కీడా కీడా కన్ కొ కచ్చా
(కుక్కకు పాయసం పెడితే పురుగులు పురుగులు అన్నది)

అడగకుండా ఎవరికి ఏది ఇవ్వకూడదు. అలా ఇస్తే దాని విలువ వాళ్ళకు తెలియదు అనే సందర్భంలో వాడతారు. ఇలా చెప్తూ పోతే సామెతలకు అంతం బహుశా ఉండకపోవచ్చు. మన జీవితంలో ఎన్నో సామెతలు నిలదొక్కుకున్నాయి. అవి ఒకదానికొకటి పెనవేసు కొన్నాయి. సామెతలు సమాజాన్ని ప్రతిబింబించే నిలువు టద్దాలంటే అతిశయోక్తి ఏ మాత్రం కాదని చెప్పవచ్చు.

## సామాజిక చైతన్యం :

**సామెత :** "ధాన్ ఖావు ధణిరోన్ గీద్ గావు విరారో

**అర్థం :** ధాన్ - అన్నం, భావు - తినడం, ధణిరోన్ - భర్తది, గీద్ - పాట, గావు - పాడటం, విరారో - తమ్ముడిది.

**తెలుగు :** "అన్నం తినేది భర్తదైతే పాటపాడేది తమ్ముడిది"

**వివరణ :** ఈ సామెతలో సామాజిక సౌందర్యం తొణికిసలాడుతుంది. సహజంగానే స్త్రీలకుండే లక్షణం ఈ సామెతలో కన్పిస్తుంది. ఇది చాల ప్రసిద్ధమైన సామెత. స్త్రీలు సహజంగా పుట్టింటి వారిపై ఉండే అభిమానం వల్ల ఎల్లప్పుడు వారి గురించే గొప్పలు చెప్పడం మనం వింటూ వుంటాం. పుట్టింటి వారి నగల గురించో లేదా ఏడాదికోసారి పెట్టే చీరల గురించో గొప్పగా మాట్లాడు కోవడం. అదే సమయంలో భర్త ఇంటివారిని తెగడటం. అత్తింటి వారు ఏంచేసినా అందులో వంకలు తీయడం ఆడవాళ్ళలో ఉండే సహజగుణం. దీన్ని మార్చుకోవాలనే ఉద్దేశంతోనే పై సామెత పుట్టుకొచ్చింది.

స్త్రీలు కేవలం పుట్టింటి వారినే కాక మెట్టినింటి వారు చేసే పనులగురించి లేక వారిని గౌరవించే విధంగా మాట్లాడాలని ఈ సామెత బోధిస్తుంది. ఇలాంటి సామెతలు తెలుగులో 'సొమ్మొకరిది సోకొకరిది'. 'తిండి ఎవరిది తింటున్నావో పాటకూడ వారిదే పాడాలి" వంటివి. కాని ఇక్కడ వ్యతిరేకంగా జరిగిన సందర్భంలో ఇలా కాకూడదు అని నీతిని బోధించే ఈ సామెత బంజారా సమాజంలో ప్రసిద్ధిచెందింది.

## ఆధార గ్రంథాలు:

1. తెలుగు సామెతలు - జనజీవనం, తెలుగు అకాడమీ హైదరాబాద్-2009
2. వాఙ్మయి-త్రైమాసిక తెలుగు సాహిత్య పత్రిక - పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాద్- (అక్టోబర్-డిసెంబర్), 2003
3. గంగాధరం నేదునూరి, వ్యవసాయ సామెతలు, విశ్వసాహిత్య మాల, రాజమండ్రి, 1956
4. గోపి-సుద, తెలుగు సామెతలు, పల్లవి పబ్లికేషన్స్, అశోక్ నగర్, విజయవాడ - 10, 2017
5. నరసింహారెడ్డి. తెలుగు సామెతలు, తెలుగు సారస్వత సమాఖ్య, న్యూఢిల్లీ. ప్రత్యేక సంచిక, అక్టోబరు, 1981.
6. బిందు మాధవి మద్దూరి, తెలుగు సామెతలు (గల్పిక/కథాసంకలనం), మాధవి పబ్లికేషన్స్, హైదరాబాద్, 2018.

★

# అంతరించిపోతున్న జానపద కళలు - పరిరక్షణ మార్గలు

- ప్రసన్న లక్ష్మి మాదిరాజు, పరిశోధక విద్యార్థి, తెలుగు విభాగం, ఉస్మానియా విశ్వవిద్యాలయం, హైదరాబాద్.

సువిశాల ఆంధ్రప్రదేశ్‌లో కోట్లాది జనాభాకుతోడు భిన్న మతాలు, ఆచారాలు, సంప్రదాయాల కలబోతతో వైవిధ్యాన్ని కలిగి ఉంది. అలాంటి తెలంగాణలో భిన్న కళారూపాలు, ప్రదర్శింపబడుతూ ఆయా ప్రాంతాల ప్రజలకు వినోదాన్ని కలిగిస్తూ ఉండేవి. కానీ క్రమేపి కళారూపాలు అంతరించిపోతూ అవసానదశకు చేరుకుంటున్నాయి. ప్రభుత్వాలు కళారూపాల పునరుజ్జీవనానికి కంకణబద్ధులై అనునిత్యం శ్రమిస్తున్నా ఆధునిక యుగంలో ఆదరించేవారు సైతం కరువవుతున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో వివిధ రూపాల్లో జానపద కళారూపాలు జనానికి ఆహ్లాదాన్ని కలిగిస్తూ, కళలను వ్యక్త పరిచే కళాకారులకు జీవన మార్గాన్ని సూచిస్తూ, సాంస్కృతిక వికాసాన్ని పంచేవి. కానీ నట్టింట్లోకి వచ్చేసిన టెలివిజన్ మాయలో పడిన జనులకు జానపదకళలు మరింత దూరం కాసాగాయి. క్రమేణా గ్రామాల్లోకి సైతం టెలివిజన్ ప్రసారాలు రావడంతో జానపద రూపాలను తిలకించే వారి సంఖ్య కుంచించుకుపోయింది. ఆంధ్రప్రదేశ్ లో వైవిధ్యమైన జానపదకళలు ప్రదర్శింపబడి గ్రామీణులకు ఉత్సాహాన్ని, సంతోషాన్ని కలిగిస్తూ మానసిక ప్రశాంతతను చేకూర్చే కళలు కనుమరుగయిపోతున్నాయి. నేటికీ కొన్ని ఉన్నా వాటి మనుగడ ప్రశ్నార్థకంగా మారింది. గ్రామీణ ప్రాంతాల్లో పనికి, పాటకు అవినాభావ సంబంధమున్నది. పనితోటే పాట పుట్టింది. పనిలోని అలసటను తెలియకుండా పాటతో మమేకమై పనిచేయడం వలన పని సులువుగా జరగడమే కాకుండా వేగవంతమవుతుంది.

ఇలా పని, పాట సమ్మిళతమైన రంగారెడ్డి జిల్లా గ్రామీణ శ్రమ జీవులకు జీవనంలో భాగమయ్యింది. నాటు వేసేటప్పుడు పాట, కోత కోసేటప్పుడు పాట ఇలా మహిళలు పనిలోని శ్రమను తేలికపాటి చేసుకుంటూ తమ వ్యవసాయ పనులను కొనసాగించేవారు. ఆధునిక వసతుల లేమితో కొట్టుమిట్టాడుతున్న పల్లెల్లో వీధి భాగవతములు, బుర్ర కథలు, నాటకాలు, డ్యాన్సులు, చిందు యక్షగానాలు శ్రమ జీవుల అలసటను దూరం చేసి ప్రశాంతతను చేకూర్చేవి. ఇలా సహజ సిద్ధముగా ఉండే కళా రూపాలకు ఆధునిక వసతులు తోడవడంతో టెలివిజన్ రాకతో మూడు సినిమాలు, ఆరు సీరియల్స్‌గా మారి కళలు కనుమరుగవుతున్నాయి. కానీ నాటి సహజత్వము లోపించి శ్రమైక జీవన సౌందర్యాన్ని మరింతగా పెంచే కళలు లేకపోవడంతో రంగుల లోకంలో విహరించే కళలు నానాటికీ తీసికట్టుగా మారుతున్నాయి. ఇలా రంగారెడ్డి జిల్లాలో జానపద కళలతో పాటు గ్రామీణ జీవనంలో మమేకమైన అనేక ఆటపాటలు, కళారూపాలు కానరాక పల్లె సహజత్వము పలుచబడుతోంది.

జానపద కళారూపాలు అంటే జానపదంలో నివసించే జనులు పాడుకునే కళారూపాలకు జానపదమని పేరు. జానపదులు అంటే గ్రామీణ ప్రాంతాల్లో నివసించేవారని వారు ఆడుకునే ఆటలు, పాడుకునే పాటలు, ఇతర కళలను జానపద కళలు అని పిలుస్తారు. అలనాటి ఆచార, సంప్రదాయాల కలబోతతో కూడిన కాలములో పల్లెల్లో తమ మానసిక ప్రశాంతత కోసం జానపద కళారూపాలు ఎంతగానో తోడ్పడే రాజుల కాలములోనూ ఇలాంటి కళలను ప్రోత్సహించి పల్లె జీవనాన్ని మరింత ప్రశాంతమయం చేసే వారు. ముఖ్యంగా పండుగల సమయంలో రాత్రి వేళల యందు ప్రదర్శించే వారు. గ్రామ పెద్దలు, ప్రముఖులు, కుల పెద్దలు తమకు తోచిన సాయం చేసి వారికి జీవనోపాధి కల్పించేవారు. అంతే కాకుండా గ్రామాల్లో మరణాలు సంభవించి పెద్ద కర్మ చేసిన అనంతరం కథలు చెప్పించడం నేటికీ ఆనవాయితీగా వస్తోంది. ఇలా చేయడం వలన ఆయా కుటుంబంలో వ్యక్తి మరణించినాడన్న మనోవేదన

మాసిపోయి పూర్వ స్థితికి రావడానికి కథలు చెప్పడం వలన జరుగుతుంది అని నమ్ముతారు. అంతేకాకుండా ఆయా గ్రామంలోని వారందరూ ఆ కుటుంబానికి బాసటగా నిలిచే అవకాశముంటుంది.

తద్వారా సమిష్టితత్వము బలపడి ఆహ్లాదకరమైన వాతావరణం ఏర్పడుతుంది. అంతేకాకుండా గ్రామంలోని పిల్లలు ఆడుకునే కోతి కొమ్మచ్చి, గోళీలాట, వంగుడు దుంకుడు, చిర్రగోన, బొమ్మలాట లాంటివి సహజంగానే వ్యాయామాన్ని కలిగిస్తూ సృజనాత్మకతను పెంపొందిస్తాయి. కానీ మార్కెట్ మాయాజాలంలో చిక్కుకున్న ఆధునిక యుగంలో సెల్‌ఫోన్‌లోనే ఆటలను తిలకిస్తూ శారీరక శ్రమ లేక అనారోగ్యాన్ని కొని తెచ్చుకుంటున్నారు. ఇలా భవిష్యత్తు భారత్‌ను బంగారుమయంగా మార్చాల్సిన భావి పౌరులే ఇలా మారితే ఆరోగ్యదాయకమైన సమాజ నిర్మితమవుతుందా అన్నదే వేధిస్తున్న ప్రశ్న. దానికి తోడు ఉమ్మడి కుటుంబాలు తగ్గిపోయి చిన్నపిల్లలను ఆటలాడించేవారు కరువయ్యారు.

తల్లిదండ్రుల ఉద్యోగానికి ఆటంకముగా మారుతున్నారని సెల్‌ఫోన్ చేతికిచ్చి ఆడుకొమ్మని చెప్పే తల్లిదండ్రుల సంఖ్య క్రమేపి పెరుగుతోంది. అంతేకాకుండా గత్యంతరం లేక టెలివిజన్ ఆన్‌చేసి పిల్లలను ఇంట్లో వదిలి వెళ్లే వారు కూడా అధికమవుతున్నారు. అంగట్లో సరుకును ఆకర్షణీయంగా చూపించి సొమ్ము చేసుకునే సంస్కృతి అధికంగా గల టెలివిజన్ ప్రసారాలతో భవిష్యత్తు జాతి నిర్మాతలైన భావి పౌరులు ఆకర్షితులవుతున్నారు. విష సంస్కృతిని విరివిగా చూపించే ప్రసార మాధ్యమాలు చిరు మెదళ్లను కలుషితం చేస్తున్నాయి. వావి వరుస లేని కథనాలు అడ్డగోలు జీవితాలకు బాటలు పరుస్తున్నాయి. తాత్కాలిక సంతోషం కోసం విలువలు లేని పౌరులుగా మారడానికి దోహదపడుతున్నాయి. గ్రామాల్లో ప్రదర్శించే ఏ తరహా ప్రదర్శనలోనైనా ఏదో ఒక జీవిత సారం ముడిపడి ప్రేక్షకులను ఉత్తేజపరచడంతో పాటు జీవన విలువలను పెంపొందించే విధంగా విలువలతో కూడిన సమాజాన్ని నిర్మించే విధంగా ఉండి గ్రామాల్లో బంధాలు, బంధుత్వాలు బలపడి మంచి వాతావరణం ఏర్పడేది.

వీధి భాగవతములు, బుర్ర కథలు, చిందు యక్ష గానాలు, కోలాటం మరియు భజన తదితర ఆటల్లోనూ రాజుల గొప్పతనం గురించిగాని, విలువలు పెంపొందించే కథలు కాని, ఇతర ఆటవిక దురాచారాల గురించి కాని చెప్పి వాటిని పాటించడం వలన కలిగే వ్యయ, ప్రయాసలు వివరించి తద్వారా పల్లె ప్రజలందరు మంచిని పాటించే విధంగా తోడ్పడేవి. నిరక్షరాస్యులు అధికంగా ఉండే ఈ జిల్లా గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు ఇలాంటి కళా రూపాల ద్వారా సులువుగా అర్థమయ్యేవి. అందుకే ప్రభుత్వాలు కూడా గ్రామీణ ప్రాంతాల్లో పథకాల ప్రచారం కోసం, సామాజిక దురాచారాలను రూపుమాపడానికి నేటికి కథల రూపంలో ప్రదర్శించడం జరుగుతున్నది.

ఆంధ్రప్రదేశ్‌లో అంతరించిపోతున్న జానపద కళలను కాపాడుకోవాల్సిన బాధ్యత నేటితరంపై అధికంగా ఉన్నది. ఆధునిక యుగంలోనూ జానపద కథలను జానపదకళలను అధునీకరించాల్సిన అవసరమున్నది. సహజత్వముతో ఉట్టిపడే జానపద కళారూపాలను సంరక్షించుకోవాలి. మానవ జీవనయానాన్ని మరింతగా మెరుగుపరిచే జానపద కళలు శ్రమ జీవన సౌందర్యాన్ని మరింతగా పెంపొందించే విధంగా చేయాలి. అలనాటి ఆటల మాధుర్యాన్ని రానున్న కాలానికి పదిలంగా అందిస్తేనే గ్రామీణ జీవన ముఖ చిత్రం సులువుగా అర్థమవుతుంది. ఆంధ్రప్రదేశ్‌లో గ్రామాల కలబోతతో కూడిన ఆంధ్ర ప్రాంతంలో గ్రామీణ జనులకు జానపద కళారూపాలు మానసిక ప్రశాంతత ఎంతగానో చేకూరుస్తాయనడంలో ఎలాంటి సందేహం లేదు. కళల కాణాచిగా పేరు గాంచిన తెలంగాణ లోని కళా సంపద రాబోవు తరాలకు అందించే విధంగా ప్రతి ఒక్కరూ పాటుపడాలి. ముఖ్యంగా గోదావరి, ప్రకాశం జిల్లాలో అన్ని మండలలో జానపద కథలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వాలతో పాటు నేటి తరంపై ఉంది.

జానపద కథలు- పరిరక్షణ మార్గాలు: జానపద కథలకు కాణాచి తెలంగాణ. తెలంగాణ కథలు సంస్కృతిలో భాగమైన జానపద కళారూపాలు సంస్కృతిని కాపాడుకుంటూ మనుగడ సాగిస్తున్నాయి. జాతిజనుల అస్తిత్వానికి, వాళ్ల అనుభూతులకి ప్రతీకలు జానపద కళలు. అవి కనుమరుగు కావడమంటే ఓ సంస్కృతి కాలగర్భంలో కలవడమే. అందుకే వాటిని పరిరక్షించు కోవాలి. సంస్కృతీ సంప్రదాయాలకు నిలయమైన మన ఆంధ్రప్రదేశ్‌లో జానపద కళారూపాలు వందకు పైగా ఉన్నాయి. ఇవి తెలంగాణ సంస్కృతికి అద్దం పడు తున్నాయి. ఒక కులం సంస్కృతీ సంప్రదాయాలను, ఆ కులపుట్టు పూర్వోత్తరాలను ఈ కళారూపాలు వివరిస్తాయి. ఈ కళారూపాలు ప్రదర్శించే వారిని ఉపకులాలకు చెందిన వారిగా, హక్కుదార్లుగా పిలుస్తూ, వారి కళారూపా లను ఆశ్రిత కళారూపాలుగా పిలుస్తున్నారు. ఈ కళా రూపాల ప్రదర్శన విధానాన్ని బట్టి తొమ్మిది రకాలుగా వర్గీకరించవచ్చు. అందులో బొమ్మలాటలు, అనుష్టాన కళారూపాలు, వాద్య కళారూపాలు, పటం కథలు, ఇంద్రజాల ప్రదర్శనలు, నృత్యాలు, కథాగాన కళా రూపాలు వేషాలతో కూడిన కళారూపాలు, భజనదాయ కళారూపాలు తదితరాలు ఉంటాయి.

ఏవైనా జన జీవన స్రవంతిలో ఉండాలంటే అను నిత్యం వాటి ఉపయోగం తప్పకుండా జరగాలి. అది కేవలం జానపద కథలు మాత్రమేనని చెప్పలేం. జానపద కథలు జన వ్యవహారంలో ఉంచాలంటే నిత్యం జనసమూహాలకు ఈ కథలకు సంబంధించిన విషయా లను పరిచయం చేస్తుండాలి. లేనిచో ప్రజాదరణ పొందకుండా కనుమరుగౌతాయి. జానపద కథా రూపా లను పండుగలు, పబ్బాలు, జాతరలు లాంటి సమయాల్లో, జనసందోహం ఎక్కువ వుండే ప్రాంతాలలో ప్రదర్శింపజేయాలి. ఇలా చేయడం వల్ల జానపద కథలపై ఆసక్తిని పెంచుకుంటారు. వీటి సన్నివేశాలు జనాకర్షణగా ఉండాలి.

నీతి నియమాలను తెలిపే నాటకాలను ప్రదర్శింప చేయాలి. నేటి సమాజానికి ఇలాంటి జానపద కళా రూపాలు ఎంతో ఉపయోగకరం. ఎందుకంటే ఆధునిక కాలంలో పాశ్చాత్య ధోరణులతో, నేటి ప్రపంచీకరణ వల్ల యువత పెడదోవపడుతున్నారు. నీతి నిజాయితీలతో మెలిగిన గొప్ప ఆదర్శ వ్యక్తుల పాత్రలతో నాటకాలను వేయించాలి. ఇలాంటి నాటకాలను చూసినప్పుడైనా ఏదో ఒక మూలన మనం చేస్తుండేది తప్పని ప్రేక్షకులకు తెలుస్తుంది. పురాణ ఇతిహాసాలలోని ఆదర్శప్రాయమైన వ్యక్తుల పాత్రలను తీసుకొని వీధినాటకాలు వేయించాలి. ఉదా: రామాయణంలోని సీతా, రాముల అన్యోన్య దాంపత్యానికి నిదర్శనం. పరమభక్తి భావానికి హను మంతుడు, అన్నదమ్ముల అనుబంధాలకు గుర్తుగా రామ లక్ష్మణ, భరత, శత్రఘ్నులు, భారతంలోని పాండవులు వంటి పాత్రలను ప్రదర్శింపజేయాలి. దేశం కోసం పోరాటం చేసిన స్వతంత్ర్య సమరయోధుల జీవిత విశేషాలను ప్రదర్శింపజేయాలి. ఉదా: గాంధీ జీవిత విశేషాలు, సుభాష్ చంద్రబోస్, నెహ్రూ వంటి వారి పాత్రలు, జానపద కథలు అంటే ప్రాచీన సాహిత్యానికి పరిమితం కాకుండా మారుతున్నసమాజానికి అను గుణంగా కొత్తకొత్త పోకడలతో జానపద కథలను రాసి ప్రదర్శనల ద్వారా ప్రదర్శింపజేయాలి. సమాజ హితం కోసం పోరాడిన ఎందరో సంఘసంస్కర్తల జీవిత విశేషా లను జానపద కథలరూపాలలో ప్రదర్శింపజేయాలి. ఉదా: వివేకానందుడు, కందుకూరి వీరేశలింగం పంతులు వంటి వారు. ప్రభుత్వం చొరవచూపించి ప్రదర్శకులను జిల్లా, మండల, పంచాయితీ గ్రామస్థాయిల నుండి ఆహ్వానించి వారికి కొన్ని సదుపాయాలు కల్పించి ప్రదర్శనకు అవకాశం కల్పించాలి. నేటి రోజులలో పురాణ, ఇతిహాస పఠనాలు కనుమరుగవుతున్నాయి. శాస్త్ర సాంకేతిక రంగవిభాగం దూసుకుపోతుంది. ఇలాంటి వాటికి ధీటుగా పురాణేతిహాసాలలోని ముఖ్య ఘట్టాలను ఆధునిక భాషలో రాయించి ప్రత్యేక తీర్పుదును ప్రదర్శకు లకు ఇచ్చి వారి చేత ప్రదర్శింపజేయాలి. ఇలా చేయడం వల్ల పురాణ ఇతిహాసాలలోని పుణ్య వ్యక్తులను గూర్చి

ప్రజలకు తెలుస్తుంది. నేటి కాలంలో అనువర్తిత జానపద విజ్ఞానం చాలా ప్రాచుర్యంలోవుంది. కాబట్టి నేటి తరాలకు ఉపయోగపడే అంశాలతో జానపద కథలను ప్రదర్శింప చేయాలి.

మానవులలో నిభిడీకృతమైన నైపుణ్యాలను బయటకు తెచ్చేందుకు జానపద కథలు ఎంతో ఉపయోగడపతాయి. ప్రతివారిలోనూ ఏదో ఒకరకమైన నైపుణ్యం అంతర్గతంగా దాగి వుంటుంది. వాటిని వెలికి తీసేందుకు కళలు సహాయపడతాయి. ఉదాహరణకు కొందరు రాజకీయ నాయకులలాగా మాటలు అనుకరిస్తారు. కొందరు సినీనాయకులు, ప్రతి నాయకులు వంటి వారిని అనుకరిస్తారు. మరికొందరు ప్రకృతిలోని జంతు జాలాల అరుపులు, వాహనాల రణగొణ ధ్వనులు సైతం అనుకరిస్తారు. పాఠశాల, కళాశాల స్నాతక, స్నాతకోత్తర స్థాయిలలో నాటకాలను పాఠ్య ప్రణాళికల్లో పాఠ్యాం శాలుగా పెట్టాలి. కేవలం పాఠ్యాంశంగా మాత్రమే కాకుండా జానపద కళలను విద్యార్థులచేత ప్రదర్శింప జేయాలి. అలా చేయడం వల్ల పిల్లలలో అభివ్యక్తి భావాలు పెరుగుతాయి. విద్యార్థులకు ఒక అంశం ఇచ్చి ఆ అంశం మీద జానపద కళలను స్వయంగా రాసి వాటిని విద్యా నిలయాల్లో ప్రదర్శింప జేయాలి. చేయడం వల్ల విద్యార్థులలో సృజనాత్మక శక్తి పెరుగుతుంది. కొందరు వక్తలుగా, కొందరు నాటక కర్తలుగా మరికొందరు సంగీత కళాకారులుగా భవిష్యత్‌లో ఎదగగలరు. నేటి సమాజంలో జానపద కళలు మనగలగాలంటే వీడియో, ఆడియోల రూపంలో చిత్రించి ప్రజలకు అందేవిధంగా కృషి చెయ్యాలి. చిత్రించిన వాటిని అంతర్జాలంలో నిక్షిప్తం చెయ్యాలి. ప్రజలకు చేరువయ్యేలా చూడాలి. నేటి సమాజంలో హత్యలు, వరకట్న సమస్యలు, మాన భంగాలు, హింసాకాండలు, అసాంఘిక చర్యలు మొదలైనవి ఎక్కువ అయ్యాయి. వీటిని నివారించేందుకు ప్రజలలో చైతన్యం తెచ్చేందుకు కొన్ని చైతన్య పూరిత జానపద కథలు రాసి కళాకారులచేత ప్రదర్శింపజేయాలి. ఈ విధంగా చేయడం వల్ల అసాంఘిక కార్యకలాపాలు తగ్గి మానవతా విలువలు పెరుగుతాయి. పైన తెల్పిన పరిక్షణలే కాకుండా సమాజంలో ప్రతి ఒక్కరూ జానపద కథలపై మక్కువను పెంచుకోవాలి. వాటిలో వుండే సారాన్ని గ్రహించాలి. స్వయంగా పాత్రలను అనుస రించేలా వుండాలి. కళాకారులను ప్రజలు చేరదీసి ప్రోత్సాహకాలు ఇవ్వాలి. అట్లాగే ప్రభుత్వం తరపున జానపద కథల ప్రదర్శనలకు సహాయ సహకారాలు అందించాలి. అలాగే కళాకారులకు గౌరవవేతనం ఇవ్వాలి. ఈ విధంగా మనం జానపద కథలను అంతరించి పోకుండా కాపాడుకోవచ్చు.

జానపద విజ్ఞానం సంస్కృతికి సంబంధించిందనే విషయంలో అందరికీ ఏకాభిప్రాయం ఉంది. సంస్కృతి ఆదిమానవుని కాలం నుంచి నేటి నాగరిక మానవుని వరకు ఆయాకాలాల్లో మనిషి తన అభివృద్ధి కోసం చేసివున్న కృషికంతటికి వర్తిస్తుంది. తరతరాల సంప్రదాయాలను కాపాడుకుంటూ వస్తున్న జననము దాయానికి పర్యాయంగా దీనిని ఉపయోగించాలనీ స్పష్టంగా అర్థం చేసుకోవచ్చు.

జానపద సాహిత్యం గాని, ఇతర రూపాలుగాని ఎక్కువగా గ్రామాల్లోనే లభిస్తాయనడంలో సందేహం లేదు. జానపదులంటే గ్రామీణులని మాత్రమే అర్థం కాదు. ఏ ఒక్క విషయంలోనైనా భావసామ్యం కలిగిన జన సముదాయమంతా జానపదులు. వీరు ఒక భాషకు సంబంధించి లేదా ఒక భౌగోళిక ప్రాంతంలో నివసిస్తూ ఉండటం లేదా ఒక జాతికి, మతానికి లేక వృత్తికి సంబంధించిన వారై ఉండవచ్చు. ఐతే ఈ జనుల గుంపుకు తమవి అని చెప్పుకోగలిగిన సంప్రదాయా లుండాలి.

ఒక సమాజంలో నివసిస్తున్న ప్రజల జీవన సరళిని జీవిత దృక్పథాన్ని ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక భావ జాలాన్ని జానపద సాహిత్యంలో గమనించవచ్చు. ఇలాంటి అంశాలను ప్రతి ఫలింపచేస్తూ ప్రజల జీవనంలో భాగమై పుట్టుకొచ్చినవి జానపద కథలు. జానపద కథలు ప్రయోజనాన్ని ఆశించి పుట్టలేదు. పుట్టిన తర్వాత

ప్రయోజనాన్ని సంతరించుకుంటాయి. జానపద కథలు మౌఖిక ప్రచారంలో ఉండడం వల్ల చాలా మార్పులకు లోనౌతాయి. జానపద కథలు ప్రాంతాలన్ని బట్టి మారుతూ ఉంటాయి.

**ఆధార గ్రంథాలు :**

1. తెలుగు సారస్వత సమాఖ్య, న్యూఢిల్లీ ప్రత్యేక సంచిక అక్టోబరు, 1981, 'తెలుగు సామెతలు' (వ్యాసం), పుట- 18.
2. మోహన్ జి.ఎస్, జానపద విజ్ఞానాధ్యయనం, (ద్రావిడ విశ్వ విద్యాలయం) విజయవాణి పబ్లికేషన్స్.
3. రాధాకృష్ణ రామరాజు మిక్కిలినేని, తెలుగువారి జానపద కళారూపాలు, 2002
4. సూర్యాధనంజయ్.డా, నల్లగొండ జిల్లా బంజారా సాహిత్యం- జీనవచిత్రణ, శీతల్ పబ్లికేషన్స్, 2009
5. సుబ్రహ్మణ్యశాస్త్రి చిలుకూరి డా॥ : తెలుగు సామెతలు (వ్యాసం), స్రవంతి, ఫిబ్రవరి, 1980.

★★★

భావవీణ
September 2024

# BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

ISSN No. 2456-4702

RNI No. APTEL/2003/12253

## Southern Private Lecturers Teachers Organisation (SPLTO) ఆధ్వర్యంలో డా॥. సర్వేపల్లి రాధాకృష్ణన్ జాతీయ ప్రతిభా పురస్కారాల ప్రధానోత్సవం, 25-08-2024.



ఎమ్మెల్సీ లక్ష్మణరావు గారిని ఘనంగా సన్మానిస్తున్న ఎస్.పి.ఎల్.టి.ఓ కార్యవర్గ సభ్యులు.


గుంటూరు పశ్చిమ నియోజకవర్గం శాసనసభ్యులు శ్రీమతి గల్లా మాధవి గారిని సన్మానిస్తున్న ఎమ్మెల్సీ లక్ష్మణరావు గారు.



గుంటూరు తూర్పు నియోజకవర్గం శాసనసభ్యులు శ్రీ నజీర్ అహ్మద్ గారిని సన్మానిస్తున్న ఎమ్మెల్సీ లక్ష్మణరావు గారు & ఎ.పి.టి.ఎల్.ఓ. కార్యవర్గం.



ఆంధ్ర క్రైస్తవ న్యాయ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. మోజెస్ గారిని సన్మానిస్తున్న ఎమ్మెల్సీ లక్ష్మణరావు గారు.



ఆంధ్ర క్రైస్తవ న్యాయ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ రాణి శ్రీ అమృత వర్షిణి గారిని సన్మానిస్తున్న ఎమ్మెల్సీ లక్ష్మణరావు గారు.



ఎమ్మెల్సీ లక్ష్మణరావు గారి చేతుల మీదుగా డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జాతీయ ప్రతిభా పురస్కారం అందుకుంటున్న డాక్టర్ పిట్టా శాంతి, ప్రిన్సిపాల్, జి.వి.ఆర్. కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్, శ్రీ వై.ఎన్. కాలేజ్, నర్సాపూర్, పశ్చిమ గోదావరి జిల్లా.

Edited, Printed and Published by Dr. P. Nagaiah, # 135-14-716, Dwaraka Nagar, 12th Lane, Nagaralu, Guntur - 522034. Cell : 9949929674, 7989088274.
E-mail : bhavaveena2024@gmail.com, Printed at : GLS Graphics, Guntur - 2. Ph. 9494660509.